ఆంధ్రజ్యోతి 5 ప్రకాశం
శుక్రవారం 29, నవంబరు 2024



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఇళ్ల నిర్మాణాల లక్ష్యం పూర్తిచేయాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా

6



పూలే విగ్రహానికి నివాళి అర్పించిన మంత్రి, కలెక్టర్

జ్యోతిబా పూలేకు ఘన నివాళులు

- జిల్లావ్యాప్తంగా వర్ధంతి కార్యక్రమాలు నిర్వహణ
- ఒంగోలులో పాల్గొన్న మంత్రి స్వామి, కలెక్టర్
- పూలే స్ఫూర్తితో సమ సమాజ స్థాపనకు కృషిచేయాలని పిలుపు

ఒంగోలు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతి కార్యక్రమాలు గురువారం జిల్లావ్యాప్తంగా జరిగాయి. ఒకవైపు ప్రభుత్వ పరంగా బీసీసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగానూ, మరోవైపు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలోనూ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలలో పూలే విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలల వేసి నివాళులర్పించారు. ఒంగోలులోని కొత్త కూరగాయల మార్కెట్ సెంటర్ వద్ద ప్రభుత్వపరంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీతోపాటు పలువురు అధికారులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక డీసీసీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బి.ఆర్.గౌస్, పాలపర్తి విజేష్‌రాజ్‌లు, అలాగే వైసీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ సమన్వయ కర్త చుండూరి రవిబాబు.. పూలే చిత్రపటాలకు నివాళులర్పించారు. ఎర్రగొండపాలెంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు నివాళులర్పించగా జిల్లావ్యాప్తంగా వివిధ వర్గాలకు చెందిన వారు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలో వక్తలు మాట్లాడుతూ పూలే స్ఫూర్తితో సమసమాజ స్థాపనకు కృషిచేయాలని పిలుపునిచ్చారు.

సచివాలయ సిబ్బందిని రేషనలైజేషన్ చేయాలి : మంత్రి 6

నగర పాలనకు పన్నుపోటు

- 300కు పైగా ప్రభుత్వ భవనాలకు పేరుకుపోతున్న బకాయిలు
- రూ.40 కోట్ల పెండింగ్‌కు రూ.కోటి మాత్రమే వసూలు
- ప్రైవేటు ఆస్తులవి రూ.50కోట్లు.. చెల్లింపులు రూ.20 కోట్లు
- తాగునీటి బకాయిలు రూ.10కోట్లు.. వసూలు రూ.1కోటి
- నిధులు లేక నీరసించిన ఒంగోలు నగరపాలక సంస్థ



ఒంగోలు కార్పొరేషన్‌కు పన్ను బకాయిలు గుదిబండలా మారాయి. ఏటేటికీ అవి కొండలా పేరుకుపోతున్నాయి. నగర పాలక సంస్థ అభివృద్ధికి జవసత్వాలు ఇచ్చేది ఆర్థిక వనరులే. పన్నుల బకాయిలు కోట్లలో పేరుకుపోవడంతో ఖజానా వెలవెలబోతోంది. యంత్రాంగంలో అలసత్వం, పన్నుదారుల్లో నిర్లక్ష్యమే ఇందుకు కారణం. ప్రధానంగా ప్రభుత్వ ఆస్తుల పన్ను బకాయిలు పెద్ద తలనొప్పిగా మారాయి. 2002 నుంచి బడ్జెట్ లేదనే కారణంతో ఆయా శాఖల నుంచి చెల్లింపులు లేకపోవడం, రెవెన్యూ విభాగం పట్టించుకోకపోవడంతో కోట్లలో బకాయిలు ఉన్నాయి. తాజాగా పన్ను వసూలుకు గడువు ముంచుకొస్తుండడంతో ఇప్పుడు వసూళ్లకు అధికారులు నానా తంటాలు పడుతున్నారు. ప్రధానంగా ఆయా డివిజన్ల వారీగా కేటాయించిన ఆర్ఐలు, సచివాలయ సెక్రటరీలకు బకాయిల వసూలు అన్నది కత్తి మీద సాములా మారింది.

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరపాలక సంస్థకు పన్ను పోటు పెరిగింది. జిల్లా కేంద్రంలో ఉన్న 300 ప్రభుత్వ భవనాలకు సంబంధించి అసలు రూ.15 కోట్లు పన్ను బకాయి ఉండగా, వడ్డీ రూ.25 కోట్లు ఉంది. దీంతో రూ.40కోట్లు ప్రభుత్వ బకాయిలు ఉండగా, ప్రైవేటు ఆస్తులకు సంబంధించి రూ.34 కోట్లు వసూలు కావాల్సి ఉండగా, పాత బకాయిలు మరో రూ.14 కోట్లు ఉన్నట్లు సమాచారం. మొత్తం ప్రైవేటుది రూ.50 కోట్లు బకాయి ఉంది. ఇందుకు సంబంధించి ఇటీవల పన్నుల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. దీంతో సుమారు రూ.20 కోట్లు వరకు వసూళ్లైనట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

ప్రభుత్వ భవనాల బకాయిలు రూ.40 కోట్లు

నివాస గృహాల ఇంటిపన్నును ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్న నగరపాలక సంస్థ.. ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సిన వాటిపై ఉదాసీనంగా వ్యవహరిస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. కొన్నేళ్లు పన్నులు చెల్లించకపోవడంతో అపరాధ రుసుం కూడా తోడై బకాయిల భారం మరింత పెరిగింది. వాస్తవానికి 2002 నుంచి ఇప్పటివరకు పన్నులు రూ.15కోట్లు బకాయిలు వసూలు కావాల్సి ఉండగా, వడ్డీ రూ.25 కోట్లకు పెరిగింది. దీంతో ఆయా శాఖల నుంచి రూ.40 కోట్లు రావాల్సి ఉంది. అందులో ప్రధానంగా పోలీసు శాఖ, ప్రకాశం భవనం, కోర్టు, డీఆర్‌డీఏ, ఆర్అండ్‌బీ, ఎన్నెస్పీ, పంచాయతీరాజ్, బీసీ కార్పొరేషన్, జిల్లా పరిషత్, డ్వామా, రిమ్స్ భవనాల బకాయిలే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే కార్పొరేషన్ రెవెన్యూ యంత్రాంగం కేవలం నోటీసులతోనే సరిపెడుతుండగా, ఆయా ప్రభుత్వ శాఖలు సైతం పెద్దగా స్పందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి కొన్ని శాఖలు అప్పుడప్పుడు చెల్లింపులు చేస్తుండగా

మిగతా 6లో...

అత్యధిక బకాయి ఉన్న ప్రభుత్వ భవనాలు

ఎస్పీ కార్యాలయం	రూ.3.53 కోట్లు
ప్రకాశం భవనం	రూ.6.85 కోట్లు
కోర్టు భవనాలు	రూ.80 లక్షలు
డీఆర్‌డీఏ	రూ.3.19 కోట్లు
ఆర్అండ్‌బీ	రూ.1.85 కోట్లు
ఎన్నెస్పీ	రూ.1.17 కోట్లు
పంచాయతీరాజ్	రూ. 77 లక్షలు
బీసీ కార్పొరేషన్	రూ. 1.65 కోట్లు
జిల్లా పరిషత్	రూ. 4.35 కోట్లు
డ్వామా	రూ. 80 లక్షలు
రిమ్స్ భవనాలు	రూ. 1.55 కోట్లు



పన్నుల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం
కే వెంకటేశ్వరరావు, నగర కమిషనరు



కొన్నేళ్లుగా ప్రభుత్వ భవనాల నుంచి కోట్లలో పన్ను బకాయిలు పెండింగ్ ఉన్నట్లు గుర్తించాం. బడ్జెట్ లేని కారణంగా చెల్లించడం లేదని తెలిసింది. ఈ విషయాన్ని ఆయా శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. అలాగే ప్రైవేటు ఆస్తులు, నీటి పన్నుల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. రెవెన్యూ సెక్షన్‌తో పాటు, గతంలో ఆర్ఐలుగా పనిచేసిన వారికి, సచివాలయ సెక్రటరీలకు ఆ బాధ్యతలు అప్పగించాం. మార్చి 31 నాటికి నూరుశాతం వసూలే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించాం. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారికి మెమోలు జారీచేస్తాం. లక్ష్యాలు సాధించని వారికి అపరాధ రుసుం విధిస్తాం. ఆర్థిక లోటు ఉన్న కార్పొరేషన్‌ను బలోపేతం చేసే దిశగా ఆదాయ వనరులపై దృష్టి సారించాం.



వెలుగువారిపాలెంలో ఎర్రకొండ మట్టిని తవ్వి టిప్పర్‌కు నింపుతున్న ఎక్స్‌కవేటర్

ఎర్రకొండ పిండి..

అనుమతులు గోరంత.. తరలింపు బోల్డంత

వెలుగువారిపాలెం కొండ రూపురేఖలు మాయం

జాతీయ రహదారి నిర్మాణానికి యథేచ్ఛగా తవ్వకాలు

తాళ్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలుగువారిపాలెం ఎర్రకొండను యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. దీంతో కొండ రోజురోజుకూ రూపురేఖలు కోల్పోతోంది. అనుమతులకు మించి గ్రావెల్‌ను తవ్వుతున్నారు. బెంగళూరు హైవే నిర్మాణం పేరిట ఇక్కడ నుంచి యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు. బెంగళూరు నుంచి తాళ్లూరు ప్రాంతం మీదుగా గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి మంజూరైంది. గత ఏడాదిగా ఈ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. హైవే నిర్మాణ మార్గమధ్యంలో వెలుగువారిపాలెం వద్ద సర్వే నంబర్ 489లో 664 ఎకరాల్లో ఎర్రకొండ ఉంది. రోడ్డు నిర్మాణానికి కొండ దగ్గరగా ఉండటంతో కాంట్రాక్టర్ మట్టి, గ్రావెల్ కోసం రెవెన్యూ అధికారులకు, గ్రామ పంచాయతీకి దరఖాస్తు పెట్టారు. అప్పటి తహసీల్దార్ కొండను పరిశీలించి పంచాయతీ తీర్మానం మేరకు ఒకటిన్నర హెక్టార్‌లో మట్టిని తవ్వేందుకు మైనింగ్ అధికారులకు ప్రతిపాదనలు పంపారు.ఆ మేరకు మైనింగ్ అధికారులు అనుమతి లభించింది.

అనుమతి ఒకటిన్నరే.. తవ్వేది 25హెక్టార్లలో

అనుమతులు గోరంతగా పొంది తరలింపు మాత్రం కొండంతగా ఉంది. ఈక్రమంలో రోడ్డు నిర్మాణం కోసం ఎర్రకొండ మట్టిని భారీగా తరలించటంతో కొండ పూర్తిగా రూపురేఖలు మారింది. దాదాపు 25హెక్టార్లకుపైగా కొండమట్టిని, గ్రావెల్‌ను తరలించారు. అనుమతికి మించి మట్టిని తోలుతున్నా అప్పట్లో వైసీపీ నాయకులు భారీస్థాయిలో ముడుపులు తీసుకుని మిన్నకున్నారన్న విమర్శలు వచ్చాయి. గత ఏడాది ఫిబ్రవరిలో అనుమతి పొంది మార్చి నుంచి ఆ మట్టిని తోలటం ప్రారంభించారు. గత ప్రభుత్వంలో హద్దులు దాటి కొండలో తవ్వకాలు చేస్తున్నా అధికార యంత్రాంగం మామూళ్ల మత్తులో మునిగిందన్న విమర్శలు వచ్చాయి. కొందరు రెవెన్యూ అధికారులు వెళ్లి పరిశీలించారు కూడా. అయితే ముడుపులు తీసుకుని అక్రమ తవ్వకాల గురించి ఉన్నతాధికారులకు నివేదిక పంపలేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి.

కొత్త ప్రభుత్వం వచ్చినా ఆగలేదు

కూటమి ప్రభుత్వంలో

మిగతా 6లో...



ముండ్లమూరు సమీపంలోని శ్రీరామ్ డెయిరీలో తనిఖీలు

పలు పాల ఉత్పత్తులపై అనుమానాలు

శ్యాంపిల్స్ తీసి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపిన అధికారులు

డెయిరీలో పన్నీరును పరిశీలిస్తున్న అధికారి ప్రభాకరరావు, సీఐ, ఎస్సై

కల్తీ కలకలం!

ముండ్లమూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రగిరిలో గత కొన్నేళ్లుగా శరణ్య డెయిరీ, శ్రీరామ్ డెయిరీల్లోని పలు పదార్థాలలో కల్తీ జరుగుతున్నట్లు ఆరోపణలు రావడం, అధికారుల తనిఖీలతో కలకలం రేగింది. కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ ఆదేశాల మేరకు జిల్లా ఆరోగ్య భద్రతా అధికారి, సిబ్బంది, దర్శి సీఐ వై.రామారావు, ఎస్సై వై.నాగరాజు సంయుక్తంగా గురువారం ఉదయం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఆరు రకాల పాల పదార్థాల తయారీపై అనుమానాలు వ్యక్తం చేస్తూ శ్యాంపిల్స్ తీసి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపారు. ప్రధానంగా పన్నీరు, నెయ్యి, పాలకోవా, బటర్ నాన్ లాంటివి తయారు చేసి తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్, వివిధ పట్టణాలకు సరఫరా చేస్తున్నారు.

అత్యాశకు పోయి..

నెయ్యి కేజీ హైదరాబాద్ నగరంతో పాటు పలు ప్రాంతాల్లో రూ.1400 ఉంది. శ్రీరామ్ డెయిరీ సరఫరా చేసేది కేవలం రూ.400 ధర మాత్రమే ఉండడంతో అనుమానాలు వ్యక్తమయ్యాయి. వీటితోపాటు పన్నీరు, పాలకోవా లాంటివి కూడా ఇతర మార్కెట్‌లో ఉండే ధరలకంటే తక్కువకు విక్రయిస్తుండటంతో అనుమానాలకు ఊతమిచ్చింది. ఈ దాడుల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు నర్సింహులు, శివతేజ, వీఆర్వో దయానందం, పాల్గొన్నారు.

ముందస్తు సమాచారంతో..

గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్న వ్యాపారంపై అనుమానాలు రావటంతో తనిఖీలు నిర్వహించినట్టు జిల్లా ఆరోగ్య భద్రతా అధికారి ప్రభాకరరావు తెలిపారు. పాలపొడితో పలు రకాల వస్తువులు తయారు చేసిన విషయాన్ని గుర్తించారు. ముందుగానే ఎస్సై నాగరాజుకు అందిన సమాచారం మేరకు తనిఖీ చేశారు. శరణ్య డెయిరీ జీఎస్‌టీ కూడా లేదని, శ్రీరామ్ డెయిరీ పేరుతో వ్యాపారం సాగిస్తున్నారని సీఐ రామారావు తెలిపారు. కల్తీ పాల దందా ఎక్కువగా దర్శి సర్కిల్ పరిధిలోని ముండ్లమూరు, తాళ్లూరు, దర్శి ప్రాంతాల్లో జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. త్వరలోనే వారి ఆటలు కట్టిస్తామన్నారు. నివేదిక వచ్చిన వెంటనే నిర్వాహకులపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా ఆరోగ్య భద్రతా అధికారి ప్రభాకరరావు తెలిపారు. కల్తీ పదార్థాలు చిన్నపిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయన్నారు. ప్రధానంగా కల్తీ పాలతో క్యాన్సర్ వ్యాధి వస్తుందని చెప్పారు. పన్నీరు తయారీ కోసం పాలను విరగ్గొట్టాలని చెప్పారు. కొంత మంది తక్కువ మోతాదులో పలు పౌడర్లు వాడి పన్నీరు తయారుచేస్తున్నారన్నారు. డెయిరీ తయారు చేసే ప్రతి పదార్థాన్నీ జిల్లా ఆహార భద్రతా అధికారి, సిబ్బంది, దర్శి సీఐ రామారావు, ఎస్సై నాగరాజులు క్షుణ్ణంగా పరిశీలించారు.

లెక్కతేల్చారు

డీసీసీబీలో అక్రమాలపై సమగ్ర విచారణ

ప్రభుత్వానికి సిఫార్సు చేస్తూ కలెక్టర్ నివేదిక

త్రిసభ్య కమిటీ విచారణలో అనేక ఫిర్యాదులు వాస్తవమేనని నిర్ధారణ



డీసీసీబీ బ్యాంక్ కార్యాలయం

ఒంగోలు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో జరిగిన అక్రమాలు, అవకతవకలపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రభుత్వాన్ని కోరారు. ప్రాథమికంగా తాను నియమించిన ముగ్గురు అధికారులతో కూడిన కమిటీ బ్యాంకులో చేసిన విచారణలో అత్యధిక ఫిర్యాదులు వాస్తవమేనని తేలాయని, అక్రమాలకు బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు మరింత లోతుగా క్షేత్రస్థాయిలో నిశిత పరిశీలన కోసం సమగ్ర విచారణకు ఆదేశించాలని కోరారు. త్రిసభ్య కమిటీ ఇచ్చిన రిపోర్టుల ఆధారంగా కలెక్టర్ అన్సారియా ప్రభుత్వానికి నివేదిక పంపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో డీసీసీబీలో పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు, అవకతవకలు జరిగాయని, అందులో బ్యాంకు అధికారులు, అలాగే వైసీపీ పాలనలో బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరించిన వారి భాగస్వామ్యం ఉందంటూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చాక భారీగా ఫిర్యాదులు వెళ్లాయి.

తొలుత విజిలెన్స్ విచారణ

బ్యాంకు నిధులను దుర్వినియోగం, దోపిడీ చేశారని కొందరు వ్యక్తుల తీరును కూడా పేర్కొంటూ ఈ ఫిర్యాదుల నేపథ్యంలో ప్రభుత్వం తొలుత విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఆ విచారణ సజావుగా సాగేందుకు అప్పుడు బ్యాంకు సీఈవోగా ఉన్న కోటిరెడ్డిని అక్కడి నుంచి తొలగించాలని, అలాగే సమగ్ర విచారణ కోసం సెక్షన్ 51 విచారణ చేయించాలని కలెక్టర్ ప్రభుత్వాన్ని కోరుతూ లేఖ రాశారు. అయితే సకాలంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, బ్యాంకు పాలకమండలి స్పందించక పోవడాన్ని

మిగతా 6లో...

పాలవెల్లువలో అవకతవకలు

మరోవైపు జగనన్న పాల వెల్లువ, జగనన్న తోడు, ట్రాక్టర్ రుణాల్లోనూ అవకతవకలు జరిగాయి. వీటన్నింటిపై సుమారు 50 పేజీల రిపోర్టును, దానికి అనుబంధంగా వారు పరిశీలించిన దాదాపు 2వేలకుపైగా డాక్యుమెంట్లను త్రిసభ్య కమిటీ కలెక్టర్‌కు అందజేసింది. మొత్తం 62 అంశాలలో ఏయే అంశం ఎంతమేర వాస్తవం, బాధ్యులు ఎవరన్న విషయాన్ని స్పష్టంగా నివేదికలో పొందుపర్చారు. దీనిపై పరిశీలన చేసిన కలెక్టర్ భారీగా అక్రమాలు, అవినీతి జరిగిందనే నిర్ధారణకు వచ్చారు. దీంతో ఇప్పటికే గుర్తించిన అక్రమాలకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు మొత్తం కార్యకలాపాలపై క్షేత్రస్థాయిలో నిశిత పరిశీలన కోసం సమగ్ర విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఉన్నతాధికారులకు నివేదించారు.

ఆర్జీవీ బెయిల్ పిటిషన్‌పై విచారణ

వచ్చేనెల 2కు వాయిదా

ఇక ఎక్కడా కేసులు పెట్టకుండా చూడాలని మరో పిటిషన్



మెయిన్‌లో



ముప్పవరంలో డ్రైనేజీని పరిశీలిస్తున్న మంత్రి స్వామి

సచివాలయ సిబ్బందిని రేషనలైజేషన్ చేయాల్సి ఉంది

● మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

కొండపి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ సిబ్బందిని రేషనలైజేషన్ చేయాల్సిన ఆవశ్యకత ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ, గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్లశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. గురువారం మండలంలోని పెట్లూరు గ్రామ సచివాలయాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. రికార్డు నిర్వహణ పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయంలో ప్రభుత్వ సేవలను సకాలంలో ప్రజలకు అందజేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీచేశారు. ముప్పవరంలో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ కాలువ పనులను పరిశీలించారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నాయకుడు బత్తుల నారాయణస్వామి ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

● మంత్రి స్వామి

మర్రిపూడి : అన్ని వేళల అండగా ఉంటానని రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. గురువారం అంకేపల్లికి వచ్చిన సందర్భంగా స్థానిక ఎస్సీకాలనీ మహిళలతో ఆయన ముచ్చటించారు. పక్కాగృహాలు అవసరమైన వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేటట్లు చూస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్ పదవికి పోటీ చేసి ఓటమిపాలైన విమలమ్మ తాను ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వివరించారు. స్పందించిన స్వామి.. కుటుంబ పోషణకు అవసరమైన ఆటోను ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.



కవన విజయం రూపకంలో ఒక సన్నివేశం

అలరించిన కవన విజయం

ఒంగోలు(కల్చరల్), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాహిత్యవేత్త దివంగత డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు రచించిన కవన విజయం రూపకం ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా అలరించింది. జిల్లాకు చెందిన పలువురు సాహితీవేత్తలు ఈ రూపకాన్ని గురువారం విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో ప్రదర్శించి ప్రేక్షకుల కరతాళధ్వనులందుకున్నారు. తొలుత సింహాద్రి జ్యోతిర్మయి కవులను సభకు పరిచయం చేయగా, డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ రూపక ప్రయోక్తగా వ్యవహరించారు.

కార్యక్రమంలో తేళ్ల అరుణ, సీహెచ్.ఏడుకొండలు, నట్టే ప్రసాద్, కప్పగంతు జయరామయ్య, ఈదుమూడి ఆంజనేయులు, డాక్టర్ నూనె అంకమ్మరావు, డాక్టర్ బీరం సుందరరావు, కసుకుర్తి శ్రీనివాసరావు, నూకతోటి శరత్‌బాబు, ఈదుమూడి జయంతి, బత్తుల బ్రహ్మారెడ్డిలు వివిధ పాత్రలను పోషించి తమ కవితా గానంతో అలరించారు. కళాపీఠం పాలకవర్గ సభ్యులు తాతినేని శ్రీహరిరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తదితరులు కవులను ఘనంగా సత్కరించారు.

ఇళ్ల నిర్మాణాల లక్ష్యం పూర్తిచేయాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కల్చరల్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 10వతేదీ నాటికి పేదలందరికీ ఇళ్ల నిర్మాణాలకు నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేయటానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సమీక్ష నిర్వహించారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలిసి గృహ నిర్మాణాల పురోగతి, ఎంఎస్ఎంఈ సర్వే, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు, స్కూల్ టాయిలెట్స్ తదితర అంశాలపై ఆమె మండల ప్రత్యేక అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఏపీడీలు, ఏపీవోలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా డిసెంబరు 12వతేదీన లక్ష ఇళ్లను సామూహికంగా ప్రారంభోత్సవాలు చేపడుతున్నారని తెలిపారు. జిల్లాలో 3,800 ఇళ్ల నిర్మాణం లక్ష్యం కాగా ఇప్పటివరకు 1,436 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలిన నిర్మాణాలను రోజువారీ లక్ష్యాలు నిర్దేశించుకొని 10వతేదీ నాటికి పూర్తిచేయాలని ఆమె ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్, పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో చిరంజీవి, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

టంగుటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు శివారు వెంకటాయపాలెంలో ఆరుబయట జరుగుతున్న పేకాట శిబిరంపై ఎస్సై నాగమల్లీశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం పోలీసులు దాడి చేశారు. దాడిలో ఆరుగురు జూదరులు పట్టుబడగా, వారి వద్ద రూ.13,390 నగదును స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పేకాట, బెల్ట్ షాపుల ద్వారా అక్రమంగా మద్యం అమ్ముతుంటే తెలియజేయాలని, సమాచారం చెప్పిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.



పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న వాహనాలు

12 గ్రావెల్ టిప్పర్ల పట్టివేత

మద్దిపాడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న 12 టిప్పర్లు, 2 ఎక్స్‌కవేటర్లను గురువారం మద్దిపాడు పోలీసులు సీజ్ చేశారు. మండల పరిధిలోని గుండ్లకమ్మ పరివాహక ప్రాంతానికి ఆనుకొని ఉన్న పాత బూరేపల్లి కొండ వద్ద బుధవారం అర్ధరాత్రి గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నట్లు ఉన్నతాధికారుల సమాచారం మేరకు ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వాహనాలను పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయం

మెగా జాబ్‌మేళా ప్రారంభంలో ఎమ్మెల్యే కందుల, రాఘవరెడ్డి

పాల్గొన్న వేలాది మంది నిరుద్యోగులు

మార్కాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అత్యంత వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, రాఘవరెడ్డిలు మెగా జాబ్ మేళా నిర్వహించడం హర్షణీయమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక కళాశాల రోడ్డులోని సౌజన్య ఫంక్షన్ హాల్‌లో గురువారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి, రాఘవరెడ్డిలు రిబ్బన్ కత్తిరించి మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత కోసం జాబ్ మేళాలు నిర్వహిస్తున్నారన్నారు. మార్కాపురం లాంటి వెనుకబడిన ప్రాంతంలో మెగా జాబ్‌మేళా నిర్వహించడం నిరుద్యోగ యువతకు వరమన్నారు. సుమారు 100కిపైగా కంపెనీలు యువత ఉద్యోగాలకు అవకాశం కల్పించాయన్నారు. భవిష్యత్తులో కూడా తరచూ ఇలాంటి జాబ్ మేళాలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా కంపెనీల ప్రతినిధులు మేళాలో పాల్గొన్న నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉద్యోగాలు సాధించిన వారికి అక్కడికక్కడే నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాఘవరెడ్డి సతీమణి చందన, సీఐ పి.సుబ్బారావు, రాక్‌వెల్ స్కూల్ ఎండీ వెన్నా నాగార్జునరెడ్డి, సురేష్‌రెడ్డి, టీడీపీ నాయకులు కందుల రామిరెడ్డి, మాలపాటి వెంకటరెడ్డి, కౌన్సిలర్ నాలి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.





మెగాజాబ్ మేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, రాఘవరెడ్డి (ఇన్‌సెట్లో) ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న చందన

ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో వివిధ పోటీలు

● అధ్యక్షుడు ఈదర హరిబాబు

ఒంగోలు కల్చరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో వివిధ రకాల పోటీలు, ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు పరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు తెలిపారు. గురువారం ఉదయం ఒంగోలులోని మౌర్యా ఇన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025 జనవరిలో నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ కళాపరిషత్, భారతీయం ఆధ్వర్యంలో 64 ఆర్ట్స్ నాటక ప్రదర్శనలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా పెయింటింగ్, బ్యానర్ పెయింటింగ్, ముగ్గుల పోటీలు, చిత్రకళా ప్రదర్శన మొదలైనవి ఉంటాయని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, మహిళలను ప్రోత్సహించే విధంగా కార్యక్రమాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. గత ఐదేళ్ల కాలంలో ఎన్టీఆర్ కళాపరిషత్ కార్యక్రమాలకు కలిగిన తీవ్ర అంతరాయం వల్ల నిర్వహించలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే వచ్చే సంవత్సరంలో ఘనంగా నిర్వహించటానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలకు నిర్వహించే ముగ్గుల పోటీలలో పాల్గొనాలనుకునే వారు డిసెంబరు 12వ తేదీలోపు వారు వేసిన ముగ్గును, పూర్తి వివరాలతో 9490026977 నెంబరుకు వాట్సాప్ ద్వారా పంపాలన్నారు. అనంతరం వారికి పోటీలు జరిగే తేదీ, సమయం, స్థలం తెలియజేస్తామని, విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, రెండు కన్సోలేషన్ బహుమతులు అందిస్తామని చెప్పారు. సృష్టి ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు తిమ్మిరి రవీంద్ర మాట్లాడుతూ సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, సూపర్ సీనియర్స్ విభాగాలలో 1వ తరగతి నుంచి డిగ్రీ విద్యార్థుల వరకు పెయింటింగ్ పోటీలు, చిత్రకారులకు బ్యానర్ పెయింటింగ్ పోటీలు, అదేవిధంగా ఆయిల్, అక్రిలిక్, వాటర్‌కలర్స్‌తో వేసిన చిత్రాలతో చిత్ర కళా ప్రదర్శన ఉంటాయన్నారు. వీటిలో పాల్గొనే వారు వారి చిత్రాలను ముందుగా 9490026977 నెంబరుకు వాట్సాప్ ద్వారా పంపాలని ఆయన కోరారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈదర హరిబాబు

మద్యం మత్తులో తండ్రిని చంపిన కొడుకు



మృతి చెందిన వెంకటేశ్వర్లు

అద్దంకిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో తండ్రిని కొడుకు చంపిన ఘటన అద్దంకిలోని భాగ్యనగర్‌లో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు జె.పంగులూరు మండలం కశ్యాపురం గ్రామానికి చెందిన ముప్పరాజు వెంకటేశ్వర్లు (60) కుటుంబం మూడు దశబ్దాల క్రితం అద్దంకి పట్టణంలోని భాగ్యనగర్‌లో నివాసం ఉంటున్నారు. వెంకటేశ్వర్లు లారీ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. భార్య 20 సంవత్సరాల క్రితమే చనిపోయింది. రెండేళ్ల క్రితం వెంకటేశ్వర్లు తల్లి మృతి చెందింది. అప్పటి నుంచి కొడుకు సుబ్బారావు (సుబ్బు)తో నివాసం ఉంటున్నాడు. మద్యానికి బానిస అయిన కొడుకు సుబ్బారావుతో తండ్రికి తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో బుధవారం రాత్రి కూడా తండ్రీ కొడుకులు గొడవపడ్డాడు. మద్యం మత్తులో ఉన్న కుమారుడు తండ్రిపై దాడి చేయగా చెవి, ముక్కు నుంచి రక్తస్రావం కావడంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు గురువారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. స్థానికులను అడిగి వివరాలను నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటన స్థలాన్ని చీరాల డీఎస్పీ మొయిన్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడి బంధువు చెంచు రామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ కృష్ణయ్య తెలిపారు.

సభ్యత్వంతో కార్యకర్తల కుటుంబాలకు భరోసా

● పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) :ప్రతి కార్యకర్త పార్టీ సభ్యత్వం తీసుకోవాలని, పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి తెలుగుదేశం పార్టీ కొండంత భరోసా కల్పిస్తుందని పర్చూరు శాసనసభ్యులు, టీడీపీ బాపట్ల పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు ఏలూరి సాంబశివరావు అన్నారు. గురువారం ఆయన ఏలూరి క్యాంపు కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. 2024-26 సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వచ్చేనెల 2లోపు పూర్తి చేయాలన్నారు. వంద రూపాయలు పార్టీ సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు రూ.5 లక్షలు ప్రమాద బీమా ఉంటుందన్నారు. ఒకవేళ ప్రమాదవశాత్తూ మృతిచెందితే వారి కుటుంబానికి మట్టిఖర్చులు నిమిత్తం రూ.10 వేలు అందిస్తామన్నారు. గ్రామాల్లో ప్రతి కార్యకర్త పార్టీ సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పించాలని, సభ్యత్వ నమోదు చేయించాలని ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు.

మంత్రి గొట్టిపాటి చొరవతో స్కీమ్ వద్ద చెట్ల తొలగింపు

అద్దంకిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో మండలంలోని మణికేశ్వరం మంచినీటి పథకం వద్ద ఉన్న చిల్లచెట్ల తొలగింపునకు మోక్షం కలిగింది. కొండపై ఉన్న మంచి నీటి పథకం వద్ద చిల్లచెట్లు మొలిచి కనీసం అక్కడకు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. ఫిల్టర్ బెడ్‌ల వద్ద చెట్ల ఆకులు పడి నీటితొట్లు అపరిశుభ్రంగా మారడంతో ఈ విషయాన్ని గ్రామస్థులు మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. గురువారం టీడీపీ నాయకులు కరిముల్లా, గ్రామస్థులు ఆశోక్, మౌలాలి, ఆదినారాయణ, అబ్దుల్లా, కృష్ణ తదితరులు ఉండి ప్రొక్లెయిన్‌తో ఆ ట్యాంక్ వద్ద ప్రాంతంలో ఉన్న చెట్లను తొలగించడంతో పాటు కొండపైకి దారి వెంబడి ఉన్న చెట్లు తొలగించి రోడ్డున నడిచేందుకు వీలుగా శుభ్రం చేశారు.



మంచినీటి పథకం వద్ద చెట్ల తొలగింపు చేస్తున్న ఎక్స్‌కవేటర్‌ను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

● బాపట్ల డీఎస్పీ గోగినేని రామాంజనేయులు

పర్చూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల పర్యవేక్షణ, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు బాపట్ల డీఎస్పీ గోగినేని రామాంజనేయులు అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం పర్చూరు పోలీసు స్టేషన్‌ను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించి త్వరితగతిన పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ఎస్సై మాల్యాద్రిని ఆదేశించారు. ప్రస్తుతం దొంగతనాలు చోటుచేసుకుంటున్న తరుణంలో రాత్రి సమయాల్లో పోలీసు గస్తీని నిర్వహించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

ఘనంగా కార్తీక వన సమారాధన

బల్లికురవ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అంబడిపూడిలోని దుర్గా మల్లేశ్వర స్వామి దేవాలయంలో గురువారం కార్తీక సమారాధనాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి అర్చకులు లక్ష్మయ్య నేతృత్వంలో అభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పెద్దఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు.

విద్యతోనే ఉన్నత స్థానం

మేదరమెట్ల, నవంబరు 28, (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల నిర్విరామ కృషితో విద్యార్థులు నేర్చుకున్న విద్యతోనే ఉన్నత స్థానాలను చేరుకోవచ్చని పలువురు విద్యార్థులు నిరూపించారని పలువురు వ్యక్తం తెలిపారు. శుక్రవారం తిమ్మనపాలెంలోని ఆరివారి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు ఎస్.హనుమంతరావు ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని గురువారం పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పంగులూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పంగులూరు సబ్ స్టేషన్ పరిధిలో నేడు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. విద్యుత్ విస్తరణ పనుల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం రెండు గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు రెవెన్యూ సదస్సుకు మంత్రి రవికుమార్ హాజరు

మేదరమెట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కొరిశపాడు మండలంలో రెవెన్యూ సమస్యలపై అధికారలతో సమావేశం ఏర్పాటు చేశారు. శుక్రవారం జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరవుతున్నారు. మండలంలోని రెవెన్యూ సమస్యలున్న వారు తమ సమస్యలను నేరుగా సమావేశంలో నివేదించవచ్చన్నారు.

విద్యార్థులు విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి

మార్టూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతోపాటు వారిలో విషయ పరిజ్ఞానం పెంచుకునే విధంగా ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈవో వస్రాంనాయక్ అన్నారు. గురువారం స్థానిక శ్రీచైతన్య స్కూల్లో విద్యార్థులకు నాసా కిట్లును పంపిణీ చేశారు. నేషనల్ స్పేస్ సొసైటీ, నాసా రీసెర్చ్ సెంటరు సంయుక్తంగా నిర్వహించే నాసా స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్‌లో ప్రాజెక్టు డిజైన్ చేయడానికి శ్రీచైతన్య స్కూల్‌కు చెందిన 27 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. దాంతో నాసా సంస్థవారు విద్యార్థులకు నాసా కిట్లును పంపించారు. వాటిని ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈవో వస్రాంనాయక్ చేతులమీదగా విద్యార్థులకు అందజేశారు.

ఆర్మీ ఉద్యోగి అరెస్టు

చీరాలటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నిజాంపట్నంకు చెందిన ఆర్మీ ఉద్యోగి పిట్టు నాగరాజురెడ్డిని చీరాల టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక కొత్తపేటకు చెందిన లావణ్య తనను పెళ్లి చేసుకుని మోసగించాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపరిచారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

ఈపూరుపాలెం (చీరాలటౌన్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం గవినివారిపాలెం గ్రామంలో గురువారం రాత్రి గవిని పోలయ్య (83) వృద్ధుడు మృతి చెంది కాలువ వద్ద పడి ఉన్నాడు. ఈ మేరకు ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. అయితే మృతుడు బహిర్భూమికి వెళ్లి జారిపడినట్లు పోలీసులు, బంధువులు చెబుతున్నారు.



కొండపై మట్టిని తోలడంతో రూపురేఖలు మారిన ఎర్రకొండ

ఎర్రకొండ పిండి..

(5వ పేజీ తరువాయి)

అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట పడుతుందని గ్రామస్థులు ఆశించారు. అనుమతి కంటే ఎక్కువ భూమిలో కొండ మట్టిని తవ్వుతున్నారని కొందరు ఫిర్యాదు చేయటంతో అధికారులు కొండ ప్రాంతాన్ని పరిశీలించి వెళ్లినా తరలింపు ఆగలేదు. కొందరు కూటమి నేతలు గ్రావెల్ దందాలో ఉన్న వైసీపీ నేతలతో, రోడ్డు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై మిన్నకున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఆ కొండ నుంచి గ్రావెల్‌ను తరలించి తూర్పుగంగవరం-ఉలపాడు వరకు కొంతమేర రోడ్డు పనులు చేశారు. గతంలో ఈ కొండపై ఏపుగా గడ్డి పెరిగి ఉండటం వల్ల పశువులు, గొర్రెలు, మేకలను మేతకు తీసుకు వెళ్లేవారు. కొండ మట్టిని పూర్తిగా తరలించటంతో పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో మేతకు వెళ్లిన పశువులు, మేకలు, గొర్రెలు జారిపడితే కన్పించకుండా పోతాయని కాపరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోయినా ఇటీవల వచ్చిన తహసీల్దార్ సంజీవరావు కొండ ప్రాంతాన్ని సందర్శించి నివేదికను జిల్లా అధికారులకు పంపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమంగా మట్టి, గ్రావెల్ తోలకుండా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నగరపాలనకు పన్నుపోటు

(5వ పేజీ తరువాయి)

మరి కొన్ని తమకేమీ తెలియదన్నట్లుగానే వ్యవహరిస్తున్నాయి. వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించినా ప్రభుత్వ బకాయిలు మాత్రం వసూలు కాకపోవడంతో నగరపాలక సంస్థ సిబ్బంది డీలాపడుతున్నారు. నిబంధన మేరకు ఆయా శాఖల జీతభత్యాలతోపాటు కార్యాలయ భవనాల అద్దె, విద్యుత్ బిల్లుల చెల్లింపు, వివిధ పన్నులు చెల్లించేందుకు ఏటా బడ్జెట్ విడుదల చేయాలి. అయితే ఈ విధానం సక్రమంగా అమలు కాకపోవడంతో బకాయిల భారం మరింత రెట్టింపై కూర్చుంటుంది.

రెవెన్యూలో 'గూడు' పురాణి

ఒంగోలు నగరంలో సుమారుగా 67 వేల వరకు అస్సెస్‌మెంట్‌లు ఉన్నాయి. అందులో రెసిడెన్షియల్ 35,402, నాన్ రెసిడెన్షియల్ 7వేలు, పార్టీలీ, నాన్ పార్టీలీ (అన్నీ కలిపి) 4,720 వరకు ఉండగా వాటికి సంబంధించి రూ.22 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. వాటితోపాటు రాష్ట్ర, కేంద్ర, ప్రభుత్వ కార్యాలయాల భవనాలు 300 వరకు ఉండగా వీటికి సంబంధించి రూ.40 కోట్లు వసూలు చేయాలి. ఇకపోతే దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్‌లో, నగరంలోని పలు ప్రాంతాలలోని మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లకు సంబంధించి సుమారు రూ.4.5 కోట్లు బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంచితే తాగునీటి పన్ను రూ.10 కోట్లు, ప్రైవేటు ఆస్తుల బకాయిలు రూ.50 కోట్లు ఉండటంతో పూర్తిస్థాయిలో వసూలే లక్ష్యంగా కార్పొరేషన్ అధికారులు దృష్టిసారించారు. అయితే ఇంత పెద్దమొత్తంలో బకాయిలు పేరుకుపోవడానికి గతంలో ఆర్ఐలుగా పనిచేసిన వారి నిర్లక్ష్యమే కారణంగా కనిపిస్తుంది.

అన్నింటికీ పన్నులే ఆధారం

అధిక శాతం అభివృద్ధి పనులకు ఆయా మునిసిపాలిటీల ఖజానా నిధులు (జనరల్ ఫండ్)లనే ఉపయోగించాల్సి ఉంది. వాటితో తాగునీటి నిర్వహణ, కాంట్రాక్టు సిబ్బంది జీతాలు, పలు అభివృద్ధి పనులు, విద్యుత్ దీపాలు నిర్వహణ, విద్యుత్ బకాయిలతోపాటు పార్కుల నిర్వహణ, పారిశుధ్యం మెరుగు ఇతరత్రా కొన్ని ఆర్థికపరమైన వాటికి వీటినే వినియోగించాల్సి ఉంది. అయితే పన్ను వసూలు విషయంలో అధికారుల నిర్లక్ష్యంతో కార్పొరేషన్ ఖజానా బోసిపోతుంది.

డబ్బులు చెల్లించకుండా తాగేస్తున్నారు

నగరంలో 47వేలకుపైగా గృహాలు ఉండగా, అధికారుల లెక్కల ప్రకారం 26,461 కొళాయి కనెక్షన్‌లు మాత్రమే ఉన్నట్లు సమాచారం. ఇప్పటివరకు పాత బకాయిలతో కలిపి రూ.10కోట్లు తాగునీటి పన్ను వసూలు కావాల్సి ఉంది. కాగా వాటిలోనే గృహ అవసరాలు, వాణిజ్య అవసరాలు, అపార్ట్‌మెంట్‌లు ఇతరత్రా అన్నింటికీ సంబంధించి కొళాయిలు ఉన్నట్లు అధికారుల కాకిలెక్కలు. వాస్తవ పరిస్థితి పరిశీలిస్తే సుమారు 8 వేల వరకు అక్రమ కొళాయి కనెక్షన్‌లు ఉన్నట్లుగా తెలుస్తోంది. అయితే వాటిని తొలగించడం కానీ, క్రమబద్ధీకరించే దిశగా అధికారులు దృష్టిసారించకపోవడంతో ఆశించిన స్థాయిలో పన్ను వసూలు కావడం లేదు.

లెక్క తేల్చారు

(5వ పేజీ తరువాయి)

ప్రశ్నిస్తూ ఆంధ్రజ్యోతిలో నవంబర్ 2న 'అక్కడ అంతే' శీర్షికన ప్రచురించిన కథనంతో మొత్తం యంత్రాంగంలో కదలిక రాగా సీఎం దృష్టికి కూడా విషయం వెళ్లింది. సీఎంవో నుంచి వచ్చిన ఆదేశాలతో సీఈవో కోటిరెడ్డితో పాలకవర్గ రాజీనామా చేయించి అప్కాబ్ నుంచి మరొక అధికారిని ఇక్కడ సీఈవోగా నియమించారు.

ప్రాథమిక విచారణకు ఆదేశం

మరోవైపు బ్యాంకుపై సెక్షన్ 51 విచారణ వేసేందుకు ప్రాథమిక విచారణ స్థానికంగా చేసి నివేదించాలని రాష్ట్ర సహకార శాఖ ఉన్నతాధికారులు కలెక్టర్ తమీమ్ అన్సారియాను కోరారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో త్రిసభ్య కమిటీని కలెక్టర్ నియమించగా వారు దాదాపు పక్షంరోజుల పాటు విచారణ కొనసాగించారు. రెండు, మూడు రోజుల్లోనే ప్రాథమికంగా కొన్ని అంశాలను పరిశీలించాలని వారు భావించినా ప్రభుత్వానికి చేరిన ఫిర్యాదులే కాక కలెక్టర్ దృష్టికి కూడా నిత్యం అనేక అంశాలపై ఫిర్యాదులను పరిశీలించి వాటిని 62 అంశాలుగా 8 విభాగాలుగా విభజించి విచారణ కమిటీ పరిశీలన చేయగా అన్ని అంశాలలోను వాస్తవం ఉన్నట్లుగా కమిటీ గుర్తించింది. ప్రధానంగా ఉద్యోగుల బదిలీలు, ఉద్యోగోన్నతులు, సస్పెన్షన్, డిస్మిస్ అయిన వారి నియామకాలు, ఆధునికీకరణ, అభివృద్ధి పేరుతో బ్యాంకు బ్రాంచీలలో చేసిన పనులు, లీగల్ చార్జీలు చెల్లింపు, ఆరోపణలు ఎదుర్కొంటూ, పెండింగ్ విచారణ ఉన్నవారే విజిలెన్స్ విభాగంలో ఉండటం, నిబంధనలకు విరుద్ధంగా అనేక కార్యకలాపాలు కొనసాగడం వంటి వాటిని గుర్తించారు.

20 మద్యం సీసాలు స్వాధీనం

నాగులుప్పలపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోతవరం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ బి.శ్రీకాంత్ గురువారం తన సిబ్బందితో దాడి చేశారు. ఈ సందర్భంగా మద్యం విక్రయిస్తున్న యరజన మోహనరావును అదుపులోకి తీసుకొన్నారు. 20 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

చీరాలటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని రామనగర్‌లో నాటుసారా స్థావరాలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గురువారం మెరుపు దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో తయారీకి సిద్ధం చేసిన సుమారు 450 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. దాడులు నిత్యం ఉంటాయన్నారు. సారా తయారీ నేరమని మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో సీఐ నాగేశ్వరరావు సహా పలువురు సిబ్బంది ఉన్నారు.



కక్షలు వీడి.. కలిసిపోయి..



తాళ్లూరులో నిర్మించిన
మండల ప్రజాపరిషత్ కార్యాలయం

పగ.. ప్రతీకారాలతో రగిలిపోయిన ఆ గ్రామాలు నేడు ప్రగతి వైపు పరుగులు తీస్తున్నాయి. ఆధిపత్య పోరుతో అట్టుడికిన ఆ ఊర్లు అభివృద్ధిలో దూసుకుపోతున్నాయి. నాడు రాజకీయ హత్యలు, ఆస్తుల ధ్వంసంతో సర్వం కోల్పోయిన ఆ గ్రామాలు నేడు ఐక్యతకు మారుపేరుగా నిలిచాయి. నిత్యం పోలీసు పికెట్‌లతో అలజడి నెలకొన్న ఆ ప్రాంతాలు నేడు ప్రశాంత వాతావరణానికి చిహ్నంగా మారాయి. కేసులు, జైళ్ల చుట్టూ తిరిగిన ఆ నేతలు నేడు ఫ్యాక్షన్‌ను వీడారు. తాము ఏం కోల్పోతున్నామో గుర్తెరిగారు. వివాదాలు, ఘర్షణలకు తెరదించారు. వ్యవసాయం.. పాడి వైపు దృష్టి సారించారు. పిల్లలను బాగా చదివించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసేలా ముందుకు సాగుతున్నారు. అవే తాళ్లూరు మండలంలోని గ్రామాలు.

- నాడు గ్రామాల్లో ఫ్యాక్షన్ హత్యలు
- ఆధిపత్య పోరు.. ఆస్తుల ధ్వంసం
- నేడు అభివృద్ధిలో దూసుకుపోతున్న ఊర్లు
- వ్యవసాయం, పాడితో ఆర్థిక లబ్ధి
- పిల్లలను చదివించి భవిష్యత్‌కు బాటలు
- మారిన తాళ్లూరు మండల ముఖచిత్రం

1995కు ముందు తాళ్లూరు మండలంలోని తురకపాలెం, తాళ్లూరు, మాధవరం, తోటవెంగన్నపాలెం, కొర్రపాటివారిపాలెం, నాగంబొట్లపాలెం, బొద్దికూరపాడు, శివరాంపురం తదితర గ్రామాల్లో ఫ్యాక్షన్ రాజ్యమేలింది. ఇరుపార్టీల నడుమ (కాంగ్రెస్, టీడీపీ) ఆధిపత్యపోరు నడిచింది. హత్యలు, దాడులు, ప్రతిదాడులు, ఆస్తుల ధ్వంసంతో అట్టుడికిపోయింది. దీంతో ఆయా గ్రామాల్లో ప్రజలు భయంతో బిక్కుబిక్కుమంటూ కాలంగడిపారు. గ్రామాల్లో నిత్యం పోలీస్ పికెట్‌లు కొనసాగాయి. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. హత్యలతో అయిన వారిపోగొట్టుకొని, ఆస్తుల ధ్వంసంతో తీవ్రంగా నష్టపోయిన గ్రామాల ప్రజల్లో పరివర్తన వచ్చింది. పోలీస్ యంత్రాంగం కూడా కట్టుదిట్టమైన చర్యలు తీసుకొని ఫ్యాక్షన్ భూతాన్ని కూకటివేళ్లతో పెకలించటంతో ఫ్యాక్షన్ హత్యలు కనుమరుగయ్యాయి ఫ్యాక్షన్ నడిపే నాయకులకు తాము సహకరించబోమంటూ అనుయాయులు ఐక్యంగా ముందుకు సాగారు. ఈ తరుణంలో మారిన రాజకీయ పరిస్థితులతో నేతలు ఫ్యాక్షన్‌ను వీడక తప్పలేదు. 2002 నుంచి ఆ గ్రామాల్లో హత్యలు పూర్తిగా తగ్గాయి.

ప్రభుత్వ పథకాలతో ప్రజల్లో మార్పు

ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందు తున్న ప్రజలు వివాదాలకు, ఘర్షణలకు దూరంగా ఉంటూ వచ్చారు. తమ పిల్లలను మంచి చదువు చదివించి బంగారు భవిష్యత్‌కు బాటలువేసే దిశగా ముందుకుసాగటంతో నేడు ఫ్యాక్షన్ తగ్గి గ్రామాల్లో శాంతి వాతావరణం నెలకొంది. ముఖ్యమంత్రులుగా చంద్రబాబు, రాజశేఖరరెడ్డి ప్రభుత్వాలు ప్రజలకు ప్రయోజనం చేకూర్చే పథకాలు ప్రవేశపెట్టడం, విద్యార్థుల చదువుకోసం వివిధ పథకాలు, అవకాశాలు కల్పించటంతో ప్రతి ఒక్కరూ గతాన్ని మరిచి కష్టించి పనిచేస్తూ ముందుకు సాగుతున్నారు.2004లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఎన్నికైన బూచేపల్లి సుబ్బారెడ్డి, 2014లో దర్శి నుంచి టీడీపీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికై రాష్ట్ర మంత్రిగా ప్రాతినిధ్యం వహించిన శిద్దారాఘవరావులు అభివృద్ధే ధ్యేయంగా పనిచేయటంతో గ్రామాలు వృద్ధిలోకి వచ్చాయి. ఫలితంగా గతంలో ఎన్నడూ లేనంతగా మండలం అన్ని రంగాల్లో ముందున్నది.

ఉన్నత చదువులతో ముందుకు..

ఫ్యాక్షన్ గ్రామాల్లో నాయకుల పిల్లలు ఉన్నత చదువులు చదివి వివిధ రంగాల్లో ఉద్యోగాలు పొంది ఆర్థికంగా ముందున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గేదెల షెడ్‌లు ఏర్పాటు చేసి పాడిపరిశ్రమను అభివృద్ధి చేస్తున్నారు. గతంలో రాజకీయ హత్యలతో పోలీస్‌స్టేషన్‌చుట్టూ తిరిగే కార్యకర్తలు నేడు పొలం పనులు, పాడిపరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అలాగే ఆయా గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన ఆలయాలను గ్రామస్థులందరూ పార్టీలకు, వర్గాలకు అతీతంగా ఐకమత్యంగా విరాళాలు సేకరించి ఆలయజీర్ణోద్ధరణ పనులు చేపట్టారు. అలాగే నూతన ఆలయాలు నిర్మించటంతో ప్రజల్లో దైవచింతన నెలకొంది.

ఎమ్మెల్యే, మాజీ మంత్రి హయాంలో అభివృద్ధి పనులు

మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి హయాంలో తూర్పుగంగవరం - రాజంపల్లి బీటీరోడ్డు, నాగంబొట్లపాలెం వద్ద చప్టా, రామతీర్థం రిజర్వాయర్ నుంచి అన్ని గ్రామాలకు ఎన్ఎస్పీ మంచినీటి సరఫరా వంటి పనులు చేయించారు. మాజీ మంత్రి శిద్దా రాఘరావు హయాంలో వెల్లంపల్లి - తాళ్లూరు, తాళ్లూరు-ముండ్లమూరు, చీమకుర్తి-దర్శి రహదారులు డబుల్ రోడ్లుగా, ఎంపీడీవో, తహసీల్దార్, ఐసీడీఎస్, స్త్రీశక్తిభవనం, కస్తూర్బాగాంధీ విద్యాలయం, గ్రామాల్లో అంతర్గత సీసీరోడ్లు, మురుగుకాల్వల నిర్మాణాలు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలు, వ్యవసాయ రంగం వృద్ధికి విద్యుత్ సబ్‌స్టేషన్‌ల ఏర్పాటు, మంచి నీటి సమస్య పరిష్కారానికి ట్యాంక్‌లు, వాటర్ ప్లాంట్‌ల ఏర్పాటు జరిగాయి. ప్రజలు కూడా అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం అయి సుందర గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు.



తురకపాలెంలో
గ్రామస్థులు ఐకమత్యంగా నిర్మించిన రామాలయం

దీంతో దశాబ్దాలుగా నెలకొన్న ఫ్యాక్షన్ కనుమరుగైంది. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో ప్రజలు శాంతియుత వాతావరణంలో జీవిస్తూ ముందుకు సాగుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, తాళ్లూరు

పతకాల రాణి రమ్య



సాధించిన పతకాలతో రమ్య

- పోటీల్లో పాల్గొంటే బహుమతి సాధించాల్సిందే
- పవర్, వెయిట్ లిఫ్టింగ్‌లో రాణిస్తున్న పేదింటి విద్యార్థిని

టంగుటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : షీల్డు, మెడల్స్ సాధనలో రారాణిగా నిలిచింది బండి రమ్య. పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్‌లో ఈమెకు ఈమే చాటి. పాల్గొన్న ప్రతిసారి ప్రథమ, ద్వితీయ, త్రుతీయ బహుమతుల్లో ఏదో ఒకటి తన సొంతం కావాల్సిందే. రమ్య పేదింటి ఆడబిడ్డ, తండ్రి ఆటో నడిపి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తల్లి సాధారణ గృహిణి. టంగుటూరు శివారు రావివారిపాలెం విద్యార్థిని రమ్య స్వగ్రామం. జరుగుమల్లి మండలం కె బిట్రగుంటలోని కేజీబీవీ కళాశాలలో 6వ తరగతిలో చేరిన ఈమె ప్రస్తుతం ఇంటర్ సెకండ్ ఇయర్(ఎంపీసీ) చదువుతోంది. రమ్య చదువులోనూ దిట్ట. ఆమె పదవ తరగతి ఉత్తీర్ణత సాధించాక ఇంటర్ వేరే ప్రముఖ కాలేజీలో చేరాలని ఎదురు చూసింది. ఇంతలో సమయం గడిచింది. ఆఏడాది వృథాగా పోయింది. డ్రాప్ అవుట్‌గా మిగిలిపోయింది. విషయం తెలుసుకున్న బిట్రగుంట కేజీబీవీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ స్రవంతి రమ్యను పిలిపించుకొని మరుసటి ఏడు తన కళాశాలలోనే ఇంటర్ చేర్పించింది. 6నుంచి 10వతరగతి వరకు తనకు పూర్తి సపోర్టుతో పవర్ లిఫ్టింగ్‌లో రమ్యను ముందుకు నడిపించిన బిట్రగుంట కేజీబీవీ కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులంతా రమ్యకు ఇంటర్‌లోనూ మద్దతుగా నిలిచారు. వీరందరి సపోర్టుతో రమ్య పవర్‌లిఫ్టింగ్‌తోపాటుగా కొత్తగా ప్రవేశపెట్టిన వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రవేశించి హైస్కూల్ కంటే కూడా మెరుగ్గా రాణించడం ప్రారంభించింది. రమ్యకు అన్ని విషయాల్లో తోడుగా, నీడగా అండగా నిలచింది కళాశాల పీఈటీ హెప్సిబా. రమ్య ప్రతి విజయం వెనుక హెప్సిబా పూర్తి సహకారం ఉంది. రమ్య సాధించిన విజయాలకు గుర్తుగా మెడల్స్ రాబట్టింది.

రాష్ట్ర స్థాయిలో జరిగిన పవర్ లిఫ్టింగ్‌లో సాధించిన విజయాలు

2017 ఆరవ తరగతిలో జగ్గయ్యపేటలో జరిగిన పోటీల్లో తృతీయ బహుమతి
2018 ఏడవ తరగతిలో జగ్గయ్యపేట పోటీల్లోనే ద్వితీయ బహుమతి
2019 ఎనిమిదవ తరగతిలో మంగళగిరిలో జరిగిన పోటీల్లో తృతీయ బహుమతి
2020 తొమ్మిదవ తరగతిలో విజయవాడలో జరిగిన పోటీల్లో తృతీయ బహుమతి
2021 పదవ తరగతిలో జగ్గయ్యపేటలో ద్వితీయ బహుమతి
2022 డ్రాప్ అవుట్
2023 ఇంటర్ ప్రథమ సంవత్సరం చిలకల(ఎన్టీఆర్ జిల్లా) ప్రథమ బహుమతి
2024 ఇంటర్ ద్వితీయ సంవత్సరం అమలాపురం ప్రథమ బహుమతి
2024 ఇంటర్ ద్వితీయ సంవత్సరంలోనే గుడివాడలో నూతనంగా ప్రవేశపెట్టిన వెయిట్ లిఫ్టింగ్ పోటీలో పాల్గొని జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించింది.



బంగారు బాల్యం ముగింపు సభలో రమ్యను అభినందిస్తున్న కలెక్టర్ అన్సారియా

రెండు గ్రామాలకు ఒకటే బస్టాండ్



మర్రిపూడి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెండు గ్రామాలను ఆర్‌అండ్‌బీ రహదారి విడదీస్తోంది. రహదారికి తూర్పువైపు జువ్విగుంట కేజికండ్రిక ఉండగా పడమరవైపు రావెళ్లవారిపాలెం ఉంది. ఈ రెండు గ్రామాలను పొదిలి-టంగుటూరు ఆర్‌అండ్‌బీ రహదారి విడదీస్తున్న విచిత్రపరిస్థితి నెలకొంది. జువ్విగుంట గ్రామం గతంలో ధర్మవరం పంచాయతీలో ఉండేది. ధర్మవరం పంచాయతీ పాత కందుకూరు తాలూకాలో ఉండగా, పడమరవైపు ఉన్న రావెళ్లవారిపాలెం చిమట పంచాయతీ పరిధిలో ఉండేది. చిమట గ్రామం పాత పొదిలి తాలూకా పరిధిలో ఉంది. ఈ రెండు తాలూకాల సరిహద్దును ఆనుకొని టంగుటూరు-పొదిలి ఆర్‌అండ్‌బీ రహదారి విస్తరించి ఉంది. మండల వ్యవస్థ ఆవిర్భావం తరువాత జువ్విగుంట, రావెళ్లవారిపాలెంలో వేరువేరు పంచాయతీలుగా ఏర్పడ్డాయి. కందుకూరు తాలూకాలో ఉన్న ధర్మవరాన్ని మర్రిపూడి మండలంలో చేర్చారు. రెండు గ్రామాలకు ఒకటే బస్టాండ్ ఉంది. రోడ్డు ఇరువైపులా రెండు గ్రామాలు ఉండటం కొత్తవారికి వింతగా కనిపిస్తుంది.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● శానిటరీ అధికారులపై కమిషనర్ సీరియస్


సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 28, (ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్యం మెరుగులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు శానిటరీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం వార్డుకో వారం కార్యక్రమంలో భాగంగా 15, 21 డివిజన్‌లలో పర్యటించి పారిశుధ్యం పనులు పరిశీలించడతోపాటు, కాలువల్లో పూడిక తీతపనులు సక్రమంగా నిర్వహించకపోవడంపై ఇన్‌స్పెక్టర్ కంకణాల ఆంజనేయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మొక్కుబడి పనులు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రతిరోజు కాలువల్లో పూడిక తీత పనులు చేస్తే ఇంత పెద్దమొత్తంలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఎందుకు ఉంటాయని ప్రశ్నించారు. అలాగే కనీసం కాలువల్లో పూడిక తీత పనులు సక్రమంగా చేయడం లేదని మండిపడ్డారు. రోజువారీగా రోడ్లు ఊడ్చితే సరిపోదని, ఇకపై కాలువ పూడిక తీత పనులు సక్రమంగా నిర్వహించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే సైడు కాలువలపై నిర్మించిన కట్టడాలు, బంకులను తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఆదేశించారు. కమిషనర్ స్వయంగా దగ్గరుండి మరీ పూడిక తీత పనులు పర్యవేక్షించారు. విధుల్లో నిర్లక్ష్యం మరోసారి కనిపిస్తే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని ఇన్‌స్పెక్టర్‌ను హెచ్చరించారు. అలాగే అధ్వానంగా ఉన్న కాలువలను గుర్తించి, మురుగునీరు పారుదల మెరుగు కోసం కాలువల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్లు చింతపల్లి గోపి, యనమల నాగరాజు, నాయకులు బాబూరావు, ఎంఈడీఈ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ అందజేత


కుట్టుమిషన్‌ను అందిస్తున్న సురేష్‌బాబు

నాగులుప్పలపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పేద మహిళకు కుట్టు మిషన్ అందజేశారు. ఇటీవల వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సీడ్‌బాల్స్ తయారు చేసి పాఠశాలలు, కళాశాలల్లో చల్లి మొక్కల పెంపకంనకు దోహదడినందుకు గాను ప్రోత్సాహకంగా క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఆర్.రవిచంద్ర మండల వాసవీ క్లబ్‌కు మంజూరు చేసిన కుట్టు మిషన్‌ను గురువారం ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన కోడూరి భారతికి క్లబ్ ఇంటర్నేషనల్ మల్టీపుల్ ఉపాధ్యక్షులు కొంజేటి సురేష్‌బాబు చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో అమరా వేణు, పులకణం రాజా, దేసు రవి, సుధాకర్, చంద్రశేఖర్ గుప్త, సామాజిక సేవాకార్యకర్త తెలగతోటి శామ్యూల్ పాల్గొన్నారు.

సీఎంకు ప్రభుత్వ పెన్షనర్ల కృతజ్ఞతలు

ఒంగోలు(రూరల్), నవంబరు28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు కమ్యుటేషన్ నగదు చెల్లింపు సంవత్సరాలను తగ్గించినందుకు ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ కంచర్ల సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో సీఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. కమ్యుటేషన్ నగదు చెల్లింపులపై హైకోర్టును ఇచ్చిన తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు.

రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ ప్యానెల్ ఏకగ్రీవం


ఎన్నికైన ప్యానెల్ సభ్యులు

ఒంగోలు(కల్చరల్), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆదేశాలతో జిల్లా నాయకులు పిన్నిక మధుసూదనరావు, ఆర్.వాసుదేవరావు, ఎన్‌వీబీ.రాజేష్, ఊతకోలు శ్రీనివాసరావు, ఇతర సభ్యులతో గురువారం జరిగిన ఎన్నికలలో 12 మంది సభ్యులతో కలెక్టరేట్ యూనిట్ ప్యానెల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా బి.సత్యసాయిశ్రీనివాసరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా లక్ష్మీనారాయణరెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా ఎస్‌కే.షాజహాన్, కె.శ్రీదేవి, లక్ష్మిబాయి, సెక్రటరీగా బి.రాజశేఖర్‌రెడ్డి, జాయింట్‌సెక్రటరీలుగా వెంకట సాయికుమార్, ఖాదర్‌బాషా, మహేశ్వర వెంకటబాబు, కోశాధికారిగా బి.పిచ్చిరాజు, వై.రాధాకృష్ణ మూర్తి, ఇ.ప్రియాంకలు ఈసీ మెంబర్లుగా ఎన్నికయ్యారు.

ఐపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా వెంకటేశ్వరరెడ్డి

ఒంగోలు కల్చరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఏపీ ఐపీఎం ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఒంగోలు నీటి పరీక్షా కేంద్రం జూనియర్ సహాయకులు బక్కా వెంకటేశ్వర్‌రెడ్డిని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లక్ష్మి బొకే అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జయప్రకాష్, శివకుమార్, వాణి, నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు(కల్చరల్), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి రెండు రోజుల పాటు ఒంగోలులో పర్యటిస్తారని మాగుంట కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. 30వ తేదీన దిశా కమిటీ సమావేశంలో పాల్గొనటంతో పాటు నగరంలోని పలు కార్యక్రమాలకు, అలాగే డిసెంబరు 1వ తేదీ స్థానిక పీవీఆర్ పాఠశాలలో జరిగే దివంగత ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొంది.

అట్టపెట్టెల్లోనే విద్యా సామగ్రి

తరగతి గదులు పూర్తికాకుండానే టీవీలు మంజూరు

సంతనూతలపాడు మండలానికి రూ.1.37కోట్లతో సరఫరా


సంతనూతలపాడు హైస్కూల్లో వృథాగా ఉన్న టీవీ ప్యానెళ్లు

సంతనూతలపాడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకంలో భాగంగా స్కూళ్లకు సాంకేతిక విద్య పేరుతో టీవీ ప్యానెళ్లను మంజూరు చేశారు. అయితే వాటికి సంబంధిత గదులు నిర్మించలేదు. ప్యానెల్ టీవీలను ఒక్కో సెక్షన్‌కు ఒకటి చొప్పున ఇచ్చారు. అందుకు అవసరమైన టీవీ ప్యానెల్ బోర్డు, ఇతర సామగ్రిని పాఠశాలకు పంపించారు. అయితే కొత్తగా నిర్మించిన గదుల్లో వీటిని ఏర్పాటు చేయాలి. కానీ చాలా చోట్ల అసంపూర్తిగా ఉన్న తరగతి గదుల పాఠశాలలకు పంపించారు. సంతనూతలపాడు మండలంలో ఎంపీపీ, యూపీ, జడ్పీహైస్కూళ్లు అన్ని కలిపి 46 ఉన్నాయి. పాఠశాలలకు టీవీలు, ప్యానెళ్లను ప్రభుత్వం రెండు విడతలుగా పంపిణీ చేసింది. ఒక్కో ప్యానెల్ ఖరీదు రూ.1.25లక్షలకు కొనుగోలు చేశారు. కొన్ని పాఠశాలల్లో వాటిని భద్రపరిచేందుకు కూడా గదులు లేవు. ఫేజ్-1లో 37 ప్యానెళ్లు, 21 టీవీలు, ఫేజ్-2లో 46 ప్యానెళ్లు, 11 టీవీలు వచ్చాయి. అయితే మొదటి విడతలో ఇచ్చిన పాఠశాలల్లో మరికొన్ని పాఠశాలకు అదనంగా ప్యానెళ్లను సరఫరా చేశారు. ప్యానెళ్లను టీవీగా వినియోగించుకోవచ్చు. విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు బోర్డుగా కూడా వినియోగించుకోవచ్చు. టీవీలను మాత్రం ఎలిమెంటరీ పాఠశాలలకే పంపించారు. వీటిలో ప్యానెళ్లకోసం మండలంలో పాఠశాలల కోసం ప్రభుత్వం రూ.1,37,05,000 ఖర్చు చేసింది. ఈ క్రమంలో మండలంలోని సంతనూతలపాడు జడ్పీహైస్కూల్లో కొన్ని తగరతి గదుల్లో బిగించారు. అదనపు తరగతి గదుల నిర్మాణం ఆగిపోవడంతో మిగిలిన టీవీ ప్యానెళ్లను స్కూల్లో భద్రపరిచారు. ఇలా మంగమూరు, ఎనికపాడు, మద్దులూరు, కొనగానివారిపాలెంలో అదనపు తరగతి గదుల నిర్మాణం అర్థాంతరంగా ఆగిపోవడంతో గదులు పూర్తికాకుండానే టీవీప్యానెళ్లు మూలకు చేరుకున్నాయి. విద్యార్థుల బాగుకోసం లక్షల విలువ చేసే ప్యానెళ్లు మూలకు చేరడంతో అవి వృథాగా పడిఉన్నాయి. గత ప్రభుత్వంలో నాడు-నేడు పథకాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం మనబడి-మన భవిష్యత్తు అనే పేరుకూడా పెట్టింది. ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో అర్థాంతరంగా ఆగిన అదనపు తరగతి గదులను పూర్తి చేసి మూలకు చేరిన టీవీ ప్యానెళ్లను బిగిస్తే విద్యార్థులకు ఉపయోగపడతాయని తల్లిదండ్రులు కోరుతున్నారు.

గదుల నిర్మాణం పూర్తి కాగానే ఏర్పాటు చేయిస్తాం

● ఎంఈవో వెంకారెడ్డి

మండలంలోని కొన్ని పాఠశాలల్లో టీవీ ప్యానెళ్లను బిగించాం, మరికొన్ని చోట్ల అదనపు తరగతి గదులు నిర్మాణం ప్రస్తుతం ఆగాయి. మనబడి-మనభవిష్యత్తు పథకం ద్వారా త్వరలో మిగత పాఠశాల్లో టీవీ ప్యానెళ్లను ఏర్పాటు చేస్తారని తెలిసింది. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించాం.

కూటమి ప్రభుత్వ హయాంలో బ్రిడ్జిల అభివృద్ధి

● ఎమ్మెల్యే బీఎన్

● రెండు బ్రిడ్జిల నిర్మాణానికి భూమిపూజ


బ్రిడ్జిల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హయాంలో రోడ్లు, బ్రిడ్జిలను అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఉప్పుగుండూరు-మాచవరం గ్రామాల మధ్య రెండు బ్రిడ్జిల నిర్మాణాలకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. పీఎంజీఎస్‌వై పథకం కింద మంజూరైన రూ.5.5 కోట్లతో ఈ రెండు బ్రిడ్జిలను నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద చేపడుతున్న బ్రిడ్జిల నిర్మాణంతో ప్రజల వెతలు తీరుతాయన్నారు. వర్షాల వల్ల ఇక్కడున్న దెబ్బతిన్న నేల చప్టాలపైకి వరదనీరు చేరి పరిసర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు వీలు లేని పరిస్థితి ఎదురవుతుందని చెప్పారు. త్వరలోనే బ్రిడ్జిల నిర్మాణాలతో ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

టి.అగ్రహారం గ్రామానికి చెందిన జాగర్లమూడి అంజమ్మకు రూ.57,989, జాగర్లమూడి లింగమ్మకు రూ.55,178 మారెళ్ల చిరంజీవికి రూ.41,218 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే విజయ్‌కుమార్ గురువారం లబ్ధిదారుల కుటుంబాల వద్దకు వెళ్లి అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో వై.మహాలక్ష్మి, డీఈ రమణయ్య జేఈ పవన్, గుత్తేదారు ఆంజనేయులు, టీడీపీ మండల అధ్యక్షులు తేళ్ల మనోజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, లింగా అంజిరెడ్డి, పీకా బైరాగి, మెట్టు సుబ్బయ్యనాయుడు, కనగాల శ్రీనివాసరావు, సెల్వం, కొంజేటి ధనుష్, జాగర్లమూడి హరిబాబు, ఆళ్ల నాగార్జున, పొద శ్రీధర్, జాగర్లమూడి వేణు, పొద మురళి, మేడికొండ మురళీ, శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

టీచర్లు 9గంటల్లోపు హాజరు నమోదు చేయాలి

● డీఈవో కిరణ్‌కుమార్ ఆదేశం


విజయక్రాంతిసుధాను సత్కరిస్తున్న డీఈవో కిరణ్‌కుమార్

చీమకుర్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): టీచర్లు విధిగా తొమ్మిది గంటలలోపు ముఖ ఆధారిత హాజరును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీఈవో కిరణ్‌కుమార్ ఆదేశించారు. చీమకుర్తి పట్టణంలో ఎంఆర్సీ భవనంలో గురువారం నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన డిప్యూటీ డీఈవో చంద్రమౌళేశ్వరరావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ అపార్ ఐడీలను వందశాతం పూర్తి చేయాలని కోరారు. దీనికోసం చీమకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పల్లామల్లి హైస్కూల్లో ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. డిసెంబరు 7న ప్రభుత్వం పాఠశాలల్లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబోతున్న మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ విజయవంతానికి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఉపాధ్యాయులు తమ సెలవులను యాప్‌లో కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. విద్యార్థుల హాజరును ఉదయం తొమ్మిదిన్నర గంటలలోపు పూర్తి చేయాలన్నారు. డిప్యూటీ డీఈవో చంద్రమౌళేశ్వరరావు మాట్లాడుతూ మెనూ ప్రకారం మధ్యాహ్నభోజనాన్ని విద్యార్థులకు అందివ్వాలన్నారు. విద్యార్థుల హాజరును, భోజనాన్ని తీసుకొనే శాతాన్ని పెంచాలన్నారు. డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు, డీసీఈబీ సెక్రటరీ మర్రి శ్రీనివాసరావులు పరీక్షల నిర్వహణ, అపార్ నమోదులపై సమీక్షించారు. అపార్ నమోదులో ప్రతిభచాటిన రామతీర్థం టీచర్ విజయక్రాంతి సుధాను అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు నరసింహారావు, శివాజీ, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

వైభవంగా పడిపూజ


ఒంగోలులో అయ్యప్పస్వామికి అభిషేకం చేస్తున్న స్వాములు


రెడ్డినగర్‌లో నిర్మించిన మండపం

ఒంగోలు(కల్చరల్), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొత్తపట్నం బస్టాండులోని శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం దగ్గర ఉన్న అయ్యప్పస్వామి దేవస్థానం వద్ద పడిపూజ అత్యంత వైభవంగా జరిగింది. దేవస్థాన కమిటీ చైర్మన్ కాళె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన పడిపూజకు నగరానికి చెందిన అయ్యప్ప, శివ, భవానీ స్వాములు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం భక్తులకు భిక్ష జరిగింది.

రెడ్డినగర్‌లో..

చీమకుర్తి : చీమలమర్రి వద్దఉన్న రెడ్డినగర్‌లో గురువారం రాత్రి అయ్యప్ప అఖండ పడిభజన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కొండ్రాజు కోటేశ్వరరావు గురుస్వామి ఆధ్వర్యంలో అరటిబోదెలతో అంబలాన్ని ఏర్పాటుచేశారు. ప్రముఖ గాయకుడు శివా గురుస్వామిచే అలపించిన భక్తిగీతాలు భక్తులను విశేషంగా ఆలరించాయి. చుట్టుపక్కల గ్రామాలనుంచి పెద్దఎత్తున దీక్షాస్వాములు భజనలో పాల్గొన్నారు.

నరసింహారెడ్డి మృతి టీడీపీకి తీరనిలోటు : మంత్రి స్వామి

మర్రిపూడి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సీనియర్ నాయకులు అంకేపల్లి మాజీ సర్పంచ్ పాలుగండ్ల వెంకటనరసింహారెడ్డి మృతి టీడీపీకి తీరని లోటని రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. అంకేపల్లిలో నరసింహారెడ్డి దశదిన ఖర్మ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తెలుగురైతు రాష్ట్ర నిర్వహక కార్యదర్శి యర్రమోతు శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు చేరెడ్డి నర్సారెడ్డి, తెలుగురైతు జిల్లా అధికార ప్రతినిధి రేగుల వీరనారాయణ, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు గొంటు హనుమారెడ్డి, ముత్తుముల వెంకటేశ్వర్‌రెడ్డి, వాకుమళ్ల రమణారెడ్డి పాల్గొన్నారు.

సెక్టోరల్ పోస్టులకు ఇంటర్వ్యూలు పూర్తి

ఒంగోలు(విద్య), నవంబరు28(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్ట్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఐదు సెక్టోరల్ అధికారులు, ఒక సహాయ సెక్టోరల్ అధికారి పోస్ట్ భర్తీకి గురువారం ఇంటర్వ్యూలు జరిగాయి. స్థానిక ప్రకాశంభవనంలోని కలెక్టర్ కాన్ఫరెన్స్‌హాలులో ఈ ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 25మంది ఉపాధ్యాయులను ఆహ్వానించగా, 24మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈవో కిరణ్‌కుమార్, డైట్ ప్రిన్సిపాల్ నారాయణరావు తదితరులు వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం


పూజలలో పాల్గొన్న భక్తులు

సంతనూతలపాడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని ముద్రగడవారిబజారులో గల శ్రీషిర్డీ సాయిబాబా మందిర వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. మట్టా రాధాక్రిష్ణమూర్తి, ధనలక్ష్మి దంపతులచే ప్రతిష్ఠించిన మందిరంలో ప్రతీ ఏడాది వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నారు. అర్చకులు సుబ్రమణ్యశర్మ, నాగసాయిక్రిష్ణశర్మ, క్రిష్ణమోహన్‌శర్మ, చైతన్యశర్మలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో మట్టా కుటుంబీకులు, భక్తులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు


కలెక్టర్ అన్సారియాకు బొకేను అందజేస్తున్న నాయకులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి నగర నేతలు గురువారం కలెక్టర్ తమీమ్ అన్సారీయాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షులు గుంటూరి ప్రభుదాస్ మాట్లాడుతూ డిసెంబరు 6వ తేదీన ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే అంబేడ్కర్ వర్ధంతి వేడుకలు, అందులో భాగంగా మెగా రక్తదాన శిబిరం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి తిరువీదిబాబు, ఎండ్లూరి రాజారావు, రాయపాటి సుబ్బారావు, గద్దల రమేష్, అజయ్, శిఖామణి, రవి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల ఏర్పాట్లు పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు

సంతనూతలపాడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు జడ్పీహైస్కూల్లో డిసెంబరు 5వ తేదీ నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీపోటీల ఏర్పాట్లను గురువారం కబడ్డీ అసోసియేషన్ నిర్వాహకులు పరిశీలించారు. నాలుగురోజులపాటు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరగనున్న పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 26 టీంల క్రీడాకారులు హాజరుకానున్నారు. ఇందుకోసం నాలుగు కబడ్డీ కోర్టులు, మూడు గ్యాలరీలు ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమంలో నిర్వహకులు సూదనగుంట కృష్ణమూర్తి, అసోసియేషన్ ప్రెసిడెంట్ కుర్రా భాస్కరరావు, ఉపాధ్యక్షులు ఎస్.రంగారావు, రమేష్, పీడీలు బి.శేషగిరి, వనజ, విద్యాకమిటీ మెంబర్ పీఎస్.చౌదరి, మందాడి వెంకటేశ్వర్లు, ముప్పరాజు శ్రీను, ఎ.ధనశేఖర్, శంకర్, కొప్పోలు శ్రీను, సీహెచ్.శ్రీను పాల్గొన్నారు.

ఉత్తమ ఎన్‌సీసీ క్యాడెట్‌కు అభినందన


శివనారాయణను అభినందిస్తున్న శ్రీధర్

ఒంగోలు(విద్య), నవంబరు28(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో చివరి సంవత్సరం ఇంజినీరింగ్ అభ్యసిస్తున్న ఎన్‌సీసీ సీనియర్ అండర్ ఆఫీసర్ శివనారాయణను కళాశాల ఉపాధ్యాయులు, యాజమాన్యం అభినందించింది. శివనారాయణ ఎన్‌సీసీ క్యాడెట్‌లలో క్రమశిక్షణతో ఉంటూ బాధ్యతగా ఉండటం, క్యాంపులలో కూడా ఎంతో ఉత్తమంగా సేవలు అందించడంతో ఆయనను ఉత్తమ క్యాడెట్‌గా ఎంపిక చేశారు. ఎన్‌సీసీ డే సందర్భంగా గుంటూరులోని ప్రధాన కార్యాలయంలో 34వ (ఆంధ్ర)బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ వి.మోహన్ చేతులు మీదగా శివనారాయణకు ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ ఆర్.వీరాంజనేయులు, డీన్ సీవీ.సుబ్బారావు, ఎన్‌సీసీ అధికారి ఎ.పృథ్వీకృష్ణ అభినందించారు.

మహాత్మా జ్యోతిబా పూలేకు ఘన నివాళి

● నివాళులర్పించిన మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా

● పలు సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ

ఒంగోలు కల్చరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఒంగోలు నగరంలోని కొత్త కూరగాయల మార్కెట్ దగ్గర ఉన్న పూలే విగ్రహానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఏపీ టూరిజం


జిల్లా గ్రంథాలయంలో పూలే చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న పాఠకులు, సిబ్బంది


వైసీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న జడ్పీచైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి, రవి తదితరులు

కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, మేయర్ గంగాడ సుజాత తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు విద్య ఒక్కటే మార్గమని పూలే దంపతులు నాడు ఎంతో కృషి చేశారన్నారు. వారి సేవలు నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కలెక్టర్ అన్సారియా ప్రసంగిస్తూ స్త్రీ విద్య అవసరాన్ని గుర్తించి మహిళల కోసం ప్రత్యేకంగా పాఠశాలలను స్థాపించి మహిళా విద్యకు పూలే, ఆయన సతీమణి కృషి చేశారన్నారు. చైర్మన్ బాలాజీ మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాలు సమానంగా ఎదిగినప్పుడే వారికి గౌరవమని పూలే భావించారన్నారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి అంజల, కమిషనర్ వెంకటేశ్వరరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, ప్రజాసంఘాల ప్రతినిధులు నీలం నాగేంద్రరావు, గంట సుబ్బారావు, దారా అంజయ్య, బంకా చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయంలో..

స్థానిక వైసీపీ కార్యాలయంలో పూలే వర్ధంతి సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తదితరులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవి, కఠారి శంకర్, దామరాజు క్రాంతికుమార్, బొట్ల సుబ్బారావు, వెన్నపూస వెంకటరామిరెడ్డి, రొండా అంజిరెడ్డి, కె.ఆదెన్న, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..

రాజాపానగల్ రోడ్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో పూలే వర్ధంతిని పురస్కరించుకుని సిబ్బంది, పాఠకులతో కలిసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపగ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి, అసిస్టెంట్ లైబ్రేరియన్ సంపూర్ణ కాళహస్తి పాల్గొన్నారు.

పూలేకు ఎస్పీ నివాళులు

ఒంగోలు(క్రైం): మహాత్మా జ్యోతిబా పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్పీ దామోదర్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ దేవప్రభాకర్, ఏవో రామ్మోహనరావు, ఆర్‌ఐలు రమణారెడ్డి, రమేష్‌కృష్ణన్, సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి: జ్యోతిబాపూలే వర్ధంతిని చీమకుర్తిలో గురువారం నిర్వహించారు. బీసీ సంఘనాయకులు పూలే విగ్రహనికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కొత్రపు రాఘవరావు, చల్లా శ్రీనివాసరావు, గుద్దంటి శ్రీనివాసరావు, మర్రి లక్ష్మీనారాయణ, పిన్నిక శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


చీమకుర్తిలో నివాళులర్పిస్తున్న బీసీ సంఘ నాయకులు

ఉత్సాహంగా వనభోజన మహోత్సవం


వేడుకలకు హాజరైన వాకర్స్ సభ్యులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రంగారాయుడు చెరువు వాకర్స్, జిమ్ మేట్స్ ఆధ్వర్యంలో కార్తీక వన భోజన మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. స్థానిక గాంధీపార్కులో నిర్వహించిన కార్యక్రమంలో కుటుంబ సమేతంగా పాల్గొని సందడి చేశారు. భవిష్యత్‌లో వాకర్స్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో బంగారయ్య, మునిసిపల్ మాజీ చైర్మన్ యక్కల తులసీరావు, సిరిగిరి రంగారావు, శ్యామ్, చిరంజీవి, గంగాధర్, తిమోతి, శ్రీదేవి, రమ, భారతి, షాలినీ, విజయ, ఇందిరా, శైలజ పాల్గొన్నారు.

ఇరవై సూత్రాల అమలుపై రేపు సమీక్ష

ఒంగోలు(కల్చరల్), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): 20 సూత్రాల కార్యక్రమాల అమలుపై ఈ నెల 30వ తేదీన సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఇరవై సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుంచి కలెక్టర్ తమీమ్ అన్సారియా నేతృత్వంలో పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లతో ఈ సమావేశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ఈవ్‌టీజింగ్‌లకు విద్యార్థులు దూరంగా ఉండాలి

● విజ్ఞాన్ కళాశాలలో సీఐ ప్రభాకర్‌రావు అవగాహన సదస్సు


మాట్లాడుతున్న సీఐ ప్రభాకరరావు

ఎర్రగొండపాలెం రూరల్ నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు ఈవ్‌టీజింగ్‌లకు దూరంగా ఉండాలని వై.పాలెం సీఐ.సీహెచ్ ప్రభాకరరావు అన్నారు. గురువారం స్థానిక విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాలు, చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ జీవితంలో ఏంతో కీలకమన్నారు. చెడు అలవాట్లకు బానిసలై జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. సైబర్‌నేరాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్న నేపథ్యంలో మొబైల్ అవసరమైతే మినహా వినియోగించవద్దన్నారు. తెలియని లింక్ లను క్లిక్ చేయవద్దని కోరారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం సూరే రమేష్, ఎస్సై పి. చౌడయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశుభ్రంగా ఉండాలి

● సూపరింటెండెంట్ నాగమహేశ్వరి

పెద్ద దోర్నాల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశుభ్రంగా ఉండాలని తద్వారా ఆరోగ్యవంతంగా ఉంటారని సామాజిక ఆరోగ్యకేంద్రం సూపరిండెంట్ నాగమహేశ్వరీ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సామాజిక ఆరోగ్యకేంద్రం సూపరిండెంట్ నాగమహేశ్వరీ మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఆరోగ్యవంతులుగా ఉన్నప్పుడే చదువు పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. అదేవిధంగా కళాశాల ప్రాంగణంలో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు లేకుండా చూసుకోవాలన్నారు. క్రీడలను కూడా చదువులో భాగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్ సావిత్రీ, అధ్యాపకులు విజయబాబు, జయసింహ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్షణికావేశంలో చేసిన తప్పిదాలే నేరాలు

● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్యాంబాబు


సబ్‌జైలును తనిఖీ చేస్తున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్యాంబాబు

గిద్దలూరు టౌన్, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి) : క్షణికావేశంలో చేసే నిర్ణయాలు తప్పి దాలే నేరాలకు దారి తీస్తాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్య దర్శి కె.శ్యాంబాబు అన్నారు. గురువారం పట్టణంలోని సబ్ జైలును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విచారణలో ఉన్న ఖైదీలకు అందుతున్న వసతులను, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. విచారణ ఖైదీలకు న్యాయవాది ఉన్నారా..? లేరా..? అని అడిగి తెలుసుకున్నారు. సొంతగా లాయర్‌ను పెట్టుకునే ఆర్థిక స్తోమత లేనివారికి ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామన్నారు. ఇందుకు సంబంధించి న్యాయసేవాధికార సంస్థ, జైలు అధికారుల ద్వారా అర్జీ పెట్టుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా ఉచిత న్యాయసహాయం, బెయిల్ న్యాయసేవాధికార సంస్థ చట్టం గురించి ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ యు.లింగారెడ్డి, పారాలీగల్ వలంటీర్ అద్దంకి మధుసూదన్‌రావు ఉన్నారు.

బహిరంగ మలమూత్ర విసర్జన నిషేధం

గిద్దలూరు టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు గిద్దలూరు నగర పంచాయతీలో బహిరంగ మలమూత్ర విసర్జన చేయడాన్ని నిషేధిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ డి.వెంకటదాస్ అన్నారు. ప్రజలు బహిరంగ మలమూత్ర రహిత నగర పంచాయతీగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. అలాకాకుండా బహిరంగ ప్రదేశాలలో మలమూత్ర విసర్జన చేసిన వారికి రూ.50 జరిమానా విధిస్తామన్నారు.

లంపీస్కిన్ వ్యాధితో దూడ మృతి

పొదిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గోశాలలో లంపిస్కిన్ వ్యాధిబారినపడి ఆవుదూడ మృతి చెందింది. పదిరోజులుగా సుమారుగా ఎనిమిది ఆవులకు లంపిస్కిన్ వ్యాధి సోకిందని సంరక్షకులు తెలిపారు. అప్పటి నుండి వ్యాధిబారిన పడిన ఆవులకు ప్రత్యేక ప్రదేశంలో చికిత్స చేయిస్తున్నామన్నారు. అయితే బుధవారం రాత్రి చిన్న ఆవుదూడ చనిపోయిందని నిర్వాహకులు తెలిపారు. వర్షాకాలంలో ఆవులకు ఈవ్యాధి సోకడం ఆందోళన కలిగిస్తుందని తెలిపారు. గోశాలలో సుమారుగా 50కిపైగా ఆవులు ఉన్నాయని వాటికిసోకే ప్రమాదం ఉందని నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. పశువైద్యులు సమస్యపై దృష్టిసారించాలని కోరారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించని దుకాణాలపై చట్టపరమైన చర్యలు : ఏవో


ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న ఏవో

మార్కాపురం రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి). ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమ్మకాలు చేయని ఎరువుల దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏవో దేవిరెడ్డి శ్రీనివాసులు హెచ్చరించారు. పట్టణంలోని పలు ఎరువులు, పురుగుమందులు, విత్తనాల దుకాణాల్లో ఆయన తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో శ్రీనివాసులు మాట్లాడుతూ దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్‌లో లావాదేల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా రసీదును ఇవ్వాలన్నారు. ప్రభుత్వ అనుమతి ఉన్న బయో మందులను మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. ప్రభుత్వ అనుమతులు లేని మందులను అమ్మితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి షాపులో స్టాక్ వివరాలను ఎంఆర్‌పీ ధరలను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు.

రైతులు పంట నమోదు చేయాలి


చెట్టిచెర్లలో పంటను పరిశీలిస్తున్న ఏవో మెర్సీ

బేస్తవారపేట, నవంబరు28(ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన పంటలను తప్పని సరిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని ఏవో జక్కం మేర్సీ అన్నారు. గురువారం బేస్తవారపేట మండలంలోని చెట్టిచెర్ల గ్రామంలో సందర్శించి రబీ సీజన్‌కు సంబంధించిన పంట నమోదును పరిశీలించారు. పంటనమోదు చేయడం వలన సున్నా వడ్డీ పంట రుణాలు, పంటల బీమా చేసుకోవచ్చన్నారు. ప్రకృతి వైపరీత్యాల వలన కలిగే నష్టాలకు పరిహారం పొందడానికి రైతులకు అవకాశం ఉంటుందన్నారు. రైతులు పండించిన పంటలను అమ్ముకోవడానికి ఉపయోగపడుతుందని రైతులకు వివరించారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి నారా ఆదిగణేష్ రైతులు పాల్గొన్నారు.

కలగానే ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మాణం

● త్రిపురాంతకం చెరువు అభివృద్ధిపై దృష్టి సారించని నాటి మంత్రి సురేష్ ● టీడీపీ కూటమిపైనే ప్రజల ఆశలు


ఎస్‌ఎస్ ట్యాంకు కోసం ప్రతిపాదించిన త్రిపురాంతకం చెరువు

త్రిపురాంతకం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు త్రిపురాంతకం చెరువులో ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మాణం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. మండలంలోని లేళ్లపల్లి, దువ్వలి, మిట్టపాలెం, రామసముద్రం, టి.చెర్లోపల్లి గ్రామాలతో పాటు త్రిపురాంతకం పట్టణానికి, ఎర్రగొండపాలెం మండలం రామచంద్రాపురం, అయ్యంబొట్లపల్లి గ్రామాలకు తాగునీటిని అందించేందుకు త్రిపురాంతకం చెరువులో ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మాణం చేయాలని గత టీడీపీ హయాంలో కార్యాచరణ రూపొందించారు. ఈ నేపథ్యంలో అప్పటి ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు చొరవతో 2017 జూన్ నెలలో జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సంజీవరెడ్డి, ఈఈ మల్లికార్జునరావు, నాయకులు త్రిపురాంతకం చెరువును పలుమార్లు పరిశీలించారు. బాలాత్రిపుర సుందరీదేవి ఆలయానికి పడమర వైపున చెరువులో ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మించేందుకు అనుకూలంగా ఉందని గుర్తించారు. దానికి సంబంధించి పూర్తి స్థాయి నివేదిక, ప్రతిపాదనలు తయారు చేసి రూ.16.9 కోట్లు వ్యయం అవుతుందని అంచనాలు రూపొందించారు. ఆ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. దీంతో అప్పటి నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మించడమే తరువాయి అని చెప్పారు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత గత ప్రతిపాదనలు, ఆలోచనలు పక్కన పెట్టింది. దీంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. కాగా ఆయా గ్రామాలలో వేసవిలో భూగర్భజలాలు పూర్తిగా అడుగంటి తాగునీటి సమస్య తీవ్రంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఏటా తాత్కాలికంగా సమస్యను తీర్చేందుకు ట్యాంకర్ల ద్వారా మంచి నీటి సరఫరా చేస్తున్నారు. ఇలా ట్యాంకర్లతో నీటి సరఫరాకు లక్షల్లో ఖర్చు అవుతుంది.

2019 ఎన్నికల ప్రచారంలో ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలోనూ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపుతానని హామీ ఇచ్చారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం వచ్చింది. దీంతో సమస్య పరిష్కారమవుతుందని ఎదురు చూసిన ప్రజలకు మాత్రం నాడు మంత్రి హోదాలో కూడా సురేష్ ఏమీ చేయకపోయారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రతిపాదించిన ఎస్‌ఎస్ ట్యాంకును కూడా నిర్మించేందుకు సహకరించలేదనే విమర్శలు వచ్చాయి. దీంతో ఇక్కడి ప్రజల ఓట్లతో గెలిచి, మంత్రిగా ఐదేళ్లు పనిచేసినా తాగునీటి సమస్య పరిష్కారానికి మాత్రం ఏమీచేయలేకపోయాడనే అప్రతిష్టను మూటగట్టుకున్నారు. ప్రస్తుతం టీడీఆపీ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎస్‌ఎస్‌ట్యాంకు నిర్మాణంపై ప్రజల్లో మళ్లీ ఆశలు మొదలయ్యాయి. ఆ మేరకు కూటమి నేతలు ప్రజల ఆకాంక్షాలు నెరవేర్చాలని ప్రజలు కోరుతున్నారు.


చెరువును పరిశీలిస్తున్న అధికారులు

సీఎం సహాయనిధికి విరాళం అందజేత


నారాయణరెడ్డికి చెక్కును అందజేస్తున్న ఎస్‌వీకే ప్రతినిధులు

మార్కాపురం, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): విజయవాడ వరద బాధితుల సహాయార్థం స్థానిక ఎస్‌వీకే నిలయం ప్రతి నిధులు రూ.లక్ష విరాళాన్ని గురువారం ఎమ్మె ల్యే నారాయణరెడ్డికి అందజేశారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డిని కలిసిన నిలయం కమిటీ ఉపాధ్యక్షులు శాసనాల వీరబ్రహ్మం, సభ్యులు పఠాన్ హుస్సేన్‌ఖాన్, ఆర్‌కేజే నర సింహంలు చెక్కును అందించారు. కార్యక్రమం లో టీడీపీ నాయకులు కనిగిరి బాల వెంకటరమణ, మాలపాటి వెంకటరెడ్డి, ఇనుప కోళ్ల నాగరాజు పాల్గొన్నారు.

నేడు అధికారులతో రివ్యూ

పొదిలి : శుక్రవారం అన్నిశాఖల అధికారు లతో స్థానిక శాసనసభ్యులు కందుల నారా యణరెడ్డి అధ్యక్షతన రివ్యూ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శోభన్‌బాబు గురువారం తెలిపారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు మండలపరిషత్, సచివాలయ అధికారులతోపాటు, అన్ని శాఖల అధికారుల తో సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. కావున అధికారులు అందరు పది గంటలకు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

ముత్తుములకు శుభాకాంక్షలు


అశోకొరెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గిద్దలూరుటౌన్, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి) : రాష్ట్ర పీఏసీ సభ్యులుగా ఎన్నికైన ఎమ్మెల్యే ముత్తుముల అశోకొరెడ్డిని గురువారం టీడీపీ కార్యాలయంలో పలువురు సన్మానించారు. శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థాన సభ్యులు కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపి పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు. వారిలో ఆలయ కమిటీ సభ్యులు నంద్యాల శ్రీనివాసులు, ఓ.వెంకటయ్య, దారం గురువయ్య, చల్లా రమేష్, బాలగురువయ్య, మొర్రి పిచ్చయ్య, వెంకటేశ్వర్లు, గోపాలకృష్ణ ఉన్నారు. అలాగే రాచర్లకు చెందిన ముస్లిం మైనారిటీలు ఎమ్మెల్యే అశోకొరెడ్డికి పూలమాలు, శాలువా వేసి ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో పఠాన్ సనావుల్లాఖాన్, షేక్ అబ్దుల్ రెహమాన్, షేక్ అక్బర్‌సాహెబ్, పఠాన్ హఫీజ్‌ఖాన్, అచ్చుకట్ల నబీరసూల్, డి.ఖాదర్‌వలి, ఖాజీ అబ్దుల్ రషీద్, గౌస్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సాయినాథుని బోధనలు అవసరం


దుప్పట్లు పంపిణీ చేస్తున్న సత్సంగ సభ్యులు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సాయినాథుడు బోధించిన సేవా, ప్రేమ మార్గాలు అనుసరణీయమని సాయి సత్సంగ మందిర వ్యవస్థాపకులు ఆర్.రామచంద్రరావు అన్నారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలో షిరిడీసాయి మందిరంలో ప్రతి నెల నిర్వహించే సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం శీతాకాలం పురస్కరించుకుని పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు.

పొదుపు ఉత్పత్తులను ఆదరించాలి


పొదుపు మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలు తయారుచేసిన ఉత్పత్తులు ఆదరించాలని మెప్మా సిటీ మిషన్ మేనేజర్ కె.ఎలిశాబాబు అన్నారు. స్థానిక మహిళా మార్ట్‌లో స్వయం సహాయక సంఘాలు తయారుచేసిన ఉత్పత్తులు గురువారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలిశాబాబు మాట్లాడుతూ.. మహిళలు తయారుచేసిన వివిధ రకాల వస్తువులు తక్కువకే దొరుకుతున్నాయన్నారు. వీటికి మార్కెటింగ్ సౌకర్యం కూడా కల్పించామన్నారు. కార్యక్రమంలో పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

నేడు కోటి దీపోత్సవం

గిద్దలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఈ నెల 29న శుక్రవారం సాయంత్రం 6 గంటలకు కార్తీక కోటి దీపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షులు వాడకట్టు రంగసత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

బ్రూస్‌లీ జయంతి



బ్రూస్లీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కరాటే విద్యార్థులు

గిద్దలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విశ్వభారతి పాఠశాల ఆవరణలో బ్రూస్‌లీ 84వ జయంతి వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో షోటోఖాన్ కరాటే నిర్వాహకులు మాస్టర్ భూతరాజు శ్రీనివాసులు, కరాటే విద్యార్థులు పాల్గొన్నారు.

ఉండవల్లి శ్రీదేవిని కలిసిన దళిత నేతలు


చైర్మన్ శ్రీదేవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దళిత నేతలు

మార్కాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంకు చెందిన టీడీపీ దళిత నాయకులు గురువారం మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవిని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మాదిగల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. మార్కాపురం ప్రాంతంలోని పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ దళిత నాయకులు జాన్ డేవిడ్, నాగార్జున, రాజు, మైఖేల్, జక్కరయ్య తదితరులు ఉన్నారు.

ఐపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా వెంకటేశ్వరరెడ్డి

ఒంగోలు కల్చరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఏపీ ఐపీఎం ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఒంగోలు నీటి పరీక్షా కేంద్రం జూనియర్ సహాయకులు బక్కా వెంకటేశ్వర్‌రెడ్డిని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు వి నుకొండ రాజారావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లక్ష్మి బొకే అందజేసి అభినందించారు.

వృత్తివిద్యా నైపుణ్యం అవసరం

గిద్దలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు సాధారణ విద్యతో పాటు వృత్తివిద్యలో కూడా నైపుణ్యం అవసరమని గిద్దలూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ బి.అనురాధ అన్నారు. పాఠశాలలో 9వ తరగతి నుండి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు వృత్తివిద్య కోర్సులలో భాగంగా బ్యాంకింగ్, రిటైల్ కోర్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా రిలయన్స్ స్మార్ట్ బజారులో కంప్యూటర్ వినియోగం ద్వారా బిల్లింగ్, అమ్మకాలు, వినియోగదారుల జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులను ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌కు తీసుకుని వెళ్లి బ్యాంక్ లావాదేవీల గురించి వివరించారు. కార్యక్రమంలో వృత్తివిద్యా అధ్యాపకులు చంద్రశేఖర్, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

గిద్దలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొత్తపల్లి రోడ్డులోని రాంభూపాల్‌రెడ్డి కాలనీలో తాగునీటిసమస్య నెలకొంది. ఈ కాలనీలో ఉన్న బోరు మరమ్మతుకు గురి కావడంతో నాలుగురోజులుగా ప్రజలు నీటి సమస్యతో సతమతమవుతున్నారు. ఈ కాలనీ మీదుగా వారానికి ఒకసారి వచ్చే మంచినీటి పైపులైన్ వెళుతుండగా తాత్కాలికంగానైనా ఆ నీటిని అందించాలని కాలనీవాసులు కోరుతున్నారు. త్వరగా బోరు బాగు చేయాలని, అప్పటివరకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

గిద్దలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం ఈనెల 29న శుక్రవారం ఉదయం 11గంటలకు చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు కమిషనర్ డి.వెంకటదాసు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోకొరెడ్డి ముఖ్యఅతిథిగా సమావేశానికి హాజరు కానున్నారన్నారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు హాజరుకావాలన్నారు.

1న గంగమ్మ, గౌరమ్మల నిమజ్జనం

గిద్దలూరు టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో కార్తీకమాసం సందర్భంగా భక్తులతో పూజ కార్యక్రమాలు నిర్వహించి డిసెంబరు 1న గంగమ్మ, గౌరమ్మల నిమజ్జనం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. వేణుగోపాలస్వామి దేవస్థానం నుంచి కుమ్మరాంకట్ట వరకు ఊరేగింపుగా వెళ్లి అక్కడి నుండి భీమలింగేశ్వరస్వామి దేవాలయం సమీపంలో నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేయనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు అక్కడే కార్తీక వనభోజనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యాదవ సామాజకవర్గం వారు పాల్గొని జయప్రదం చేయాలని ఆ ప్రకటనలో కోరారు.

కొత్తపట్నంలో యాదవ కార్తీక వనభోజనాలు


మాట్లాడుతున్న వెంకట్రావు యాదవ్

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు సమీపంలోని కొత్తపట్నం తీరంలోని నల్లూరి గార్డెన్స్‌లో డిసెంబర్ 1న జిల్లాస్థాయి యాదవ కార్తీక వనభోజనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు రాచగొర్ల వెంకట్రావు యాదవ్ తెలిపారు. స్థానిక బీసీ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కూడా 8 సార్లు జిల్లా స్థాయి కార్తీక వనభోజనాల కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. యాదవ సంఘం జాతీయ క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు పిన్నిక లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ.. యాదవుల్లో ఐక్యతా భావం పెంపొందాలన్నారు. యాదవులంతా అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో సిరిపురం వెంకట్రావుయాదవ్, యాదవ్ సంఘం నాయకులు జి.వెంకటేశ్వరరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


గురుకుల పాఠశాల విద్యార్థినికి ప్రథమ బహుమతి


ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

కంభం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లాలో సత్తెనపల్లి గురుకుల పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి వేస్ట్ టూ యూజ్‌ఫుల్ థింగ్స్ పోటీలో కంభం గురుకుల పాఠశాల విద్యార్థులు సీనియర్ విభాగంలో కె.మాధురి, జి.స్మైలీలు ప్రథమస్థానం కైవసం చేసుకున్నారు. వీరికి గైడ్‌టీచర్‌గా వ్యవహరించిన ఎం.శారదదేవి, సహాయ సహకారాలు అందించిన వారిని ప్రిన్సిపాల్ చాముండేశ్వరి అభినందించారు.

పూలే అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలి

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు


పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెంరూరల్ నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి) : వెనుకబడిన కులాల అభ్యున్నతి కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన మహోన్నత నేత జ్యోతిబా పూలే అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. అలాంటి నాయకుడిని ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. గురువారం పూలే వర్ధంతి సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు, పయ్యావుల ప్రసాద్, చేదూరి కిషోర్, షేక్ మస్తాన్, కంచర్ల సత్యనారాయణ గౌడ్, మూడమంచు శ్రీనివాసులు, రెంటపల్లి సుబ్బారెడ్డి ఐదు మండలాల నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ అధ్వర్యంలో..

జ్యోతిబా పూలే వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి బీజేపీ నాయకులు పాల్గొని పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు మాదాల సూర్యనారాయణ, సీని యర్ నాయకులు ప్రతాప్‌రెడ్డి, బాదరయ్య గౌడ్, రామయ్య, ఆశోక్, నాదాచారి, పోసాని శ్రీరాములు, సూర్య ఆంజనేయులు, లోకయ్య, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొని నివాళ్లు అర్పించారు. అలాగే మండల పరిధిలోని వైసీపీ నాయకులు, బీసీ నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు.


గిద్దలూరులో నివాళి అర్పిస్తున్న బీసీ సంఘం నేతలు

పూలేకు ఘన నివాళి

గిద్దలూరు టౌన్ : మహాత్మ జ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా గిద్దలూరు పట్టణంలోని ఆయన విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. విరంచి ఆసుపత్రి వద్ద ఉన్న పూలే విగ్రహానికి టీడీపీ నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు బండి శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం యూత్ అధ్యక్షులు బోదనబోయిన అరుణ్ కుమార్‌యాదవ్, ఉపాధ్యక్షులు మండ్ల శ్రీనివాసులు, రమణ, శాబోలు కాశన్న, పులిచెర్ల రమణయాదవ్, బలరామయ్య, దాసరి బాలయ్య, కడియాల లక్ష్మి, జంగీటి శివ, వెంకటస్వామి, అబ్బయ్య, తొండమల్ల రాజేష్, బోడపాటి రమణలు నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంటరానితనం, కులవ్యవస్థల నిర్మూలనకు కృషి చేశారన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : బడుగులు, పేద ప్రజల హక్కుల కోసం పోరాటం చేసిన మహాత్మా జ్యోతిబా పూలే 134వ వర్ధంతి గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో పూలే విగ్రహానికి బీసీ సంఘం నాయకులు టీవీ.కాశయ్య ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో తిరుపతయ్య, ప్రసాద్, కొండయ్య, వెంకటేశ్వర్లు, మల్లి, తేజ తదితరులు పాల్గొన్నారు. స్థానిక బీసీభవన్‌లో పూలే చిత్రపటానికి నివాళులర్పిం చారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు పిన్నిక లక్ష్మీప్రసాద్, రంగస్వామి, జీవీ సుబ్బారావు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ముఖాముఖి

వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగిస్తే కఠినచర్యలు

జి.కోటయ్య, ఎస్ఐ, పీసీపల్లి



ప్రశ్న: సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులపై ఎటువంటి చర్యలు తీసుకుంటారు?

జవాబు: వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగిస్తూ వర్గ విభేదాలు సృష్టించి రెచ్చగొట్టే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే పీడీయాక్ట్ కూడా నమోదుచేస్తాం.

ప్ర: మండలంలో బెల్టుషాపులపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: ఇప్పటికే వైన్‌షాపు యజమానులను పిలిపించి బెల్టుషాపులకు మద్యం విక్రయించవద్దని చెప్పాం. వీటిని నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం.

ప్ర: రోడ్డు ప్రమాదాల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా రోజుకో గ్రామాన్ని సందర్శిస్తున్నాం. వాహన చోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తున్న ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

ప్ర: చోరీల నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు? ఇప్పటివరకు రికవరీల శాతం ఎంత?

జ: చోరీలను నియంత్రించేందుకు సిబ్బందిని బృందాలుగా ఏర్పాటుచేసి గ్రామాల్లో గస్తీని ముమ్మరం చేశాం. గతంలో జరిగిన చోరీ కేసుల్లో స్టేషన్ పరిధిలో 90శాతం రికవరీ రేటు ఉంది.

భక్తి శ్రద్ధలతో గంధ మహోత్సవం

పామూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ హజరత్ మహబూబ్ సుభాని స్వామివారి దర్గా 48వ గంధమహోత్సవ వేడుకలను గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామున సయ్యద్ గౌస్‌బాషా ఇంటి వద్ద నుంచి స్వామి వారి గంధాన్ని దర్గా వద్దకు చేర్చి భక్తులకు గంధ తాంబులాలను పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ భీమానాయక్ ఆధ్వర్యంలో ఎస్ఐలు టి.కిశోర్‌బాబు, ఆర్.సమన్‌లు పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు.

పోలినేని పద్మావతికి నివాళి



పద్మావతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాసులు

పామూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొట్లగూడూరు ఎంపీటీసీ సభ్యుడు పోలినేని శ్రీనివాసులు మాతృమూర్తి పద్మావతి వైకుంఠ సమారాధన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో జడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, రాయవరపు మాల్యాద్రిచౌదరి, వేమూరి ప్రభాకర్, సర్పంచ్ మలినేని శ్రీనివాసులు, ఉపసర్పంచ్ గోళ్ల వెంకటేశ్వర్లు, గోళ్ల వీరబాబు, ఒంగోలు చిట్టిబాబు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

దొనకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథం కింద 2025-26 ఆర్థిక సంవత్సరంలో ప్రణాళిక ప్రక్రియలో భాగంగా పనుల గుర్తింపు, ఇతర అంశాలకు సంబంధించి శుక్రవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎం.శ్రీదేవి తెలిపారు. 29వ తేది వద్దిపాడు, తెల్లబాడు, 30న చందవరం, పోలేపల్లి, డిసెంబరు 2న గంగదేవిపల్లి, పెద్దన్నపాలెం, 3న మంగినపూడి, ఆరవల్లిపాడులో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అలాగే, 4వ తేది కొచ్చెర్లకోట, రుద్రసముద్రం, 5న మల్లంపేట, సంగాపురం, 6న దొనకొండ, పి.వెంకటాపురం, ఇండ్లచెరువు, 7న రామాపురం, లక్ష్మీపురం, భూమనపల్లి పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

హాని కలిగించే పదార్థాలను తినొద్దు!

తాళ్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు కురుకురే ప్యాకెట్స్, ఇతర హాని కల్గించే పదార్థాలను తినవద్దని వెలుగువారి పాలెం హెచ్‌ఎం పోలంరెడ్డి సుబ్బారెడ్డి అన్నారు. పిల్లకు హానికల్గించే కురుకురే, ఇతర చిరుతిండ్ల ప్యాకెట్స్‌ను వెలుగువారిపాలెం పాఠశాల ఆవరణలో గురువారం కాల్చి నిప్పు పెట్టారు. ఆ పదార్థాలు ప్లాస్టిక్ వాసనతో కాలిపోవడాన్ని ప్రయోగాత్మకంగా చూపి వాటివల్ల కలిగే హాని గురించి విద్యారుథలకు వివరించారు. చిరు తిండ్లుగా విద్యార్థులు తమ ఇళ్ల నుంచే పదార్థాలు, కాయలు, పండ్లు మాత్రమే తెచ్చుకోవాలన్నారు.

పేదల గృహ నిర్మాణ బిల్లులకు మోక్షం

- 799 మంది లబ్ధిదారులకు తీరనున్న కష్టాలు
- కూటమి ప్రభుత్వ నిర్ణయంపై హర్షం



లబ్ధిదారుల సర్వే నిర్వహిస్తున్న హౌసింగ్ అధికారులు

దొనకొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన గృహనిర్మాణ పెండింగ్ బిల్లులకు కూటమి ప్రభుత్వం మోక్షం కల్పించింది. ప్రతి పేద కుటుంబంకు నీడ కల్పించాలనే లక్ష్యంతో 2014 - 2019 మధ్యకాలంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఎన్టీఆర్ గృహ నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఒక్కో ఇంటికి ఓసీ, బీసీ వర్గాలకు రూ.1.50 లక్షలు, ఎస్సీలకు రూ.2 లక్షలు, ఎస్టీ వర్గాలకు రూ.2.50 లక్షలు చెప్పున నిధులు కేటాయించింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ గృహాలకు సంబంధించిన బిల్లుల చెల్లింపులను నిలిపివేసింది. అప్పులు చేసి గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులు బిల్లుల మంజూరు కోసం కార్యాలయాల్లోని అధికారులు, వైసీపీ పాలకుల చుట్టూ తిరిగినా కనికరించలేదు.

ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం అప్పటి గృహ నిర్మాణ లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేయాలని నిర్ణయించి అధికారులకు ఆదేశాలు జారీచేసింది. దీంతో గృహ నిర్మాణశాఖ ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వర్క్ ఇన్‌స్పెక్టర్, స్థానిక టీడీపీ శ్రేణులు గృహ నిర్మాణాల స్థితిగతులపై సర్వే చేపట్టారు. నిర్మాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో ఇంటింటికి తిరిగి వివరాలను నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశారు. మండలంలో మొత్తం 799 మంది గృహ నిర్మాణ లబ్ధిదారులు ఉన్నారు. వారిలో 252 మంది నిర్మాణాలు పూర్తిచేసుకున్నారు. 283 మంది శ్లాబులెవల్, 30 మంది రూఫ్‌లెవల్, 150 మంది బేస్‌మట్టం వరకు పూర్తిచేశారు. 84 మంది నిర్మాణాలు ప్రారంభించలేదని సమాచారం. అప్పట్లో దశలవారీగా కొంతమేర బిల్లులు చెల్లించినా చివరిలో లబ్ధిదారుల బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయి. మండలంలో రూ.1,25,69,926 బిల్లులు చెల్లించాల్సి ఉంది. అప్పట్లో బిల్లులు అప్‌లోడ్ చేసినా 2019 ఎన్నికల ప్రక్రియ రావటంతో నిధుల మంజూరుకు బ్రేక్ పడింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ బిల్లులను నిలిపివేసి లబ్ధిదారులకు మొండిచేయి చూపింది. టీడీపీ కూటమి ప్రభుత్వం పెండింగ్ బిల్లుల మంజూరుకు చర్యలు చేపట్టటంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

లబ్ధిదారుల కళ్లలో ఆనందం



- నాగసుబ్బారెడ్డి, లబ్ధిదారుడు, నరసింహనాయునిపాలెం

పేద, బడుగు, బలహీనవర్గాలకు చెందిన లబ్ధిదారులు అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుంటే వైసీపీ పాలకులు బిల్లులు మంజూరు చేయకుండా ఐదేళ్లు ఇబ్బందిపెట్టారు. అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం గృహ నిర్మాణ పెండింగ్ బిల్లుల మంజూరుకు చర్యలు చేపట్టింది. పెండింగ్ బిల్లుల మంజూరు చర్యలతో సీఎం చంద్రబాబు పేదల కళ్లలో ఆనందం నింపారు.

‘పల్లె పండుగ’తో రోడ్లకు మహర్దశ

- ముమ్మరంగా నిర్మాణాలు
- ఒనగూరనున్న మౌలిక వసతులు



నడింపల్లిలో నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్డు



తానంచింతలలో నిర్మిస్తున్న మురుగుకాలువ

దర్శి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది అధ్వానంగా మారిన రోడ్లను అభివృద్ధి చేసేందుకు పల్లెపండుగ కార్యక్రమం ద్వారా నిధులు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఆ నిధులతో గ్రామాల్లో ముమ్మరంగా సీసీ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో రోడ్ల గురించి పట్టించుకోలేదు. దీంతో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, జడ్పీ రోడ్లు అధ్వానంగా మారాయి. రోడ్ల దుస్థితిని గుర్తించిన కూటమి ప్రభుత్వం పల్లెపండుగ ద్వారా గ్రామాల్లోని రోడ్ల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు విడుదల చేసింది. దర్శి నియోజకవర్గానికి రూ.15 కోట్లు విడుదలయ్యాయి. దర్శి మండలానికి రూ.3 కోట్లు మంజూరు కాగా, గ్రామాల్లో 36 సీసీ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మిస్తున్నారు. ఈపనులు పూర్తయితే గ్రామాల రూపురేఖలు మారిపోయి అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తుంది. గ్రామాల్లో ముమ్మరంగా సీసీ రోడ్లు నిర్మిస్తుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జ్యోతిబా పూలేకు నివాళి



పామూరు: పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం రామస్వామి తదితరులు

దర్శి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతి వేడుకలను దర్శిలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక గుజ్జుల సరళాదేవి భవన్‌లో ఆయన చిత్రపటానికి సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మాదపాకుల రమేష్, జిల్లా బహుజన రచయితల వేదిక నాయకుడు అట్లూరి రామారావు, దాసరి ఆనంద్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో జె.కోటేశ్వరరావు, కె.వినేష్, డి.కార్తీక్, ఆర్.సురేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కురిచేడులో.. కురిచేడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జ్యోతిబా పూలే వర్ధంతి వేడుకలు గురువారం కురిచేడు శాఖా గ్రంథాలయంలో గ్రంథ పాలకురాలు సమతి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణి, పంచాయతీ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ షబానా, తదితరులు పాల్గొన్నారు.

పామూరులో.. పామూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహిళా విద్య కోసం పోరాడిన సంఘ సంస్కర్త జ్యోతిబా పూలే అని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.రామస్వామి అన్నారు. గురువారం స్థానిక ఉన్నత పాఠశాల వద్ద ఉన్న పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ గుత్తి కొండలరావు, శేషం మోషే, బి.రాజేష్, బి.బాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన సామాజిక విప్లవ కారుడు జ్యోతిబా పూలే అని మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాజానాయబ్‌రసూల్ అన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాలర్పించారు. కార్యక్రమంలో షేక్ చాంద్ బాషా, జీవీ భాస్కరరెడ్డి, ఏ.కొండారెడ్డి, కాలేషా, ఎస్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై నిఘా

- ప్రిన్సిపల్ సీసీఎఫ్ చిరంజీవి చౌదరి ఆదేశం



యడవల్లి కొండ సమీపంలోని ప్లాంట్‌ను పరిశీలిస్తున్న చిరంజీవిచౌదరి

కనిగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కనిగిరి అటవీశాఖ కార్యాలయం గోడౌన్‌లో ఉన్న ఎర్ర చందనం నిల్వలను తిరుపతి ఫారెస్ట్ కార్యాలయానికి తరలించే ఏర్పాట్లు చేయాలని ఏపీ ప్రిన్సిపల్ సీసీఎఫ్ చిరంజీవి చౌదరి అన్నారు. స్థానిక అటవీ కార్యాలయాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కనిగిరి ఫారెస్ట్ డివిజన్ స్థాయిలో జరుగుతున్న అక్రమ రవాణాపై అధికారులు, బీట్ సిబ్బంది గట్టి నిఘా పెంచాలని సూచించారు. కనిగిరి కార్యాలయం గోడౌన్‌లో రికార్డుల ఆధారంగా ఎంత ఎర్రచందనం నిల్వలు ఉన్నది పరిశీలించి నివేదిక తయారు చేయాలని ఫారెస్ట్ రేంజర్ ఉమామహేశ్వరరెడ్డికి సూచించారు. కార్యాలయం ఆవరణలో మామిడి మొక్కను నాటారు.

అనంతరం కనిగిరి మండల పరిదిలోని యడవల్లి గ్రామ పరిధిలోని సోషల్ ఫారెస్ట్‌లో దాదాపు 250 ఎకరాల్లో ఉన్న ఎర్రచందనం, టేకు, మద్ది, ఇతర వృక్షాల ప్లాంట్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ అటవీ సంరక్షణకు పాటు పడేలా అవగాహన పెంచాలన్నారు. కంభం రోడ్డులోని శ్రీరంగాపురం గ్రామం వద్ద ఉన్న నగరవనాన్ని పరిశీలించారు. నగరవనంలో పార్కు ఏర్పాటుపై అభినందించారు. వనం అభివృద్ధికి శాఖాపరంగా సహాయ సహకారాలు అందజేస్తామన్నారు.

అలాగే, హనుమంతునిపాడు మండలపరిధిలోని హాజీపురం ఆర్‌ఎఫ్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీఎస్ఆర్ పథకం ద్వారా పెంచిన ప్లాంటేషన్ మొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో గుంటూరు ఫారెస్ట్ అధికారి విశ్వనాధ రాజు, ఒంగోలు డీఎఫ్‌వో హిమశైలజ, జిల్లా సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో రాజశేఖర్, కనిగిరి డీఎఫ్‌వో ఉమామ హేశ్వరరెడ్డి, ఎస్‌డీఎఫ్‌వో శ్రీనివాసరావు, సిబ్బంది, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

‘సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించాలి’



హాజీపురం గ్రామంలో మినుప పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

కనిగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం రైతులకు పెంపొందించాలని వ్యవసాయశాఖ గ్రామ సిబ్బందికి జిల్లా వ్యవసాయశాఖ వనరుల కేంద్ర కోఆర్డినేటర్ ఎస్.రామ్మోహన్ సూచించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో గురువారం వ్యవసాయశాఖ అధికారులకు, సిబ్బందికి ఆర్‌కేవీవై రాఫ్తార్ 2024-25 కింద సహాయ వ్యవసాయశాఖ సంచాలకులు వెంకటరమణ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ గ్రామ వ్యవసాయ సహాయకులు అన్ని పంటలలో సాంకేతిక సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుని గ్రామస్థాయిలో రైతులకు చేరవేయాలన్నారు. సీఎల్ఎస్ యాప్‌లో పురుగులు, తెగుళ్ళు, పోషక లోపాలు గుర్తించి ఫొటోలను ఎప్పటికప్పుడు యాప్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. దర్శి శాస్త్రవేత్త పి.సంధ్యారాణి మాట్లాడుతూ కంది, వినుము, పెసర, శనగ, మిరప పంటలలో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులను గురించి సిబ్బందికి వివరించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకట్రావు మాట్లాడుతూ పొలంబడి కార్యక్రమాలకే పరిమితం కాకుండా సిబ్బంది ప్రతిరోజు రైతు పొలాల దగ్గరకు వెళ్ళి పురుగులు, తెగుళ్ళు గుర్తించి తగు సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. రబీలో సాగుచేస్తున్న పైర్లకు సంబంధించి తప్పనిసరిగా ఈపంట నమోదు చేయాలన్నారు. వ్యవసాయశాఖ ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల వివరాలను రైతులకు అవగాహన కల్పించి లబ్ధిపొందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కనగిరి ఏడీఏ ఈవీ రమణ, ఏవో జ్యోష్నా దేవి, వివిధ మండలాల ఏవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

అనంతరం మండల పరిధిలోని హాజీపురం గ్రామంలోని మినుము పొలాలను పరిశీలించారు. మినుములో వచ్చే తెగుళ్ళ నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లావనరుల కేంద్రం వ్యవసాయాధికారులు ఏ.శైలజారాణి, వి.శేషమ్మ, వీఏఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ వసుంధర

స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషిచేయాలి

కనిగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల బలోపేతానికి వీవోఏలు సమర్థవంతంగా పనిచేయాలని డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వసుంధర అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో గురువారం జరిగిన నియోజకవర్గస్థాయి వీవోఏ శిక్షణ కార్యక్రమానికి ఏరియా కోఆర్డినేటర్ అంబేడ్కర్ అధ్యక్షత వహించారు. వసుంధర మాట్లాడుతూ ఇప్పటివరకు స్వయం సహాయక సంఘాల ద్వారా బ్యాంకుల నుంచి రుణాలు పొందిన వివరాలను త్వరతిగతిన యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఏ గ్రూపు ఎంతెంత బ్యాంకుల నుంచి రుణాలు పొంది అభివృద్ధి చెందిన వారి వివరాలతో పాటు వారు చేపట్టిన వ్యాపార వివరాలను కూడా యాప్ ద్వారా నమోదు చేయాలని తెలిపారు. వీవోఏలు గ్రామాల్లో పర్యటించి గ్రూపు సభ్యుల కుటుంబాల్లోని ఆర్థిక పురోగతి, చేస్తున్న పనులు, ఎంచుకున్న జీవనో పాధి, ఎంత ఆదాయం వంటి సర్వేను నిబద్ధతతో చేయాలన్నారు. వీవోఏలు తప్పనిసరిగా రోజువారీ విధానాలను యాప్ ద్వారా తెలియజేయాలని సూచించారు. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న ఎస్‌హెచ్‌జీ సభ్యులు సకాలంలో చెల్లించే వారి వివరాలతో పాటు తీసుకున్న రుణాలతో పాటు శ్రీనిధి రికవరీ చేస్తున్న వివరాలను పొందుపరచాలని సూచించారు. యాప్‌లో సర్వేలోని ప్రతి అంశాన్ని నమోదు చేయాలన్నారు. నిర్దేశించిన సమయంలో వీవోఏలు సర్వే పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో బ్యాంకు లింకేజి డీపీఎం సనిత, నరసింహారావు, ఆదిశేషు, కృష్ణకుమారి, అశోక్, జిలాని, విజయలక్ష్మి, వీవోఏలు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలి

తాళ్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందజేయాలని ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న తెలిపారు. మండలంలోని తూర్పుగంగం జడ్పీ హైస్కూల్‌లో గురువారం మధ్యాహ్నభోజన తీరును ఆకస్మికంగా పరిశీలించారు. భోజనం కోసం సిద్ధం చేసిన పదార్థాలను ఆమె పరిశీలించి రుచిచూశారు. కూరలు రుచికరంగా లేకపోవటం, అన్నం ఉడికి ఉడకనట్లుగా ఉండటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. రుచికరంగా భోజనం తయారుచేయాలని కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. మధ్యాహ్న భోజనం తయారీ సక్రమంగా ఉండేలా చూడాలని హెచ్‌ఎంకు సూచించారు.

విద్యార్థులు కష్టపడి చదవాలని ఆర్డీవో లక్ష్మీప్రసన్న తెలిపారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ముచేయకుండా లక్ష్యాన్ని ఎంచుకొని పట్టుదలతో సాధించాలన్నారు. పదో తరగతి విద్యార్థులు ఫలితాల్లో జిల్లాలో మొదటిస్థానంలో నిలవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.సంజీవరావు, వీఆర్వో శివారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాగా, బొద్దికూరపాడు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పెట్రోల్ బంకుకు కేటాయించిన స్థలాన్ని ఆర్డీవో లక్ష్మీప్రసన్న పరిశీలించారు. పెట్రోల్ బంక్ ఏర్పాట కోసం దరఖాస్తు రాగా.. ఆస్థలం అనువైనదా? కాదా పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.సంజీవరావు, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్ దంపతులు



సీఎం చంద్రబాబును కలిసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

దర్శి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తదితరులను నారావారిపల్లిలో గురువారం టీడీపీ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు కలిశారు. సీఎం చంద్రబాబు సోదరుడు రామూర్తినాయుడు దశదిన ఖర్మ వేడుకల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు, లోకేష్ ఇతర ముఖ్య నాయకులను కలిశారు. రామ్మూర్తినాయుడు కుటంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

డెయిరీలో ఆకస్మిక తనిఖీలు



తూర్పుగంగవరంలో తనిఖీలు చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారి, దర్శి సీఐ

తాళ్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుగంగవరం గ్రామంలో గల తేజ పాల డెయిరీని గురువారం ఫుడ్ సేఫ్టీ అధికారి, దర్శి సీఐలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఫుడ్‌సేఫ్టీ అధికారి నరసింహారావు మాట్లాడుతూ తాళ్లూరు ప్రాంతంలోని డెయిరీల్లో కల్తీపాల తయారీ జరుగుతున్నట్టు సమాచారం ఉందన్నారు. పాల కేంద్రాల సేకరణ వారు నాణ్యమైన పాలను మాత్రమే సేకరించాలన్నారు. ఆరోగ్యానికి హానీ కలిగించే పాలు సేకరించినట్లు పట్టుబడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో దర్శి సీఐ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు చందలూరు విద్యార్థుల ఎంపిక



జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

దర్శి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 18 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు, ఐదుగురు విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జాతీయ స్థాయిలో జరిగే అథ్లెటిక్స్, షటిల్, క్రికెట్ తదితర పోటీల్లో వీరు పాల్గొంటారు. చందలూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావటంపట్ల ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యుత్ చౌర్యాన్ని అరికట్టడానికి స్మార్ట్ మీటర్ల ఏర్పాటు



స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈఈ కృష్ణారెడ్డి

పామూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చౌర్యం జరగకుండా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడం కోసం స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేస్తున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డీవీ కృష్ణారెడ్డి తెలిపారు. పామూరు పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థల్లో పాత విద్యుత్ మీటర్ల స్థానంలో కొత్త స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పక్రియను గురువారం ప్రారంభించారు. గృహాలకు జనవరి నుంచి స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక విద్యుత్ శాఖ సిబ్బంది. కనిగిరి నుంచి ప్రత్యేక బృందం పాల్గొన్నారు.

‘ప్రకృతితో మమేకం కావాలి’

పామూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రకృతితో మమేకం కావాలసిన అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ గద్దె ఏడుకొండలు అన్నారు. గురువారం స్థానిక పామూరు పోలీస్ సర్కిల్ కార్యాలయంలో కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన దేశ్‌కా ప్రకార్తి పరిష్కాన్ అభయాన్ బ్యానర్‌ను సీఐ భీమానాయక్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అభియాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అనంతరం పోలీస్ సిబ్బందికి పలురకాల ఆయుర్వేద మందులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కొట్టె సురేష్, పామూరు, సీఎస్ పురం ఎస్ఐలు టి.కిశోర్‌బాబు, ఆర్.సుమన్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే గ్రామాల్లో హద్దురాళ్లు వినియోగిస్తాం

వెలిగండ్ల, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): రీసర్వే జరిగే గ్రామాల్లో హద్దురాళ్లు వినియోగిస్తామని అధికారులు తెలిపారు. ‘ముళ్ల కంపల్లో హద్దురాళ్లు’ శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలో 12 గ్రామాల్లోనే రీసర్వే జరిగిందని తెలిపారు. అక్కడ హద్దురాళ్ళను పాతగా మిగిలినవాటిని రీసర్వే జరగబోయే గ్రామాల సమీపంలో ఉంచామని తెలిపారు. హద్దురాళ్ళపై ఉన్న వైఎస్సార్ జగనన్న భూరక్ష అక్షరాలను తొలగించి త్వరలో జరగనున్న రీసర్వే గ్రామాలకు మిగిలినవాటిని వినియోగిస్తామని తెలిపారు

మద్యం బాటిళ్లు స్వాధీనం

కనిగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మద్యాన్ని అక్రమంగా అమ్ముతుండగా పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. ఎస్ఐ టి.శ్రీరాంకు అందిన సమాచారం మేరకు ఆయన ఆదేశాలతో గురువారం రాత్రి హెడ్ కానిస్టేబుల్ బాషా మండలంలోని మండాదరవారిపల్లిలో ఓ చిల్లర దుకాణంలో ఏడు క్వార్టర్ బాటిళ్ళు పట్టుకున్నారు. మరో హెడ్‌కానిస్టేబుల్ శ్రీను బలిపల్లి అడ్డురోడ్డు వద్ద కూల్‌డ్రింక్ షాపులో మద్యం అమ్ముతుండగా ఏడు బాటిళ్లను పట్టుకున్నారు. 14 క్వార్టర్ బాటిళ్ళను స్వాధీనం చేసుకుని ఎస్ఐ కేసు నమోదు చేశారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
శుక్రవారం 29 నవంబరు 2024







- ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌దారులకు తీపి కబురు
- 29న నగదు డ్రా చేసుకోవాలని ఎంపీడీవోలకు ఆదేశాలు
- గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 7.59 లక్షల మందికి లబ్ధి
- రెండు నెలలుగా పెన్షన్ తీసుకోని వారికి నగదు చెల్లింపునకు ఏర్పాట్లు

పింఛన్లు.. ఒక రోజు ముందే



గుంటూరు సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 1వ తేదీ ఆదివారం.. సెలవు. అంటే వచ్చే నెలలో పింఛన్ ఒకరోజు ఆలస్యంగా అందుతుంది. ఎలా అని ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌దారులు ఆలోచనలో ఉన్నారు. అయితే వారికి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. డిసెంబరు నెల పెన్షన్ ఒక రోజు ముందే అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. డిసెంబరు 1వ తేదీ ఆదివారం రావడంతో నవంబరు 30వ తేదీ శనివారమే పెన్షన్లు పంపిణీ చేయనున్నారు. వృద్ధులు, వితంతువులు, విభిన్న ప్రతిభావంతులు, ఒంటరి మహిళలు, ఆయా వ్యాధుల చేత బాధింపబడేవారు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. నవంబరు 29వ తేదీనే పెన్షన్ సొమ్మును బ్యాంకుల నుంచి డ్రా చేయాలని గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని ఎంపీడీవోలకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. శనివారం సచివాలయ ఉద్యోగులందరూ పెన్షన్ పంపిణీ కోసం అందుబాటులో ఉండాలని జిల్లా అధికారులు వారికి ఆదేశాలు జారీ చేశారు. శనివారం పెన్షన్ పొందని వారికి డిసెంబరు 2న అందజేయనున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో గుంటూరు జిల్లాలో 2,55,258 మందికి, పల్నాడు జిల్లాలో 2,75,070 మందికి, బాపట్ల జిల్లాలో 2,29,635 మందికి ఒక రోజు ముందే పెన్షన్ చేతికి రానుంది. గత ప్రభుత్వ హయాంలో నెల మొదటి తేది సెలవు దినమైతే ఆ మరుసటి రోజు పెన్షన్ పంపిణీ చేసే వారు. అందువల్ల పెన్షన్‌దారులు కొంత ఇబ్బంది పడే వారు. సెలవులు వరుసగా రెండు, మూడు రోజులు వచ్చినప్పుడు కూడా అప్పటి ప్రభుత్వం పెన్షన్‌దారులను

(మిగతా 6వ పేజీలో..)

రైతులకు.. రాయితీలు

- అన్నదాతలకు ప్రభుత్వం అండగా ..
- యంత్ర పరికరాలు మొదలు రుణాల వరకు లబ్ధి
- వైసీపీ ప్రభుత్వంలో అటకెక్కిన పథకాలు పునరుద్ధరణ
- ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌లోనూ పెద్ద ఎత్తున కేటాయింపులు
- గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు రూ.700 కోట్ల వరకు లబ్ధి



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గడచిన ఐదేళ్లు రైతుల సంక్షేమాన్ని విస్మరించడమే కాకుండా వ్యవసాయాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టిన ఘనత వైసీపీది. 2014--19 మధ్య కొనసాగిన అనేక పథకాలకు గత పాలకులు మంగళం పాడారు. ఇక కౌలు రైతులకు అందించే రుణాల విషయంలో నిబంధనాల చట్రంలో వారిని బిగించేశారు. విత్తన రాయితీలు, వ్యవసాయ అనుబంధ పాడిపరిశ్రమకు ఊతమిచ్చే అనేక కార్యక్రమాలను అటకెక్కించిన గత పాలకులు అన్నదాతల వెన్ను విరిచారు. ఈ పరిస్థితుల్లో అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం అన్నదాతలకు అండగా ఉండేందుకు కార్యాచరణ మొదలుపెట్టింది. ఈ క్రమంలో గతంలో రైతులకు అందించిన అన్ని రాయితీలను తిరిగి పునరుద్ధరించింది. ఇందుకు సంబంధించి రైతు సేవా కేంద్రాలు రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నాయి. మొన్నటి బడ్జెట్‌లో కూడా వ్యవసాయానికి పెద్ద పీట వేసింది. గతంలో టీడీపీ ప్రభుత్వం రైతులకు కావాల్సిన యంత్రపరికరాలను వ్యక్తిగతంగా రాయితీపై అందించేది. కానీ వైసీపీ ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి చెప్పి గ్రూపుల పేరిట వైసీపీ శ్రేణులకు లబ్ధి చేకూర్చింది. ప్రస్తుతం యంత్ర పరికరాలను తిరిగి రైతులకు వ్యక్తిగతంగా అందించడానికే కూటమి ప్రభుత్వం సమాయత్తమవుతోంది. తైవాన్ స్ప్రేయర్ల విషయంలో రైతులకు 8 నుంచి 10 వేల వరకు రాయితీని అందించడానికి కూటమి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. రైతులకు కావాల్సిన ట్రాక్టర్, నూర్పిడి యంత్రాలతో పాటు అత్యాధునికంగా మార్కెట్‌లోకి వచ్చిన వ్యవసాయ అనుబంధ యంత్రాలను రాయితీపై అందించే విధంగా ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించి

(మిగతా 6వ పేజీలో)

కోడిగుడ్డు ధర.. పైపైకి

- హోల్‌సేల్‌లో గుడ్డు రూ.6
- చిల్లర దుకాణాల్లో రూ.7కు విక్రయం
- మరింత పెరగ వచ్చంటోన్న వ్యాపారులు




గుంటూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కోడిగుడ్డు ధర రోజురోజుకు పైపైకి చేరుతోంది. గుడ్డు ధర హోల్‌సేల్‌లోనే రూ.6కు చేరింది. వంద గుడ్ల ధర రూ.600లుగా పేర్కొంటూ విజయవాడ జోన్ నెక్ వ్యాపారులు ప్రకటించారు. దాంతో సాధారణ చిల్లర దుకాణాల్లో గుడ్డు ధర రూ.7లకు విక్రయిస్తున్నారు. అయితే గుడ్డు ధర మరింతగా పెరిగే ఛాన్స్ లేకపోలేదని పౌల్ట్రీ వ్యాపారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు కార్తీకమాసం కావడంతో సాధారణంగా మాంసాహారం, గుడ్ల విక్రయాలు పడిపోతుంటాయి. అయినా కోడిగుడ్డు ధరలు మాత్రం రోజురోజుకు పెరగడం సామాన్య ప్రజల్ని ఆందోళనకు గురిచేస్తోంది. చిన్నారుల నుంచి పెద్దల వరకు కోడిగుడ్డు అంటే ఇష్టపడని వారుండరు. విభిన్న రకాలుగా ఆహారంలో కోడిగుడ్డును ఉపయోగిస్తుంటారు. ప్రస్తుతం మార్కెట్లో కోడిగుడ్ల డిమాండ్ మేరకు ఉత్పత్తి లేకపోవడమే ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. అంతేగాక గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచే కాక తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి కోడిగుడ్లు పశ్చిమ బెంగాల్‌కు పెద్దఎత్తున ఎగుమతులు ఉన్నాయని ఫలితంగానే ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారి యర్రబోతు వెంకటరమణ తెలిపారు. ఈ నెల మొదటి వారంలో 100 గుడ్లు రూ.565 నుంచి రూ.535 వరకు తగ్గి మరలా పెరుగుతూ వచ్చింది. గత వారంలో 100 గుడ్లు రూ.580, రూ.590కు కొనసాగింది. తాజాగా 100 గుడ్లు రూ.600లకు చేరింది. నూతన సంవత్సరం, క్రిస్మస్ వేడుకల్లో కేక్‌లకు పెద్దఎత్తున కోడిగుడ్లను వినియోగించే అవకాశం ఉందని తద్వారా డిమాండ్ ఒక్కసారిగా పెరిగిందని చెబుతున్నారు. ఫలితంగానే కోడిగుడ్డు ధర ఎన్నడూ లేని విధంగా గణనీయంగా పెరిగింది. దీంతో ఇదే అదునుగా చిల్లర దుకాణాల్లో గుడ్డు ధర రూ.7లకు విక్రయిస్తున్నారు. ప్రస్తుత ధర కొంతకాలం కొనసాగే అవకాశం ఉంది.

ఉత్తరాఖండ్‌పై మ్యాచ్‌లో ఆంధ్రా పట్టు



లోహిత్ (7 వికెట్లు)



రితిక్ (7 వికెట్లు)

మంగళగిరి సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కూచ్ బెహార్ ట్రోఫీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఉత్తరాఖండ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు పట్టు బిగించింది. నాలుగు రోజుల మ్యాచ్‌లో భాగంగా తొలి రోజు ఆంధ్రా జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 48.4 ఓవర్లలో 139 పరుగులు చేసి ఆలౌటయింది. ఆంధ్రా బ్యాటర్లు ఈశ్వర్ రిత్విక్ 47, వరుణ్ సాత్విక్ 43 పరుగులు చేయగా, ఉత్తరాఖండ్ బౌలర్ రితిక్ దూహాన్ 16.4 ఓవర్లలో 36 పరుగులిచ్చి 7 వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరాఖండ్ జట్టు 18.4 ఓవర్లలో కేవలం 85 పరుగులు మాత్రమే చేసి ఆలౌటయింది. ఆంధ్రా బౌలర్ ఏఎస్‌వీ లోహిత్ 7.4 ఓవర్లలో 34 పరుగులిచ్చి 7 వికెట్లు పడగొట్టాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా జట్టు 19 ఓవర్లలో ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 76 పరుగులు చేసింది. లోహిత్ లక్ష్మీనారాయణ 39 పరుగులు చేశాడు. దీంతో ఆంధ్రా జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 130 పరుగుల ఆధిక్యంలో వుంది.

వెయిట్ లిఫ్టింగ్ విజేత శివాజీ యూనివర్సిటీ



ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని వీసీ ఆచార్య కే గంగాధరరావు చేతుల మీదగా అందుకుంటున్న శివాజీ యూనివర్సిటీ విద్యార్థులు

పెదకాకాని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 26వ తేదీ నుంచి జరుగుతున్న సౌత్ వెస్ట్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఓవరాల్ టీం ఛాంపియన్షిప్ ట్రోఫీని కొల్హాపూర్‌లోని శివాజీ యూనివర్సిటీ కైవసం చేసుకుంది. రన్నర్స్‌గా విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ నిలిచింది. కేరళలోని యూనివర్సిటీ ఆఫ్ కాలికట్ మూడో స్థానంలో నిలిచింది. ఈ మేరకు పోటీల నిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ పీపీఎస్ పాల్ కుమార్ ఫలితాలను గురువారం విడుదల చేశారు. ఇందులో బెస్ట్ లిఫ్టర్‌గా యూనివర్సిటీ ఆఫ్ ముంబాయికి చెందిన క్రీడాకారిణి సౌమ్య దాల్వి కైవసం చేసుకున్నారు. అలాగే ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి చెందిన క్రీడాకారిణి టి.రేణుక స్ట్రాంగ్ ఉమెన్ కేటగిరీ అవార్డును సొంతం చేసుకున్నారు. విజేతలకు ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి గంగాధరరావు మాట్లాడుతూ క్రీడా పోటీల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. రిజిస్ట్రార్ సింహాచలం మాట్లాడుతూ పోటీల నిర్వహణకు మహిళలతోపాటు ఆయా యూనివర్సిటీల టీం మేనేజర్లు, టెక్నికల్ అఫీషియల్స్ సహకరించినందుకు అభినందించారు. 365 మంది మహిళా క్రీడాకారులు పాల్గొని పోటీలను విజయవంతం చేశారన్నారు. టెక్నికల్ కమిటీ చీఫ్‌గా వ్యవహరించిన వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బడేటి వెంకటరామయ్య, ఆంధ్రప్రదేశ్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రెటరీ దిల్లా బాబు, డాక్టర్ డి. సూర్యనారాయణ, డాక్టర్ రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ ఆర్ట్స్ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

పెదకాకాని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని ఆర్ట్స్, కామర్స్, లా కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్లకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం.సురేష్ కుమార్ తెలిపారు. ఎంఏ ఇంగ్లిష్ 8, లింగ్విస్టిక్స్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్ 10, తెలుగు 15, సంస్కృతం 10, హిందీ 10, ఉర్దూ 10, బుద్ధిస్ట్ స్టడీస్ 10, జర్నలిజం 15, సోషియాలజీ 20, సోషల్ వర్క్ 20, రూరల్ డెవలప్‌మెంట్ 15, హిస్టరీ 10, హిస్టరీ అండ్ ఆర్కి యాలజీ 7, పొలిటికల్ సైన్స్ 7, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ 10, ఎకనామిక్స్ 15, ఎం కామ్ 17, ఎంఈడీ 20, ఎమ్ఎల్ఐఎస్‌సి 10 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ఆయన తెలిపారు.

సారా తయారీ కేంద్రాలపై... ఎక్సైజ్ అధికారుల దాడులు

- 10లీటర్ల సారా స్వాధీనం 700లీటర్లు బెల్లం ఊట ధ్వంసం



స్వావర్తుపురంలో బెల్లం ఊట ధ్వంసం చేసి స్వాధీనం చేసుకున్న డ్రమ్ములతో వివరాలు తెలియజేస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు

బాపట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వావర్తుపురంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు విస్తృత దాడులు నిర్వహించారు. ముందస్తు సమాచారం మేరకు మంగళగిరి ఎస్‌టీఎఫ్ ఈఎస్ మధుబాబు ఆధ్వర్యంలో ఒంగోలు ఏఈఎస్ జనార్దనరావు, బాపట్ల ఏఈఎస్ బి.వెంకటేశ్వర్లు, బాపట్ల,చీరాల సీఐలు పి.గీతిక, పి.నాగేశ్వరరావులు సిబ్బందితో కలిసి ఉమ్మడిగా దాడులు నిర్వహించారు. సారా తయారీ కేంద్రాలను గుర్తించి 700లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 10లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. సారా తయారు చేసినా.. విక్రయించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సారా తయారికి ఉపయోగించే నల్లబెల్లం విక్రయించే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. అమ్మినవారిపై, వారికి సహకరించిన వారిపై బైండోవర్ నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు డీ ప్రభుదాసు, ఎస్ మౌనిక, ఏ శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు... సిద్ధంకావాలి

- 5న ప్రకటన జారీ.. 8న ఎన్నికల నిర్వహణ
- ఎక్కడికక్కడ ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలి
- అధికారుల సమీక్షలో కలెక్టర్ జె.వెంకటమురళి



జలవనరులు, రెవెన్యూ అధికారులతో సమావేశమైన కలెక్టర్ జె.వెంకటమురళి, ఏఎస్పీ విఠలేశ్వర్

బాపట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికలు సమర్థంగా నిర్వహించడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఎన్నికల నిర్వాహణపై జలవనరులు, రెవెన్యూశాఖాధికారులతో గురువారం కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆయకట్టు భూములలో పంటలు సాగు చేస్తున్న రైతులందరికీ ఓటు హక్కు ఉండాలని చెప్పారు. డిసెంబరు 8న నీటి సంఘాల ఎన్నికల నిర్వాహణకు అధికారులు ఎక్కడికక్కడ ముందస్తుగా చేసుకోవాలన్నారు. శాంతిభద్రతల సమస్యలు రాకుండా పోలీసు యంత్రాంగం బందోభస్తు నిర్వహించాలన్నారు. డిసెంబరు 5న ఎన్నికల ప్రకటన జారీ చేయాలన్నారు. 8న నీటి సంఘాల ఎన్నికలు జరుగుతాయన్నారు. జిల్లాలో 1944 టెరిటోరియల్ నియోజకవర్గాల్లో ఒక్కొక్క సభ్యుడి ఎన్నిక జరగాలన్నారు. 170 నీటి సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక జరపాలన్నారు. డిసెంబరు 11న 22 డీసీ (కాల్వలకమిటి) ఎన్నికల జరుగుతుందని తెలిపారు. డిసెంబరు 14న కేడబ్ల్యూడీ(పశ్చిమ కృష్ణాడెల్టా) ప్రాజెక్ట్ కమిటీకి ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. సమావేశంలో ఏఎస్పీ విఠలేశ్వర్, జలవనరులశాఖ ఎస్ఈ అబూతలీమ్, ఈఈ వెంకటరత్నం, ఇంజనీరింగ్ అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

రేపే పింఛన్ల పంపిణీ

ఎన్టీఆర్ భరోసా పింఛన్ లబ్ధిదారులకు ఈ నెల 30న పంపిణీ చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. డిసెంబరు 1న ఆదివారం వచ్చినందున ఆ నెలకు సంబంధించిన పెన్షన్ ఒకరోజు ముందుగానే పంపిణీ చేయాలని చెప్పారు. జిల్లా, మండల అధికారులతో గురువారం కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. పింఛన్‌ను ముందస్తుగా ఇస్తున్న విషయాన్ని లబ్ధిదారులకు తెలియపర్చాలన్నారు. శనివారం ఉదయం 5.30గంటలకే పింఛన్ పంపిణీ ప్రారంభించాలన్నారు. ప్రతిగంటకు సమాచారాన్ని కలెక్టరేట్‌కు చేరవేయాలన్నారు. నూరుశాతం ఒకేరోజు పంపిణీ చేయాలన్నారు. పింఛన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడిన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు.. ముఖ్యమంత్రి హాజరు

బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాట్లపై విద్యాశాఖకమిషనర్ సమీక్ష



అధికారులకు సూచనలు చేస్తున్న రాష్ట్ర విద్యాశాఖకమిషనర్ విజయరామరాజు

బాపట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రగతిపై నిర్వహించే మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరవుతారని విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ఖరారవడంతో విద్యాశాఖా కమిషనర్ బుధవారం బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శించారు. కలెక్టర్ జె.వెంకటమురళితో కలిసి పరిసరాలను పరిశీలించి అధికారులతో చర్చించారు. సీఎం పర్యటనను జయప్రదం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా విద్యార్థుల ప్రగతిపై అధికారులు దృష్టి సారించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు డిసెంబరు 7న జరిగే సీఎం కార్యక్రమానికి హాజరయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపడానికి ఉన్నతస్థాయికి ఎదిగిన పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులను ఆహ్వానించాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాలలో వసతి పొందుతూ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులను కూడా ఆహ్వానించాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం తయారు చేయాలన్నారు. విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు టగ్గాఫ్ వార్ పోటీలను నిర్వహించాలన్నారు. పాఠశాలలోని విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కార్యక్రమాలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసు కవాతు మైదానంలో సిద్ధం చేసిన హెలిప్యాడ్, పాఠశాలకు చేరుకునే మార్గంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్షఅభియాన్ ఎస్‌పీడీ శ్రీనివాసరావు, విద్యాశాఖ ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి, విద్యాశాఖ డైరెక్టర్లు శ్రీనివాసరెడ్డి, మధుసూధనరావు, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, డీఈవో ఎస్.పురుషోత్తం, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి, ఎంఈవోలు ఎస్.నిరంజన్, డి.ప్రసాదరావు, ఏఎస్పీ విఠలేశ్వర్, డీఎస్పీ రామాంజనేయులు, ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ, పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి విలియమ్స్, సోషల్ వెల్ఫేర్ డీడీ జె.రాజా దె బోరా, మహిళా శిశు సంరక్షణశాఖ పీడీ కె.ఉమా, ఉద్యాన శాఖాధికారి జెన్నెమ్మ పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న రాష్ట్ర విద్యాశాఖకమిషనర్ విజయరామరాజు

కొనసాగుతున్న ఒకటో నెంబర్ ప్రమాద సూచిక



నిజాంపట్నం హార్బర్‌లో 1వనెంబర్ ప్రమాదసూచిక

నిజాంపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బంగాళా ఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫాన్‌గా మారడంతో నిజాంపట్నం హార్బర్‌లో రెండో రోజు గురువారం ఒకటో నెంబర్ ప్రమాదసూచిక కొనసాగుతుందని పోర్టు కన్జర్వేటర్ మోకా వెంకటరామారావు తెలిపారు. సముద్రంలో అలల తీవ్రత ఎక్కువగా ఉందని మత్స్యకారులు ఎవరూ చేపల వేటకు వెళ్ళరాదని సూచించారు. సముద్రంలో వేట చేసే మత్స్యకారులు వెనుతిరిగి హార్బర్‌కు చేరుకోవాలని ఆదేశాలు జారీచేశారు.



జిల్లా గ్రంథాలయంలో పూలేకు నివాళి

జ్యోతిబా పూలేకు ఘన నివాళి

- నివాళులర్పించిన మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా
- పలు సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ

ఒంగోలు కల్చరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఒంగోలు నగరంలోని కొత్త కూరగాయల మార్కెట్ దగ్గర ఉన్న పూలే విగ్రహానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, మేయర్ గంగాడ సుజాత తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు విద్య ఒక్కటే మార్గమని పూలే దంపతులు నాడు ఎంతో కృషి చేశారన్నారు. వారి సేవలు నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కలెక్టర్ అన్సారియా ప్రసంగిస్తూ స్త్రీ విద్య అవసరాన్ని గుర్తించి మహిళల కోసం ప్రత్యేకంగా పాఠశాలలను స్థాపించి మహిళా విద్యకు పూలే, ఆయన సతీమణి కృషి చేశారన్నారు. చైర్మన్ బాలాజీ మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాలు సమానంగా ఎదిగినప్పుడే వారికి గౌరవమని పూలే భావించారన్నారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి అంజల, కమిషనర్ వెంకటేశ్వరరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, ప్రజాసంఘాల ప్రతినిధులు నీలం నాగేంద్రరావు, గంట సుబ్బారావు, దారా అంజయ్య, బంకా చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయంలో..

స్థానిక వైసీపీ కార్యాలయంలో పూలే వర్ధంతి సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తదితరులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవి, కఠారి శంకర్, దామరాజు క్రాంతికుమార్, బొట్ల సుబ్బారావు, వెన్నపూస వెంకటరామిరెడ్డి, రొండా అంజిరెడ్డి, కె.ఆదెన్న, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..


రాజాపానగల్ రోడ్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో పూలే వర్ధంతిని పురస్కరించుకుని సిబ్బంది, పాఠకులతో కలిసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపగ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి, అసిస్టెంట్ లైబ్రేరియన్ సంపూర్ణ కాళహస్తి పాల్గొన్నారు.

పూలేకు ఎస్పీ నివాళులు

ఒంగోలు(క్రైం): మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్పీ దామోదర్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ దేవప్రభాకర్, ఏవో రామ్మోహనరావు, ఆర్ఐలు రమణారెడ్డి, రమేష్‌కృష్ణన్, సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

నగర పాలనకు పన్నుపోటు

- 300కు పైగా ప్రభుత్వ భవనాలకు పేరుకుపోతున్న బకాయిలు
- రూ.40 కోట్ల పెండింగ్‌కు రూ.కోటి మాత్రమే వసూలు
- ప్రైవేటు ఆస్తులవి రూ.50కోట్లు.. చెల్లింపులు రూ.20 కోట్లు
- తాగునీటి బకాయిలు రూ.10కోట్లు.. వసూలు రూ.1కోటి
- నిధులు లేక నీరసించిన ఒంగోలు నగరపాలక సంస్థ



ఒంగోలు కార్పొరేషన్‌కు పన్ను బకాయిలు గుదిబండలా మారాయి. ఏటేటికీ అవి కొండలా పేరుకుపోతున్నాయి. నగర పాలక సంస్థ అభివృద్ధికి జవసత్వాలు ఇచ్చేది ఆర్థిక వనరులే. పన్నుల బకాయిలు కోట్లలో పేరుకుపోవడంతో ఖజానా వెలవెలబోతోంది. యంత్రాంగంలో అలసత్వం, పన్నుదారుల్లో నిర్లక్ష్యమే ఇందుకు కారణం. ప్రధానంగా ప్రభుత్వ ఆస్తుల పన్ను బకాయిలు పెద్ద తలనొప్పిగా మారాయి. 2002 నుంచి బడ్జెట్ లేదనే కారణంతో ఆయా శాఖల నుంచి చెల్లింపులు లేకపోవడం, రెవెన్యూ విభాగం పట్టించుకోకపోవడంతో కోట్లలో బకాయిలు ఉన్నాయి. తాజాగా పన్ను వసూలుకు గడువు ముంచుకొస్తుండడంతో ఇప్పుడు వసూళ్లకు అధికారులు నానా తంటాలు పడుతున్నారు. ప్రధానంగా ఆయా డివిజన్ల వారీగా కేటాయించిన ఆర్ఐలు, సచివాలయ సెక్రటరీలకు బకాయిల వసూలు అన్నది కత్తి మీద సాములా మారింది.

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరపాలక సంస్థకు పన్ను పోటు పెరిగింది. జిల్లా కేంద్రంలో ఉన్న 300 ప్రభుత్వ భవనాలకు సంబంధించి అసలు రూ.15 కోట్లు పన్ను బకాయి ఉండగా, వడ్డీ రూ.25 కోట్లు ఉంది. దీంతో రూ.40కోట్లు ప్రభుత్వ బకాయిలు ఉండగా, ప్రైవేటు ఆస్తులకు సంబంధించి రూ.34 కోట్లు వసూలు కావాల్సి ఉండగా, పాత బకాయిలు మరో రూ.14 కోట్లు ఉన్నట్లు సమాచారం. మొత్తం ప్రైవేటుది రూ.50 కోట్లు బకాయి ఉంది. ఇందుకు సంబంధించి ఇటీవల పన్నుల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. దీంతో సుమారు రూ.20 కోట్లు వరకు వసూలైనట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

ప్రభుత్వ భవనాల బకాయిలు రూ.40 కోట్లు

నివాస గృహాల ఇంటిపన్నును ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్న నగరపాలక సంస్థ.. ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సిన వాటిపై ఉదాసీనంగా వ్యవహరిస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. కొన్నేళ్లు పన్నులు చెల్లించకపోవడంతో అపరాధ రుసుం కూడా తోడై బకాయిల భారం మరింత పెరిగింది. వాస్తవానికి 2002 నుంచి ఇప్పటివరకు పన్నులు రూ.15కోట్లు బకాయిలు వసూలు కావాల్సి ఉండగా, వడ్డీ రూ.25 కోట్లకు పెరిగింది. దీంతో ఆయా శాఖల నుంచి రూ.40 కోట్లు రావాల్సి ఉంది. అందులో ప్రధానంగా పోలీసు శాఖ, ప్రకాశం భవనం, కోర్టు, డీఆర్‌డీఏ, ఆర్అండ్‌బీ, ఎన్నెస్పీ, పంచాయతీరాజ్, బీసీ కార్పొరేషన్, జిల్లా పరిషత్, డ్వామా, రిమ్స్ భవనాల బకాయిలే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే కార్పొరేషన్ రెవెన్యూ యంత్రాంగం కేవలం నోటీసులతోనే సరిపెడుతుండగా, ఆయా ప్రభుత్వ శాఖలు సైతం పెద్దగా స్పందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి కొన్ని శాఖలు అప్పుడప్పుడు చెల్లింపులు చేస్తుండగా మరి కొన్ని తమకేమీ తెలియదన్నట్లుగానే వ్యవహరిస్తున్నాయి. వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించినా ప్రభుత్వ బకాయిలు మాత్రం వసూలు కాకపోవడంతో నగరపాలక సంస్థ సిబ్బంది డీలాపడుతున్నారు. నిబంధన మేరకు ఆయా శాఖల జీతభత్యాలతోపాటు కార్యాలయ భవనాల అద్దె, విద్యుత్ బిల్లుల చెల్లింపు, వివిధ పన్నులు చెల్లించేందుకు ఏటా బడ్జెట్ విడుదల చేయాలి. అయితే ఈ విధానం సక్రమంగా అమలు కాకపోవడంతో బకాయిల భారం మరింత రెట్టింపై కూర్చుంటుంది.

రెవెన్యూలో 'గూడు' పుఠాణి

ఒంగోలు నగరంలో సుమారుగా 67 వేల వరకు అస్సెస్‌మెంట్‌లు ఉన్నాయి. అందులో రెసిడెన్షియల్ 35,402, నాన్ రెసిడెన్షియల్ 7వేలు, పార్టిలీ, నాన్ పార్టిలీ (అన్నీ కలిపి) 4,720 వరకు ఉండగా వాటికి సంబంధించి రూ.22 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. వాటితోపాటు రాష్ట్ర, కేంద్ర, ప్రభుత్వ కార్యాలయాల భవనాలు 300 వరకు ఉండగా వీటికి సంబంధించి రూ.40 కోట్లు వసూలు చేయాలి. ఇకపోతే దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్‌లో, నగరంలోని పలు ప్రాంతాలలోని మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లకు సంబంధించి సుమారు రూ.4.5 కోట్లు బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంచితే తాగునీటి పన్ను రూ.10 కోట్లు, ప్రైవేటు ఆస్తుల బకాయిలు రూ.50 కోట్లు ఉండటంతో పూర్తిస్థాయిలో వసూలే లక్ష్యంగా కార్పొరేషన్ అధికారులు దృష్టిసారించారు. అయితే ఇంత పెద్దమొత్తంలో బకాయిలు పేరుకుపోవడానికి గతంలో ఆర్ఐలుగా పనిచేసిన వారి నిర్లక్ష్యమే కారణంగా కనిపిస్తుంది.

అన్నింటికీ పన్నులే ఆధారం.

అధిక శాతం అభివృద్ధి పనులకు ఆయా మునిసిపాలిటీల ఖజానా నిధులు (జనరల్ ఫండ్)లనే ఉపయోగించాల్సి ఉంది. వాటితో తాగునీటి నిర్వహణ, కాంట్రాక్టు సిబ్బంది జీతాలు, పలు అభివృద్ధి పనులు, విద్యుత్ దీపాలు నిర్వహణ, విద్యుత్ బకాయిలతో పాటు పార్కుల నిర్వహణ, పారిశుధ్యం మెరుగు ఇతరత్రా కొన్ని ఆర్థికపరమైన వాటికి వీటినే వినియోగించాల్సి ఉంది. అయితే పన్ను వసూలు విషయంలో అధికారుల నిర్లక్ష్యంతో కార్పొరేషన్ ఖజానా బోసిపోతుంది.

డబ్బులు చెల్లించకుండా తాగేస్తున్నారు.

నగరంలో 47వేలకుపైగా గృహాలు ఉండగా, అధికారుల లెక్కల ప్రకారం 26,461 కొళాయి కనెక్షన్‌లు మాత్రమే ఉన్నట్లు సమాచారం. ఇప్పటివరకు పాత బకాయిలతో కలిపి రూ.10కోట్లు తాగునీటి పన్ను వసూలు కావాల్సి ఉంది. కాగా వాటిలోనే గృహ అవసరాలు, వాణిజ్య అవసరాలు, అపార్ట్‌మెంట్‌లు ఇతరత్రా అన్నింటికీ సంబంధించి కొళాయిలు ఉన్నట్లు అధికారుల కాకిలెక్కలు. వాస్తవ పరిస్థితి పరిశీలిస్తే సుమారు 8 వేల వరకు అక్రమ కొళాయి కనెక్షన్‌లు ఉన్నట్లుగా తెలుస్తోంది. అయితే వాటిని తొలగించడం కానీ, క్రమబద్ధీకరించే దిశగా అధికారులు దృష్టిసారించకపోవడంతో ఆశించిన స్థాయిలో పన్ను వసూలు కావడం లేదు.

అత్యధిక బకాయి ఉన్న ప్రభుత్వ భవనాలు

ఎస్పీ కార్యాలయం	రూ.3.53 కోట్లు
ప్రకాశం భవనం	రూ.6.85 కోట్లు
కోర్టు భవనాలు	రూ.80 లక్షలు
డీఆర్‌డీఏ	రూ.3.19 కోట్లు
ఆర్అండ్‌బీ	రూ.1.85 కోట్లు
ఎన్నెస్పీ	రూ.1.17 కోట్లు
పంచాయతీరాజ్	రూ. 77 లక్షలు
బీసీ కార్పొరేషన్	రూ. 1.65 కోట్లు
జిల్లా పరిషత్	రూ. 4.35 కోట్లు
డ్వామా	రూ. 80 లక్షలు
రిమ్స్ భవనాలు	రూ. 1.55 కోట్లు

రైతులకు.. రాయితీలు

(5వ పేజీ తరువాయి)

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో దాదాపు రూ.220 కోట్ల వరకు వ్యయం చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు

కౌలు రైతుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి..

గత ప్రభుత్వ హయాంలో పూర్తి నిర్లక్ష్యానికి గురైన కౌలు రైతులను ఆదుకోవడానికి కూటమి పాలకులు ప్రత్యేక దృష్టిసారించారు. కేవలం సీసీఆర్సీ కార్డుల జారీతో సరిపెట్టకుండా రుణాలను కూడా వారి దరికి చేర్చేలా ఆదేశాలు జారీ చేశారు. కౌలు రైతులను ఆదుకోవడంలో తమతో పాటు బ్యాంకర్లు కూడా కలిసిరావాలని పాలకులు కోరారు. గడచిన ఐదేళ్లలో ఏ ఒక్క ఆర్థిక సంవత్సరంలోనూ ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వంద కోట్లకు మించి కౌలు రైతులకు రుణాలివ్వలేదు. అలాంటిది ఈ ఆర్థికసంవత్సరంలో దాదాపు రూ.220 కోట్ల వరకు రుణాల ద్వారా కౌలు రైతులు లబ్ధి పొందనున్నారు

ఉద్యాన సాగు రాయితీలు..

ఉద్యాన పంటలకు అందించే రాయితీల విషయంలో కూడా ఓ లక్ష్యంలో అధికారులు ముందుకెళుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు మూడు జిల్లాల పరిధిలో కలిపి దాదాపు రూ.90 కోట్ల వరకు ఉద్యాన సాగుకు ప్రోత్సాహకాలు అందించే విధంగా కార్యాచరణ రూపొందించారు. ఉద్యాన సమగ్ర అభివృద్ధి మిషన్ కింద పండ్ల తోటల పెంపకం, కోల్డ్ స్టోరేజ్‌ల ఏర్పాటు, ఎఫ్‌పీవోలో ఉన్న సభ్యులకు శిక్షణ ఇచ్చి మెరుగైన మార్కెటింగ్ చేసుకునే సదుపాయిం కల్పించడం ఇందులో ముఖ్యమైనవి. మల్చింగ్ షీట్లు, పందిళ్ల నిర్వహణకు తోడు విస్తరణ వంటి అనేక పథకాలకు కేంద్రం అందించే మొత్తాలకు మ్యాచింగ్ గ్రాంటు జత చేసి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన రైతులకు అందించనుంది

రాయితీపై విత్తనాలు...

50 శాతం రాయితీపై విత్తనాలు అందించే పథకానికి కూడా గత ప్రభుత్వం తూట్లు పొడిచింది. రాయితీని పదిశాతానికి పరిమితం చేసి రెండేళ్ల పాటు అందించిన వైసీపీ ప్రభుత్వం ఆ తర్వాత దానికి కూడా పూర్తిగా మానేసింది. ప్రస్తుతం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోనే విత్తనాలు పంపిణీ చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. సాగుదారులపై ఎకరానికి దాదాపు 5 నుంచి ఆరు వేల వరకు ఈ రాయితీ విత్తనాల వల్ల భారం తగ్గనుంది. దీని వల్ల ప్రభుత్వంపై మూడు జిల్లాల పరిధిలో అదనంగా పడే భారం దాదాపు రూ.120 కోట్ల వరకు ఉండొచ్చనేది అంచనా.

భూసార పరీక్షలు.. అగ్రి ల్యాబ్‌లు..

ఏ పంటకు నేల అనువుగా ఉంటుందో శాస్త్రీయ పరీక్షల్లో అధ్యయనం చేసి వాటి ఫలితాలను రైతులకు అందించడం ద్వారా వారికి ప్రభుత్వం మేలు చేసినట్లవుతోంది. కానీ గడచిన ఐదేళ్లలో ఒక్క శాంపిల్‌ను కూడా పరీక్ష జరిపి రైతులకు ఫలితాలను అందించిన దాఖలాలే లేవు. ఇక అగ్రిల్యాబ్‌లు సంగతి చెప్పక్కర్లేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తొలినాళ్లలోనే భూసార పరీక్షలపై దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడమే కాకుండా నిర్వహణ ఖర్చులకు నిధులను సైతం జారీ చేసింది. ఇటీవల అసెంబ్లీలో ప్రకటించిన వ్యవసాయ బడ్జెట్‌లో కూడా అన్నదాతల సంక్షేమం కోసం పెద్ద ఎత్తున కేటాయింపుల జరిపిన సంగతి తెలిసిందే. వీటిలో ముఖ్యంగా కరకట్టల పటిష్టతతో పాటు కాల్వల్లో పూడికతీతలు ప్రధానంగా ఉన్నాయి. వీటికి తోడు రైతు సంక్షేమం కోసం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వివిధ పథకాల కోసం ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.700 కోట్ల వరకు వ్యయం చేసే విధంగా కేటాయింపులు దక్కనుండడంతో అన్నదాతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

పింఛన్లు.. ఒక రోజు ముందే

(5వ పేజీ తరువాయి)

ఇదే రీతిలో ఇబ్బందులకు గురిచేసేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెన్షన్‌దారులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటోంది.

ఈ నెలలో బకాయిలు కూడా తీసుకోవచ్చు..

గతంలో లబ్ధిదారులు ఏ కారణం చేతనైనా ఒక నెల పెన్షన్ తీసుకోకపోతే తర్వాత నెల ఆ మొత్తం కలిపి ఇచ్చే వారుకాదు. దీంతో లబ్ధిదారులు ఆ మొత్తం నష్టపోయినట్లే. రెండు నెలలు వరుసగా పెన్షన్ తీసుకోకపోతే పూర్తిగా పెన్షన్ తొలగించారు. ఈ క్రమంలో లబ్ధిదారులు ఇబ్బంది పడకూడదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి అనుకూలంగా నిర్ణయం తీసుకుంది. ఏ కారణం చేతనైనా వరుసగా రెండు నెలలు పెన్షన్ తీసుకోకపోతే, మూడో నెలలో రెండు నెలల పాత బకాయి కూడా కలిపి తీసుకునేలా నిబంధనలు మార్పు చేసింది. వరుసగా మూడు నెలల పాటు పెన్షన్ తీసుకోని వారిని పాక్షిక వలసదారులుగా భావిస్తున్నారు. ఆ తర్వాత వచ్చి దరఖాస్తు అందజేస్తే తాత్కాలికంగా నిలిపివేసిన వారి పెన్షన్‌ను పునరుద్ధరిస్తారు. గతంలో ఈ వెసులుబాటు లేదు.

భర్త పెన్షన్ భార్యకు...

ఏ కారణం చేతనైనా పెన్షన్‌దారుడైన భర్త చనిపోతే ఆ పెన్షన్‌ను భార్యకు వెంటనే బదలాయించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భర్త చనిపోయిన పదిహేను రోజుల్లోనే భార్యకు మంజూరు చేస్తారు. లబ్ధిదారులకు అనుకూలంగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ఆయా వర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.



వెలుగువారిపాలెంలో ఎర్రకొండ మట్టిని తవ్వి టిప్పర్‌కు నింపుతున్న ఎక్స్‌కవేటర్

ఎర్రకొండ పిండి..

అనుమతులు గోరంత.. తరలింపు బోల్డంత

వెలుగువారిపాలెం కొండ రూపురేఖలు మాయం

జాతీయ రహదారి నిర్మాణానికి యథేచ్ఛగా తవ్వకాలు

తాళ్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలుగువారిపాలెం ఎర్రకొండను యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. దీంతో కొండ రోజురోజుకూ రూపురేఖలు కోల్పోతోంది. అనుమతులకు మించి గ్రావెల్‌ను తవ్వుతున్నారు. బెంగళూరు హైవే నిర్మాణం పేరిట ఇక్కడ నుంచి యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు. బెంగళూరు నుంచి తాళ్లూరు ప్రాంతం మీదుగా గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి మంజూరైంది. గత ఏడాదిగా ఈ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. హైవే నిర్మాణ మార్గమధ్యంలో వెలుగువారిపాలెం వద్ద సర్వే నంబర్ 489లో 664 ఎకరాల్లో ఎర్రకొండ ఉంది. రోడ్డు నిర్మాణానికి కొండ దగ్గరగా ఉండటంతో కాంట్రాక్టర్ మట్టి, గ్రావెల్ కోసం రెవెన్యూ అధికారులకు, గ్రామపంచాయతీకి దరఖాస్తు పెట్టారు. అప్పటి తహసీల్దార్ కొండను పరిశీలించి పంచాయతీ తీర్మానం మేరకు ఒకటిన్నర హెక్టార్‌లో మట్టిని తవ్వేందుకు మైనింగ్ అధికారులకు ప్రతిపాదనలు పంపారు.ఆ మేరకు మైనింగ్ అధికారులు అనుమతి లభించింది.

అనుమతి ఒకటిన్నరే.. తవ్వేది 25హెక్టార్లలో

అనుమతులు గోరంతగా పొంది తరలింపు మాత్రం కొండంతగా ఉంది. ఈక్రమంలో రోడ్డు నిర్మాణం కోసం ఎర్రకొండ మట్టిని భారీగా తరలించటంతో కొండ పూర్తిగా రూపురేఖలు మారింది. దాదాపు 25హెక్టార్లకుపైగా కొండమట్టిని, గ్రావెల్‌ను తరలించారు. అనుమతికి మించి మట్టిని తోలుతున్నా అప్పట్లో వైసీపీ నాయకులు భారీస్థాయిలో ముడుపులు తీసుకుని మిన్నకున్నారన్న విమర్శలు వచ్చాయి. గత ఏడాది ఫిబ్రవరిలో అనుమతి పొంది మార్చి నుంచి ఆ మట్టిని తోలటం ప్రారంభించారు. గత ప్రభుత్వంలో హద్దులు దాటి కొండలో తవ్వకాలు చేస్తున్నా అధికార యంత్రాంగం మామూళ్ల మత్తులో మునిగిందన్న విమర్శలు వచ్చాయి. కొందరు రెవెన్యూ అధికారులు వెళ్లి పరిశీలించారు కూడా. అయితే ముడుపులు తీసుకుని అక్రమ తవ్వకాల గురించి ఉన్నతాధికారులకు నివేదిక పంపలేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి.

కొత్త ప్రభుత్వం వచ్చినా ఆగలేదు

కూటమి ప్రభుత్వంలో అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట పడుతుందని గ్రామస్థులు ఆశించారు. అనుమతి కంటే ఎక్కువ భూమిలో కొండ మట్టిని తవ్వుతున్నారని కొందరు ఫిర్యాదు చేయటంతో అధికారులు కొండ ప్రాంతాన్ని పరిశీలించి వెళ్లినా తరలింపు ఆగలేదు. కొందరు కూటమి నేతలు గ్రావెల్ దందాలో ఉన్న వైసీపీ నేతలతో, రోడ్డు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై మిన్నకున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఆ కొండ నుంచి గ్రావెల్‌ను తరలించి తూర్పుగంగవరం-ఉలపాడు వరకు కొంతమేర రోడ్డు పనులు చేశారు. గతంలో ఈ కొండపై ఏపుగా గడ్డి పెరిగి ఉండటం వల్ల పశువులు, గొర్రెలు, మేకలను మేతకు తీసుకు వెళ్లేవారు. కొండ మట్టిని పూర్తిగా తరలించటంతో పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో మేతకు వెళ్లిన పశువులు, మేకలు, గొర్రెలు జారిపడితే కన్పించకుండా పోతాయని కాపరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోయినా ఇటీవల వచ్చిన తహసీల్దార్ సంజీవరావు కొండ ప్రాంతాన్ని సందర్శించి నివేదికను జిల్లా అధికారులకు పంపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమంగా మట్టి, గ్రావెల్ తోలకుండా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



డెయిరీలో పన్నీరును పరిశీలిస్తున్న అధికారి ప్రభాకరరావు, సీఐ, ఎస్సై

ముండ్లమూరు సమీపంలోని శ్రీరామ్ డెయిరీలో తనిఖీలు

పలు పాల ఉత్పత్తులపై అనుమానాలు

శ్యాంపిల్స్ తీసి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపిన అధికారులు

కల్తీ కలకలం!

ముండ్లమూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రగిరిలో గత కొన్నేళ్లుగా శరణ్య డెయిరీ, శ్రీరామ్ డెయిరీల్లోని పలు పదార్థాలలో కల్తీ జరుగుతున్నట్లు ఆరోపణలు రావడం, అధికారుల తనిఖీలతో కలకలం రేగింది. కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ రేణంకి గోపాలకృష్ణ ఆదేశాల మేరకు జిల్లా ఆరోగ్య భద్రతా అధికారి, సిబ్బంది, దర్శి సీఐ వై.రామారావు, ఎస్సై వై.నాగరాజు సంయుక్తంగా గురువారం ఉదయం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఆరు రకాల పాల పదార్థాల తయారీపై అనుమానాలు వ్యక్తం చేస్తూ శ్యాంపిల్స్ తీసి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపారు. ప్రధానంగా పన్నీరు, నెయ్యి, పాలకోవా, బటర్ నాన్ లాంటివి తయారుచేసి తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్, వివిధ పట్టణాలకు సరఫరా చేస్తున్నారు.

అత్యాశకు పోయి..

నెయ్యి కేజీ హైదరాబాద్ నగరంతో పాటు పలు ప్రాంతాల్లో రూ.1400 ఉంది. శ్రీరామ్ డైయిరీ సరఫరా చేసేది కేవలం రూ.400 ధర మాత్రమే ఉండటంతో అనుమానాలు వ్యక్తమయ్యాయి. వీటితోపాటు పన్నీరు, పాలకోవా లాంటివి ఇతర మార్కెట్‌లో ఉండే ధరలకంటే తక్కువకు విక్రయిస్తుండటంతో అనుమానాలకు ఊతమిచ్చింది. ఈ దాడుల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు నర్సింహులు, శివతేజ, వీఆర్వో దయానందం, పాల్గొన్నారు.

ముందస్తు సమాచారంతో..

గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్న వ్యాపారంపై అనుమానాలు రావటంతో తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా ఆరోగ్య భద్రతా అధికారి ప్రభాకరరావు తెలిపారు. పాలపొడితో పలు రకాల వస్తువులు తయారు చేసిన విషయాన్ని గుర్తించారు. ముందుగానే ఎస్సై నాగరాజుకు అందిన సమాచారం మేరకు తనిఖీ చేశారు. శరణ్య డెయిరీ జీఎస్‌టీ కూడా లేదని, శ్రీరామ్ డెయిరీ పేరుతో వ్యాపారం సాగిస్తున్నారని సీఐ రామారావు తెలిపారు. కల్తీ పాల దందా ఎక్కువగా దర్శి సర్కిల్ పరిధిలోని ముండ్లమూరు, తాళ్లూరు, దర్శి ప్రాంతాల్లో జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. త్వరలోనే వారి ఆటలు కట్టిస్తామన్నారు. నివేదిక వచ్చిన వెంటనే నిర్వాహకులపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా ఆరోగ్య భద్రతా అధికారి ప్రభాకరరావు తెలిపారు. కల్తీ పదార్థాలు చిన్నపిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయన్నారు. ప్రధానంగా కల్తీ పాలతో క్యాన్సర్ వ్యాధి వస్తుందని చెప్పారు. ఏ ప్రాంతంలోనైనా కల్తీ పాలతో పాటు వాటితో తయారు చేసే పదార్థాలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. పన్నీరు తయారీ కోసం పాలను విరగ్గొట్టాలని చెప్పారు. కొంత మంది తక్కువ మోతాదులో పలు పౌడర్లు వాడి పన్నీరు తయారుచేస్తున్నారన్నారు. డెయిరీ తయారు చేసే ప్రతి పదార్థాన్నీ జిల్లా ఆహార భద్రతా అధికారి, సిబ్బంది, దర్శి సీఐ రామారావు, ఎస్సై నాగరాజులు క్షుణ్ణంగా పరిశీలించారు.

ఇళ్ల నిర్మాణాల లక్ష్యం పూర్తిచేయాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కల్చరల్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 10వతేదీ నాటికి పేదలందరికీ ఇళ్ల నిర్మాణాలకు నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేయటానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సమీక్ష నిర్వహించారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలిసి గృహ నిర్మాణాల పురోగతి, ఎంఎస్ఎంఈ సర్వే, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు, స్కూల్ టాయిలెట్స్ తదితర అంశాలపై ఆమె మండల ప్రత్యేక అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఏపీడీలు, ఏపీవోలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా డిసెంబరు 12వతేదీన లక్ష ఇళ్లను సామూహికంగా ప్రారంభోత్సవాలు చేపడుతున్నారని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.



పుల్లరిపాలెం వద్ద వాగ్వాదానికి దిగిన ఇద్దరు నేతలు

నియోజకవర్గంలో టీడీపీ, జనసేన నేతల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. 'నువ్వెవరు... నీకేం పని.. నీకేం అధికారం ఉంది?' అంటూ నియోజకవర్గంలో కూటమిలోని టీడీపీ, జనసేనకు చెందిన ఇరువురు సాక్షాత్తూ ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, వేటపాలెం తహసీల్దార్ పార్వతి సమక్షంలో వాగ్వాదానికి దిగారు. మూడు రోజుల క్రితం జరిగిన ఈ ఘటనపై వీడియోలు సోషల్ మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఈ అంశంపై రాజకీయవర్గాలో జోరుగా చర్చ సాగుతోంది. వాదనకు దిగిన ఇరువురు వ్యక్తుల్లో ఒకరు జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆమంచి స్వాములు కుమారుడు ఆమంచి రాజేంద్రప్రసాద్ కాగా, రెండో వ్యక్తి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యకు వేటపాలెం మండలంలో క్రియాశీలకంగా పనిచేసిన రాజేష్‌రెడ్డి కావడం విశేషం. దీంతో అంశం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

నువ్వా? నేనా?

- ఆర్డీవో, తహసీల్దార్‌ల ఎదుట టీడీపీ, జనసేన నేతల ఆధిపత్య పోరు
- రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ
- పైకి చెప్పేది ఎస్టీల సమస్య

చీరాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా యథేశ్చగా సాగుతున్నాయి. ఇది బహిరంగ రహస్యం. అయితే వేటపాలెం మండలం పుల్లరిపాలెం ఎస్టీ కాలనీకి చెందిన కొందరు వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, తహసీల్దార్ పార్వతి సిబ్బందితో కలిసి ఫిర్యాదులో పేర్కొన్న ప్రదేశానికి వెళ్లి మూడు రోజులక్రితం విచారణ చేపట్టారు. ఆ క్రమంలో అధికారుల సమక్షంలోనే రాజేంద్ర ప్రసాద్, రాజేష్ రెడ్డి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది.

● అక్రమాల లెక్కలన్నీ తీస్తాం.. మేమూ చూస్తాం..

ఫిర్యాదు చేసిన వారి సమస్య ఎలా ఉన్నా ఆ ఫిర్యాదుపై విచారణ జరిపే అధికారుల సమక్షంలోనే రాజేష్‌రెడ్డి, రాజేంద్ర ప్రసాద్ 'నీకేం పనంటే.. నీకేంపని' అంటూ వాదులాడుకున్నారు. ఆ క్రమంలో ఇసుక దిబ్బలు కొట్టేస్తుంటే గ్రామంలోని వారికి తాగునీటికి ఇబ్బంది ఎదురవుతుందని ఫిర్యాదుదారుల తరపున రాజేంద్రప్రసాద్ వకాల్తా పుచ్చుకుని మాటాడారు. దానికి ప్రతిగా రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్ని సంవత్సరాల నుంచి చెరువులు మాదిరిగా ఇసుక తవ్వకాలు జరిగాయి. ఆ లెక్కలన్నీ తీస్తామన్నారు. అందుకు ప్రతీగా తాము సిద్ధమేనని రాజేంద్ర ప్రసాద్ అన్నారు.

● వారిద్దరినీ వారించిన అధికారులు

ఆ ఇద్దరూ ఆధిపత్యపోరుకు సిద్ధపడటంతో అధికారులు వారించారు. ఆ తరువాత ఫిర్యాదుదారులతోనూ, వారి తరుపు సంఘ పెద్దలతోనూ అధికారులు మాట్లాడారు. వాస్తవాలతో కూడిన నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేశామని అధికారులు తెలిపారు. రాజకీయంగా ఈ వ్యవహారం ఏ మలుపు తిరుగుతుందోనని రాజకీయ వర్గాలతో పాటు సామాన్యుల్లో చర్చ సాగుతోంది.



మంచినీటి పథకం వద్ద చెట్ల తొలగింపులో ప్రొక్లెయిన్, పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

మంత్రి గొట్టిపాటి చొరవతో చిల్లచెట్ల తొలగింపు

అద్దంకిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో మండలంలోని మణికేశ్వరం మంచినీటి పథకం వద్ద ఉన్న చిల్లచెట్ల తొలగింపునకు మొక్షం కలిగింది. కొండపై ఉన్న మంచి నీటి పథకం వద్ద చిల్లచెట్లు మొలిచి కనీసం అక్కడకు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. ఫిల్టర్ బెడ్‌ల వద్ద చెట్ల ఆకులు పడి నీటితొట్లు అపరిశుభ్రంగా మారడంతో ఈ విషయాన్ని గ్రామస్థులు మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. గురువారం టీడీపీ నాయకులు కరిముల్లా, గ్రామస్థులు అశోక్, మౌలాలి, ఆదినారాయణ, అబ్దుల్లా, కృష్ణ తదితరులు ఉండి ప్రొక్లెయిన్‌తో ఆ ట్యాంక్ వద్ద ప్రాంతంలో ఉన్న చెట్లను తొలగించడంతో పాటు కొండపైకి దారి వెంబడి ఉన్న చెట్లు తొలగించి రోడ్డున నడిచేందుకు వీలుగా శుభ్రం చేశారు.

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

● బాపట్ల డీఎస్పీ గోగినేని రామాంజనేయులు



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ రామాంజనేయులు

పర్చూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల పర్యవేక్షణ, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు బాపట్ల డీఎస్పీ గోగినేని రామాంజనేయులు అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం పర్చూరు పోలీసు స్టేషన్‌ను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించి త్వరితగతిన పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ఎస్సై మాల్యాద్రిని ఆదేశించారు. ప్రస్తుతం దొంగతనాలు చోటుచేసుకుంటున్న తరుణంలో రాత్రి సమయాల్లో పోలీసు గస్తీని నిర్వహించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆర్మీ ఉద్యోగి అరెస్టు

చీరాలటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నిజాంపట్నంకు చెందిన ఆర్మీ ఉద్యోగి పిట్టు నాగరాజురెడ్డిని చీరాల టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక కొత్తపేటకు చెందిన లావణ్య తనను పెళ్లి చేసుకుని మోసగించాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అతనికి ఇప్పటికే రెండు పెళ్లిళ్లు చేసుకున్నట్టు, మరొకరితో అక్రమ సంబంధం కొనసాగించినట్టు గుర్తించారు. ఈ క్రమంలో అరెస్ట్‌చేసి కోర్టులో హాజరు పరిచారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి

● దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ఈపూరుపాలెం (చీరాలటౌన్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం గవినివారిపాలెం గ్రామంలో గురువారం రాత్రి గవిని పోలయ్య (83) వృద్ధుడు మృతి చెంది కాలువ వద్ద పడి ఉన్నాడు. ఈ మేరకు ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. అయితే మృతుడు బహిర్భూమికి వెళ్లి జారిపడినట్లు పోలీసులు, బంధువులు చెబుతున్నారు.

ఒక రోజు ముందే పెన్షన్‌ల పండుగ

● సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన



ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం

చీరాలటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సామాజిక భద్రత పెన్షన్‌ల పండుగ ఈసారి ఒక రోజు ముందే రానుంది. ఈసారి ఒకటవ తేదీ ఆదివారం రావడంతో రాష్ట్ర ప్రభుత్వం సమాలోచన చేసింది. సామాన్యులకు, పెన్షన్‌లపై ఆధారడి జీవించేవారికి ఇబ్బంది కలుగ కుండా ఉండాలనే ఆలోచనతో ఒక రోజు ముందే పెన్షన్‌లు పంపిణీ చేయనున్నట్లు మండల ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం తెలిపారు. 30వ తేదీ అనగాశనివారంనాడు అన్ని పంచాయితీల పరిధిలోని పెన్షన్ దారులు అందుబాటులో ఉండి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడివో సూచించారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

● 450 లీట్ల బెల్లం ఊట ధ్వంసం



పట్టుబడిన బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు

చీరాలటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని రామనగర్‌లో నాటుసారా స్థావరాలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గురువారం మెరుపు దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో తయారీకి సిద్ధం చేసిన సుమారు 450 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. దాడులు నిత్యం ఉంటాయన్నారు. సారా తయారీ నేరమని మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో సీఐ నాగేశ్వరరావు సహా పలువురు సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల అల్పాహారం కోసం గురువు వితరణ

పంగులూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పోటీ పరీక్షకు శిక్షణ పొందే పాఠశాల విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటుకు ఉపాధ్యాయిని చెరుకూరి సుజాత రెండు వేల రూపాయలు అందించి వితరణ చాటుకుంది. మండలంలోని చందలూరు ఉన్నత పాఠశాలలో డిశంబరు 8న జరిగే ఎన్ఎంఎంఎస్ పోటీ పరీక్షకు 27 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. వీరికి పాఠశాల ఉపాధ్యాయులు సాయంత్రం వేళ పాఠశాలలో ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేశారు.

పంట నమోదుతోనే ప్రభుత్వ రాయితీలు : ఏవో సుబ్బారెడ్డి

పంగులూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైతులు తాము సాగు చేస్తున్న పంటల వివరాలను రైతు సేవాకేంద్రాల్లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి కోరారు. మండలంలోని బైటమంజులూరు, రామకూరు గ్రామాల్లో పంట నమోదు కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. 2024 - 25 సంవత్సరానికి సంబంధించి రబీలో సాగు చేస్తున్న పంటలను ఫిబ్రవరి 25లోగా రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. పండించిన పంటను ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నా, ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడి పంట నష్టపోయిన సమయంలో రాయితీ పొందటంతో పాటు సున్నా వడ్డీ పథకం, పంట బీమా వర్తించాలన్నా పంట నమోదు తప్పనిసరి అన్నారు.

రక్షణ గోడలేని వంతెన

● పొంచి ఉన్న ప్రమాదం



ఏబీసీ పరిధిలోని పమిడిపాడు మేజర్‌పై ముప్పవరం వద్ద రక్షణ గోడలేని వంతెన

పంగులూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పమిడిపాడు మేజర్‌పై రక్షణ గోడలేని వంతెనతో ప్రమాదం పొంచి ఉంది. అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో ముప్పవరం నుంచి బొమ్మనంపాడు వైపు వెళ్లే ప్రధాన రహదారిలో పమిడిపాడు మేజర్‌పై నిర్మితమైన వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ముప్పవరం నుంచి అద్దంకి వెళ్లే ఈ ప్రధాన రహదారి నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ముప్పవరం గ్రామ రైతులు తమ పంటపొలాల్లో పనుల కోసం నిత్యం ఈ వంతెనపై రాకపోకలు సాగిస్తుంటారు. పంట పొలాలకు ఎరువులు చేరవేయడంతో పాటు వ్యవసాయ పనుల కోసం, పండిన పంట ఉత్పత్తులు, సుబాబుల్ కర్ర చేరవేసేందుకు ట్రాక్టర్లు ఈ వంతెనపై తిరుగుతంటాయి. వీటితో పాటు అద్దంకి నుంచి ఇటుక, సిమెంట్, ఇతర సరుకులు వేర్వేరు ప్రాంతాలకు తరలించే పలు భారీ వాహనాలు, ప్రజా రవాణా కోసం నడిపే కారులు, ఆటోలతో పాటు ద్విచక్ర వాహనాలతో రద్దీగా ఉండే ఈ ప్రధాన రహదారిలో రక్షణ గోడలు లేని వంతెనపై తరచూ వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రివేళ వాహనాల లైట్ల వెలుతురులో మార్జిన్ గుర్తించలేక ద్విచక్ర వాహనదారులు కాలువలో పడిపోయిన సందర్భాలు కోకొల్లలు అంటే అతిశయోక్తికాదు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ ప్రధాన రహదారిలో పమిడిపాడు మేజర్‌పై ఉన్న వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాల బారిన పడకుండా తమకు రక్షణ కల్పించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

మద్యం మత్తులో తండ్రిని చంపిన కొడుకు



మృతి చెందిన వెంకటేశ్వర్లు

అద్దంకిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో తండ్రిని కొడుకు చంపిన ఘటన అద్దంకిలోని భాగ్యనగర్‌లో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు జె.పంగులూరు మండలం కశ్యాపురం గ్రామానికి చెందిన ముప్పరాజు వెంకటేశ్వర్లు (60) కుటుంబం మూడు దశబ్దాల క్రితం అద్దంకి పట్టణంలోని భాగ్యనగర్‌లో నివాసం ఉంటున్నారు. వెంకటేశ్వర్లు లారీ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. భార్య 20 సంవత్సరాల క్రితమే చనిపోయింది. రెండేళ్ల క్రితం వెంకటేశ్వర్లు తల్లి మృతి చెందింది. అప్పటి నుంచి కొడుకు సుబ్బారావు (సుబ్బు)తో నివాసం ఉంటున్నాడు. మద్యానికి బానిస అయిన కొడుకు సుబ్బారావుతో తండ్రికి తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో బుధవారం రాత్రి కూడా తండ్రీ కొడుకులు గొడవ పడ్డాడు. మద్యం మత్తులో ఉన్న కుమారుడు తండ్రిపై దాడి చేయగా చెవి, ముక్కు నుంచి రక్తస్రావం కావడంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు గురువారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. స్థానికులను అడిగి వివరాలను నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటన స్థలాన్ని చీరాల డీఎస్పీ మొయిన్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడి బంధువు చెంచు రామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ కృష్ణయ్య తెలిపారు.



హనుమంతరావు దంపతులను సన్మానిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

విద్యతోనే ఉన్నత స్థానం

మేదరమెట్ల, నవంబరు 28, (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల నిర్విరామ కృషితో విద్యార్థులు నేర్చుకున్న విద్యతోనే ఉన్నత స్థానాలను చేరుకోవచ్చని పలువురు విద్యార్థులు నిరూపించారని పలువురు వ్యక్తం తెలిపారు. శుక్రవారం తిమ్మనపాలెంలోని ఆరివారి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు ఎస్.హనుమంతరావు ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని గురువారం పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ఇంగ్లీషు బోధన ద్వారా మాత్రమే సామాజిక చైతన్యం వస్తుందన్నారు.

నేడు రెవెన్యూ సదస్సుకు మంత్రి రవికుమార్ హాజరు

మేదరమెట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కొరిశపాడు మండలంలో రెవెన్యూ సమస్యలపై అధికారులతో ఉదయం 11 గంటలకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరవుతున్నారు. మండలంలోని రెవెన్యూ సమస్యలున్న వారు తమ సమస్యలను నేరుగా సమావేశంలో నివేదించవచ్చన్నారు.

విద్యార్థులు విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి

మార్టూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతోపాటు వారిలో విషయ పరిజ్ఞానం పెంచుకునే విధంగా ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈవో వస్రాంనాయక్ అన్నారు. గురువారం స్థానిక శ్రీచైతన్య స్కూల్లో విద్యార్థులకు నాసా కిట్లును పంపిణీ చేశారు. నేషనల్ స్పేస్ సొసైటీ, నాసా రీసెర్చ్ సెంటరు సంయుక్తంగా నిర్వహించే నాసా స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్‌లో ప్రాజెక్టు డిజైన్ చేయడానికి శ్రీచైతన్య స్కూల్‌కు చెందిన 27 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. దాంతో నాసా సంస్థవారు విద్యార్థులకు నాసా కిట్లును పంపించారు. వాటిని ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈవో వస్రాంనాయక్ చేతుల మీదగా విద్యార్థులకు అందజేశారు.

కుట్టు మిషన్ అందజేత

నాగులుప్పలపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పేద మహిళకు కుట్టు మిషన్ అందజేశారు. ఇటీవల వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సీడ్‌బాల్స్ తయారు చేసి పాఠశాలలు, కళాశాలల్లో చల్లి మొక్కల పెంపకంనకు దోహదపడినందుకు గాను ప్రోత్సాహకంగా క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఆర్.రవిచంద్ర మండల వాసవీ క్లబ్‌కు మంజూరు చేసిన కుట్టు మిషన్‌ను గురువారం ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన కోడూరి భారతికి క్లబ్ ఇంటర్నేషనల్ మల్టీపుల్ ఉపాధ్యక్షులు కొంజేటి సురేష్‌బాబు చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో అమరా వేణు, పులకణం రాజా, దేసు రవి, సుధాకర్, చంద్రశేఖర్ గుప్త, సామాజిక సేవాకార్యకర్త తెలగతోటి శామ్యూల్ పాల్గొన్నారు.



వెలుగు కార్యాలయంలో మండల సమఖ్య సమావేశంలో పాల్గొన్న అధికారులు, వీవోఏలు

ప్రతి మహిళను లక్షాధికారిని చేయడమే లక్ష్యం

● ఏపీఎం కోటేశ్వరరావు

అద్దంకిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి మహిళ లక్షాధికారి అవ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా రుణ సౌకర్యం కల్పించి, సాంకేతిక శిక్షణ ఇప్పిస్తోందని, వాటిని అందరు సద్వినియోగపర్చుకోవాలని ఏపీఎం కోటేశ్వరరావు అన్నారు. గురువారం వెలుగు కార్యాలయంలో మండల సమఖ్య సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గత ఏడాది సాధించిన ప్రగతి నివేదికలు సమావేశంలో తెలియజేశారు. బ్యాంకు రుణాలు 827 సంఘాలకు రూ.45 కోట్లు, స్త్రీనిధి రుణాలు 208 సంఘాలకు రూ.5.50 కోట్లు, సామాజిక పెట్టుబడి నిధి కింద రూ.22.25 లక్షలు ఇప్పించినట్లు తెలిపారు.

సభ్యత్వంతో కార్యకర్తల కుటుంబాలకు భరోసా

● టీడీపీ బాపట్ల పార్లమెంటు స్థానం మాజీ అధ్యక్షుడు ఏలూరి

మార్టూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి కార్యకర్త పార్టీ సభ్యత్వం తీసుకోవాలని, పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి తెలుగు దేశం పార్టీ కొండంత భరోసా కల్పిస్తుందని పర్చూరు శాసనసభ్యులు, టీడీపీ బాపట్ల పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు ఏలూరి సాంబశివరావు అన్నారు. గురువారం ఆయన ఏలూరి క్యాంపు కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. 2024-26 సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వచ్చేనెల 2లోపు పూర్తి చేయాలన్నారు. వంద రూపాయలు పార్టీ సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు రూ.5 లక్షలు ప్రమాద బీమా ఉంటుందన్నారు. ఒకవేళ ప్రమాదవశాత్తూ మృతిచెందితే వారి కుటుంబానికి మట్టిఖర్చులు నిమిత్తం రూ.10 వేలు అందిస్తామన్నారు. గ్రామాల్లో ప్రతి కార్యకర్త పార్టీ సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పించాలని, సభ్యత్వ నమోదు చేయించాలని ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు.

డొంకలను ఆక్రమించి పైర్లను సాగుచేస్తే చర్యలు

తహసీల్దార్ అనిత

కారంచేడు (పర్చూరు), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డొంకలను ఆక్రమించి పైర్లను సాగుచేస్తే అట్టివారిపై చట్టపరమైన చర్యలు తీసుకోకతప్పదని తహసీల్దార్ అనిత హెచ్చరించారు. ఇలా డొంకలను ఆక్రమించి సాగుచేయటం వల్ల సమీపంలోని రైతులు తీవ్రంగా ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. కారంచేడు గ్రామంలోని ఓ రైతు తమ పంట పొలానికి వెళ్లే డొంకను ఆక్రమించుకొని సాగుచేసుకుంటూ తమ పంట పొలంలోకి వెళ్లేందుకు ఇబ్బంది పెడుతున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకుపోయారు. దీనిపై తక్షణమే స్పందించిన తహసీల్దార్ స్వయంగా పొలంలోకి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలాలకు ఉండే డొంకలు రైతుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసుకున్నవని, వాటిని ఆక్రమించుకొని సాగుచేస్తే తోటి రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుందని అన్నారు.

గుండెపోటుతో అంగన్‌వాడీ ఆయా మృతి

ఇంకొల్లు, నవంబరు 28, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నలతోటివారిపాలెం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ ఆయా రత్నకుమారి బుధవారం గుండెపోటుతో మృతి చెందింది. మృతురాలు రత్నకుమారికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా కార్తీక వన సమారాధన



అలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బల్లికురవ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అంబడిపూడిలోని దుర్గా మల్లేశ్వర స్వామి దేవాలయంలో గురువారం కార్తీక సమారాధనాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి అర్చకులు లక్ష్మయ్య నేతృత్వంలో అభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పెద్దఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు.

లారీ డ్రైవర్లకు అవగాహన



డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న ఎస్సై జి.వి.చౌదరి

బల్లికురవ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం చోటుచేసుకుంటున్న ప్రమాదాలు- వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బల్లికురవ ఎస్సై జి.వి.చౌదరి నేతృత్వంలో గురువారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అతి వేగం వల్ల కలిగే అనార్థాలు, ప్రమాదాలు జరిగిన తరువాత కలిగే ఇబ్బందులు తదితర అంశాలను వివరించారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపి జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి మహిళకు గాయాలు

స్వర్ణ (పర్చూరు), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపుతప్పి మహిళకు గాయాలైన సంఘటన గురువారం కారంచేడు - స్వర్ణ రోడ్డులో చోటుచేసుకుంది. కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన జి.పద్మ, శ్రీనివాసరావు ద్విచక్ర వాహనంపై స్వర్ణ నుంచి కారంచేడు వెళుతుండగా మార్గమధ్యలో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పద్మను 108 వాహనం ద్వారా చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

జ్యోతిబా పూలే చిరస్మరణీయుడు

● ఎమ్మెల్యే కొండయ్య



జ్యోతిబా పూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతిబా పూలె చిరస్మరణీయుడని, ఆయన ఆలోచనలు నిరంతరం అనుసరణీయమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మహాత్మా జ్యోతిబా పూలె వర్ధంతి సందర్భంగా స్థానిక గడియార స్థంభం కూడలిలోని ఆయన విగ్రహానికి కూటమి నేతలతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పూలె అన్ని వర్గాలకు ప్రత్యేకంగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి వేసిన అడుగులను మననం చేశారు. విద్య ప్రాధాన్యతను ఆనాటి కాలంలోనే వెలుగులోకి తెచ్చిన ఆదర్శ ప్రాయుడన్నారు.

● మహాత్మా జ్యోతిబా పూలే ఆశయాలను కొనసాగిస్తామని మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు తదితరులు పేర్కొన్నారు. పూలె వర్ధంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక గడియార స్థంభం సెంటర్‌లోని పూలే విగ్రహానికి వైసీపీ నేతలు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ పూలె ఆలోచనా సరళి అన్ని వర్గాలకు అనుసరణీయమన్నారు. నేటితరం యువత వారి ఆలోచనలకు అనుగుణంగా ఉండాలని పిలుపునిచ్చారు.

● ఇంకొల్లు, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పావులూరులో జ్యోతిబా పూలే వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు గుంజి వెంకట్రావు పాల్గొన్నారు.

నేడు రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేత

పంగులూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పంగులూరు సబ్ స్టేషన్ పరిధిలో నేడు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. విద్యుత్ విస్తరణ పనుల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం రెండు గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

శుక్రవారం 29 నవంబరు 2024

ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కాపాడేందుకు ఏర్పాటు చేసిన ఆడిట్ శాఖ నవ్వులపాలవుతోంది. మున్సిపాలిటీలు, పంచాయతీలు వంటి స్థానిక సంస్థల్లో ఎప్పటికప్పుడు ఆడిటింగ్ చేస్తూ నిధులు పక్కదారి పట్టకుండా చూడాల్సిన ఈ శాఖ అధికారులు కునుకు వహిస్తున్నారు. ఇటీవల పంచాయతీల్లో వెలుగు చూస్తున్న అవినీతి వ్యవహారాలు ఆడిట్ శాఖ అధికారులు, సిబ్బంది పనితీరును వేలెత్తి చూపిస్తున్నాయి. రూ.లక్షలు ప్రజాధనం దుర్వినియోగమైతే ఆడిట్ శాఖ ఏం చేస్తోందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఏటా పోస్ట్ ఆడిట్ చేస్తున్నా నిధుల దుర్వినియోగాన్ని అడ్డుకోలేకపోవడం చర్చనీయాంశంగా మారింది. పంచాయతీల్లో నిధుల దుర్వినియోగానికి బాధ్యులుగా కార్యదర్శులను సస్పెండ్ చేయడం, సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు చేయడం వంటి చర్యలు తీసుకుంటున్నారు. మరి ఆడిట్ చేసి అంతా బాగుందని రిపోర్టు ఇస్తున్న ఆడిట్ అధికారులు, సిబ్బందిని ఎందుకు బాధ్యులు చేయడంలేదన్న ప్రశ్న తలెత్తుతోంది.



హా...డిట్!

- పంచాయతీల్లో విచ్చలవిడిగా నిధుల దుర్వినియోగం
- లెక్కల్లో మాయ చేస్తూ ప్రజలకు పంగనామం
- ఇటీవల వరుసగా వెలుగుచూస్తున్న అవినీతి లీలలు
- మరి ఆడిట్‌శాఖ ముందే ఎందుకు గుర్తించలేకపోతోంది?
- పోస్ట్ ఆడిట్‌లోనూ అంతా బాగున్నట్లు నివేదికలు
- మామూళ్లతో చూసీచూడనట్లు వదిలేస్తున్న వైనం
- ఆడిట్‌శాఖపై సమీక్షించేవారేరీ?



నెల్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధిలో స్థానిక సంస్థలు కీలక భూమిక పోషిస్తుంటాయి. అందుచేతనే కేంద్ర ప్రభుత్వం కూడా ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీలు, మున్సిపాలిటీల ఖాతాలకు జమ చేస్తోంది. వీటికి అదనంగా వివిధ పన్నుల రూపంలో స్థానిక సంస్థలకు రూ.కోట్లు జమవుతుంటాయి. ప్రధానంగా పంచాయతీల్లో ఏ అవసరానికి ఎంత మేర నిధులు వినియోగించాలన్నది చట్టంలో స్పష్టంగా పేర్కొన్నారు. అయితే నిబంధనల ప్రకారం ప్రతిరూపాయిని ఖర్చు చేస్తున్నారా.. లేదా..? అన్నది పరిశీలించే బాధ్యత ఆడిట్ శాఖకు ప్రభుత్వం అప్పగించింది. ఏటా ఆర్థిక సంవత్సరం ముగిశాక ఖర్చులను, వచ్చిన ఆదాయంతో సరిపోలుస్తూ పోస్ట్ ఆడిట్ చేస్తుంటారు. ఎక్కడైనా అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగి ఉంటే ఈ పోస్ట్ ఆడిట్‌లోనే తేలిపోతుంది. ఆ వివరాలను వెంటనే నివేదిక రూపంలో సదరు పంచాయతీకి అప్పగించాలి. అవకతవకలు జరిగి ఉంటే వెంటనే నోటీసు జారీ చేయాలి. సమాధానం వచ్చాక రికవరీకి నోటీసులు ఇవ్వాలి. కానీ జిల్లాలో ఇంత వరకూ రికవరీ(సర్‌చార్జ్) నోటీసులు ఇచ్చిన దాఖలాలు లేవు. ఏటా ఆడిట్ చేయడం, ఆ తర్వాత పంచాయతీలకు అప్పగించి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎందుకు గుర్తించలేకపోతున్నారు?

ఇటీవల జిల్లాలో అనేక మంది పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేశారు. కొందరు సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు చేశారు. నిధుల దుర్వినియోగం, అభ్యంతరకర ఖర్చులతో జిల్లా ఉన్నతాధికారులు ఈ నిర్ణయాలు తీసుకున్నారు. ఒక్క కృష్ణపట్నం పంచాయతీలోనే 2021-2023 మధ్య రూ.1.61 కోట్ల నిధులు దుర్వినియోగం జరిగినట్లు, రూ.2.11 కోట్లు అభ్యంతరకరంగా ఖర్చు చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి విచారణలో బట్టబయలైంది. పొదల కూరు మండలం ప్రభుగిరిపట్నం పంచాయతీలో రూ.1.78 లక్షలు నిబంధనలకు విరుద్ధంగా డ్రా చేసి దుర్వినియోగం చేశారని తేల్చారు. అలానే నెల్లూరు రూరల్ మండలంలోని పలు పంచాయతీల్లో కూడా నిధుల దుర్వినియోగం జరిగిందని నిర్ధారించిన జిల్లా పంచాయతీ అధికారి పలువురు కార్యదర్శులను సస్పెండ్ చేసి సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు చేశారు. ఇవన్నీ జిల్లా పంచాయతీ అధికారుల విచారణలో బయటపడ్డ అక్రమాలు. మరి ఈ పంచాయతీలన్నిటిలోనూ ఆడిట్ అధికారులు ఆడిటింగ్ జరిపారు. మరి వారు ఎందుకు గుర్తించలేకపోయారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఫిర్యాదులు అందిన పంచాయతీల్లోనే జిల్లా పంచాయతీ అధికారులు విచారణలు జరిపారు. మరి అన్ని పంచాయతీల్లో విచారణలు జరిపితే ఇంకెన్ని అక్రమాలు బయటపడతాయోనన్న అనుమానాలు కలుగుతున్నాయి.

సమీక్షించేవారెవరు?

జిల్లా ఆడిట్ శాఖ ఒకటి ఉందని, అది పంచాయతీలు, మున్సిపాలిటీల్లో లెక్కలు చూస్తుందన్న విషయం చాలా మంది సామాన్యులకు తెలియదంటే అతిశయోక్తికాదు. సామాన్యులకే కాదు.. జిల్లా ఉన్నతాధికారులకు కూడా ఆడిట్ శాఖ ఒకటి ఉందన్న విషయం గుర్తుందో.. లేదో.. అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఎందుకంటే అన్ని శాఖల పనితీరుపై రెగ్యులర్‌గా సమీక్షించే జిల్లా ఉన్నతాధికారులు.. ఆడిట్ శాఖపై మాత్రం సమీక్షించడం లేదు. నిబంధనల ప్రకారం తరచూ జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరగాలి. అందులో ఆడిట్ శాఖ నివేదికలపై చర్చించాలి. కానీ జిల్లాలో అవేవీ జరగడం లేదు. ఆడిట్ శాఖ బలంగా ఉండి నిబద్ధతతో ఆడిటింగ్ నిర్వహిస్తే పంచాయతీల్లో నిధుల దుర్వినియోగాన్ని పూర్తిగా అరికట్టవచ్చునని నిపుణులు చెబుతున్నారు. ఆ దిశగా జిల్లా ఉన్నతాధికారులు కూడా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



వేదాయపాళెం వద్ద రోడ్డు దుస్థితి

నగర రోడ్లు.. నరకానికి నకళ్లు!

6

- హడలిపోతున్న సింహపురీయులు

నెల్లూరు నగర రోడ్లంటే వాహనదారులు హడలిపోతున్నారు. నడిరోడ్డుపై మోకాలిలోతున గుంతలు ఏర్పడ్డాయి. కొన్నిచోట్ల ఇటీవల కురిసిన వర్షాలకు వాటిలో నీళ్లు నిలబడంతో గుంతలోతు తెలియక వాహనదారులు అందులో పడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

భయపడొద్దు.. అప్రమత్తంగా ఉండండి!

- కోనలో చిరుత సంచారంపై డీఎఫ్‌వో ప్రకటన



కోనలో కారు హారన్ విని అడవిలోకి పరుగులు తీస్తున్న చిరుత

రాపూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోన పరిసరాల్లో చిరుత సంచారంపై ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని జిల్లా అటవీ శాఖ అధికారి (డీఎఫ్‌వో) మహ బూబ్‌బాషా తెలిపారు. కోనలోని అటవీ పార్కు సమీపంలో బుధవారం రాత్రి చిరుత తిరుగుతుండగా కారులో ఉన్న కొంతమంది పెంచల స్వామి భక్తులు తమ మొబైల్‌లో వీడియో తీశారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతోపాటు సామాజిక మాధ్యమాల్లోనూ ఈ వీడియోలు వైరల్ అయ్యాయి. దీంతో కోనకు వచ్చే భక్తులతోపాటు పరిసర గ్రామాల్లోని ప్రజల్లో భయాందోళన నెలకొంది. బుధవారం ఉదయం కోనకు చేరుకున్న డీఎఫ్‌వో తమ సిబ్బందితో కలిసి చిరుత సంచరించిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిరుత సంచారంపై వెంటనే అటవీ, బేస్ క్యాంపు, రెగ్యులర్ సిబ్బందిని అప్రమత్తం చేసి అటవీ పరిసరాలన్నీ పరిశీలించినట్లు తెలిపారు. చిరుత అడవిలోకి వెళ్లిపోయినందున ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అయితే, అప్రమత్తంగా ఉండాలని, ఎవరూ ఒంటరిగా తిరగొద్దని విజ్ఞప్తి చేశారు.

- ఖాతాల నవీకరణకు మహిళల పరుగో పరుగు
- బ్యాంకులు, పోస్టాఫీసుల వద్ద బారులు
- సంక్షేమ ఫలాలు అందాలంటే ఖాతా తప్పనిసరి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయంతో అధికారుల కసరత్తు



ఖాతాల నవీకరణ కోసం క్యూలో నిలబడ్డ మహిళలు



పోస్టల్ ఖాతా దరఖాస్తు స్వీకరిస్తున్న పోస్టల్ సిబ్బంది

నా అకౌంట్ అప్‌డేటేనా!?

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే జమ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఇందుకు ఖాతాల నవీకరణ (అప్‌డేట్) చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) నిబంధనల ప్రకారం చాలా మంది లబ్ధిదారులు, తపాలా శాఖ లేదా బ్యాంకులలో వారి ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేయలేదు. అలా అనుసం ధానం చేయని 18 సంవత్సరాల వయసు పైబడిన వారిని ప్రభుత్వం గుర్తించి, వారిచేత కొత్తగా బ్యాంకు ఖాతాలు లేదా పోస్టల్ ఖాతాలు తెరిపించి ఆధార్ అనుసంధానం చేయించాలని సచివాల యాలకు ఆదేశాలు జారీ చేసింది. సచివాల యాల వారీగా 18 సంవత్సరాలు పైబడిన వారిని గుర్తించి వారి వివరాలను సచివాల యాలకు పంపింది. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాల లబ్ధి అందనుండటంతో ఖాతాలకు ఆధార్‌ను అనుసంధానం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పోస్టాఫీసులలో ఖాతాల నవీకరణ చేస్తే సంక్షేమ పథకాల లబ్ధి పొందుతారనే ప్రచారం నడుస్తుండటంతో ఈ ఖాతాల నవీకరణ కోసం లబ్ధిదారులు నేరుగా పోస్టల్ కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. గురువారం నెల్లూరులోని ప్రధాన పోస్టల్ కార్యాలయం వద్ద మహిళలు క్యూకట్టారు. వారిని అదుపు చేయలేక అక్కడున్న అధికారులు నానాతిప్పలు పడ్డారు. పోస్టాఫీసులే కాదు, బ్యాంకులలోనూ ఖాతా ఉంటే నవీకరణ చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

3,42,295 మంది గుర్తింపు

ఎన్‌పీసీఐ నిబంధనల ప్రకారం జిల్లాలో 18 సంవత్సరాల పైబడిన 3,42,295 మంది ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేయలేదని గుర్తించారు. వారి జాబితాను గ్రామ, వార్డు సచివాలయాలకు పంపించారు. ఈ ఖాతాల నవీకరణకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ ఆలస్యం కావటంతో పొడిగిస్తూ వస్తున్నారు. తొలుత ఈ నెల 14న నవీకరణకు తుదిగడువుగా ప్రకటించారు. ఆ తరువాత డిసెంబరు 7వ తేదీకి పొడిగించారు. జిల్లాలో 769 సచివాలయాలు ఉండగా, 6300 మంది సిబ్బంది ఉన్నారు. ఖాతాల నవీకరణ అంశంలో ప్రజలకు చైతన్యం కొరవడటంతో ఈ నవీకరణ ప్రక్రియ ఆలస్యంగా సాగుతోంది. జాబితాలో పేర్కొన్న కొంతమంది కొన్ని సచివాలయాల పరిధిలో అందుబాటులో లేరు. ఉపాధి కోసం కొందరు వలస వెళ్లారు. సచివాలయాల్లో కూడా సిబ్బంది కొరత తదితర కారణాలతో

- మిగతా 6లో

మొదటి స్థానంలో నిలుపుతాం



ఎన్‌పీసీఐ నిబంధనల ప్రకారం ఖాతాల నవీకరణలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలుపుతాం. సచివాలయ సిబ్బందితోపాటు మా శాఖ సిబ్బంది కూడా ఈ ఖాతాల నవీకరణపై అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటిదాకా 2,90,508 మంది ఖాతాలను నవీకరణ చేయగా, మిగిలిన 51,787 మందికి కూడా రెండు మూడు రోజుల్లో పూర్తి చేయిస్తాం. బ్యాంకులోనైనా ఖాతా తెరిచి ఆధార్‌తో అనుసంధానం ద్వారా నవీకరణ చేసుకోవచ్చు. బ్యాంకులో ఇప్పటికే ఖాతా కలిగిన వారు ఆధార్ కార్డును ఖాతాకు అనుసంధానం చేయించుకుంటే సరిపోతుంది.

- నాగరాజకుమారి, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ

మెట్ట ప్రాంత ప్రజలకు సురక్షిత నీటిని అందించే లక్ష్యంతో ఒకప్పుడు అమలు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం మళ్లీ ఊపిరి పోస్తోంది. గత వైసీపీ సర్కారు బిల్లులు కూడా ఇవ్వకపోవడంతో నాటి కాంట్రాక్టర్ పనులను అర్ధంతరంగా ఆపేశాడు. దాదాపు రెండేళ్లపాటు పనులు పూర్తిగా ఆగినా పట్టించుకున్న నాథుడు లేడు.

- నెల్లూరు (జడ్పీ, ఆంధ్రజ్యోతి)



ఉదయగిరి రూరల్ : కుర్రపల్లి వద్ద ఏర్పాటు చేసిన సుజల స్రవంతి మదర్‌ప్లాంట్ (ఫైల్)

'సుజలా'ం.. సఫలాం!

- నాటి పథకానికి కూటమి ప్రభుత్వం ఊపిరి
- ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు సురక్షిత నీరు
- పెండింగ్ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు నోటీసులు
- ఆయన స్పందించకుంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

జిల్లాలోని ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో బోర్లు ఏర్పాటు చేసి సురక్షిత నీటిని ప్రజలకు అందించాలన్న లక్ష్యంతో 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో జిల్లాకు ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని మంజూరు చేసింది. ఏఎస్‌పేట, అనంతసాగరం, ఆత్మకూరు, బోగోలు, దగదర్తి, మర్రిపాడు, పొదలకూరు, దుత్తలూరు, ఉదయగిరి, సీతారామపురం, జలదంకి, వరికుంటపాడు, కలిగిరి, కొండాపురం, వింజమూరు 14 మండలాలకు ఈ పథకాన్ని అమలు చేశారు. రూ.49.53 కోట్ల నిధులు కూడా మంజూరు అయ్యాయి. బోర్లు, పైపులైన్‌లు, మదర్‌ప్లాంట్లు ఏర్పాటు చేసి లక్షలాది మంది ప్రజలకు సురక్షిత మంచినీరు అందించాలని పనులను ప్రారంభించారు. 2022 వరకు ఈ పనులు సాగాయి. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. దాదాపు రూ.36 కోట్ల మేర పనులు జరిగినా మరో రూ.14 కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. దాదాపు 80 శాతం పనులు పూర్తయినా కొన్ని గ్రామాలకు కూడా తాగునీటి సరఫరా చేయలేకపోతున్నారు.

డిప్యూటీ సీఎం ఆదేశాలతో..

ఎన్టీఆర్ సుజల స్రవంతి మంచి నీటి పథకం ద్వారా ప్రజలకు సురక్షిత నీరు అందించేందుకు కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. అప్పట్లో మంజూరు చేసిన పథకాలన్నిటిపై సమీక్షిస్తున్న ప్రభుత్వం అందులో భాగంగా ఎన్టీఆర్ సుజల స్రవంతిని పూర్తి చేయాలని, బకాయిలు మంజూరు చేస్తామని పంచాయతీ రాజ్ శాఖా మంత్రి పవన్‌కల్యాణ్ ఇటీవల తెలిపారు. ఈ మేరకు ఆదేశాలు వెలువడటంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పనులపై దృష్టి సారించారు. ఇప్పటివరకు ఏ మేరకు పనులు జరిగాయి. నిధుల మంజూరు ఎంత? బకాయిలు ఎంత.. పెండింగ్ పనుల పరిస్థితి ఏమిటి? తదితర వివరాలను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి అందజేశారు. పనులను ఆపేసిన గత కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేశారు. డిసెంబరు 10వ తేదీలోపు వివరణ ఇవ్వాలంటూ ఆ నోటీసులో పేర్కొన్నారు. ఒకవేళ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆయన్ను బ్లాక్‌లిస్టులో పెట్టడంతోపాటు గతంలో మంజూరు చేసిన డిపాజిట్ల సొమ్మును తిరిగి స్వాధీనం చేసుకోవాలని అధికారులు నిర్ణయించారు. దీంతో కాంట్రాక్టర్ పనులు చేసినా, చేయకపోయినా మరో కాంట్రాక్టర్ ద్వారానైనా డిసెంబరులో సుజల స్రవంతి పనులు ప్రారంభం కానున్నాయి. త్వరితగతిన వాటిని పూర్తి చేయించి కొద్దినెలల్లోనే 14 మండలాల ప్రజలకు సురక్షితనీరు అందించాలని అధికారులు సిద్ధమయ్యారు.

నిధుల కేటాయింపు ఇలా (రూ.కోట్లలో)

మండలం	నిధులు
ఏఎస్‌పేటకు	2.85
అనంతసాగం	3.96
ఆత్మకూరు	3.55
బోగోలు, దగదర్తి	4.18
మర్రిపాడు	4.09
పొదలకూరు	4.59
దుత్తలూరు	3.09
జలదంకి	3.29
కలిగిరి	3.51
కొండాపురం	3.15
సీతారామపురం	3.00
ఉదయగిరి	3.42
వరికుంటపాడు	3.88
వింజమూరు	2.95



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, జేసీ

గొప్ప సంఘ సంస్కర్త పూలే

- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), (ఆంధ్రజ్యోతి) : దేశంలో బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధన, బాలికా విద్య కోసం అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతీ రావు పూలే అని కలెక్టర్ ఆనం ద్ కొనియాడారు. పూలే వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో జ్యోతీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ పూలే అడుగుజాడల్లో పయనిస్తూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో జేసీ కార్తీక్, బీసీ సంక్షేమాధి కారి ప్రసూన, అసిస్టెంట్ బీసీ సంక్షేమాధికారి కే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



చుండి మోడల్ స్కూల్‌లో స్పీడ్ వాక్ ట్రాక్ ఏర్పాటుకు పీఎంశ్రీ పథకం కింద లక్షలు వెచ్చించి నేడు వినియోగించకుండా వదిలేశారు. దీంతో మైదానం వినియోగం లేక పిచ్చిమొక్కలు పెరిగాయి. ఈ ఏడాది మైదానంలో అభివృద్ధికి మరో లక్ష మంజూరు చేసినట్లు సమాచారం. అయితే గత ఏడాది మంజూరు చేసిన నిధులతో వాక్‌ట్రాక్ ఏర్పాటు చేశారే కాని విద్యార్థులు ఒక్కరోజైనా వినియోగించిన దాఖలాలు లేవు.

- వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి)

వెండినందిపై ఆదిదంపతులు

నగరంలోని మూలస్థానేశ్వర ఆలయంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా గురువారం చిన్న వెండినంది వాహనంపై శివపార్వతులకు ప్రాకారోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం ముక్కంటి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, అనంతరం భస్మాభిషేకం జరిగాయి. సాయంత్రం ప్రదోషకాల అభిషేకాలు, పూలంగి సేవ, విశేష పూజల అనంతరం ప్రాకారోత్సవం నిర్వహించారు. ఉభయకర్తలుగా నారపనేని శ్రీనివాసులు, విశాలనీ, కాటంరెడ్డి గోపాల్‌రెడ్డి, విజయలక్ష్మి వ్యవహరించారు. ఈవో జె శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

- నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) :



కుమార్తెపై ప్రేమ.. పచ్చబొట్టు రూపంలో..



గర్భంలో ఉన్నది ఆడ శిశువని తెలిస్తేనే గర్భస్రావం చేయించే ఈ రోజుల్లో ఆడపిల్ల రూపాన్ని పచ్చబొట్టుతో తన శరీర భాగంపై వేయించుకుని ఎప్పుడూ తనతో ఉన్నట్టుగానే భావించుకుంటున్న ఓ యువ తండ్రి కథ ఇది. పొదలకూరులోని శ్రీనివాస లే అవుట్‌లో ఉంటున్న మారుబోయిన శ్రీహరి, సాయిపవిత్ర దంపతులకు (2017లో వివాహ మైంది.) తొలుత ఓ కుమారుడు జన్మించాడు. ఆ తర్వాత 2023లో కుమార్తె జన్మించింది. పాప రుషిత పుట్టిన తర్వాత ఆర్థికం గా, మానసికంగా కలిసొచ్చిందని శ్రీహరి భావించాడు. అంతేగాక 2009లో మరణించిన తన తల్లే కుమార్తె రూపంలో మళ్లీ పుట్టిందని ప్రగాఢంగా నమ్ముతున్నాడు. అందుకోసమే అమ్మపై, పాప మీద తనకున్న ప్రేమను పచ్చబొట్టు రూపంలో కుడిచేతిపై వేయించుకున్నాడు. ఇందుకుగాను శ్రీహరికి రూ.4వేలు ఖర్చు అయ్యింది. ఆ పచ్చబొట్టు చూస్తుంటే పాప, తన అమ్మ తనతో ఉన్నట్టే ఉంటుందని శ్రీహరి చెబుతున్నాడు. ఆడపిల్లలంటే సృష్టికర్తలని, వారిని కని పులిపిల్లల పెంచాలని అంటున్నాడు.

- పొదలకూరు, (ఆంధ్రజ్యోతి)

గజ గజ!

- జిల్లాపై మంచు దుప్పటి
- తగ్గుతున్న ఉష్ణోగ్రతలు.. వణికిపోతున్న జనం



ఆత్మకూరు: ముంబయి హైవేను కప్పేసిన మంచు పరదా

ఆత్మకూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. చలితీవ్రత పెరగడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచే చలిగాలులు పెరుగుతుండటంతో వృద్ధులు, పిల్లలు వణికిపోతున్నారు. పల్లెల్లో కొందరైతే ఇళ్ల ముందు మంటలు వేసుకుని చలి కాచుకుంటున్నారు. మరికొందరు మంచం పక్కన నిప్పుల కుంపటి ఏర్పాటు చేసుకుని వెచ్చగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రాబోవు రోజుల్లో చలి మరింత తీవ్రంగా ఉండవచ్చని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

● నైట్ షెల్టర్లు అవసరం

చీకటిపడగానే చలి తీవ్రత పెరుగుతుండటంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. రోడ్డు పక్కన, బస్టాండ్లలో తలదాచుకునే వారి పరిస్థితి దయనీయంగా ఉంది. నెల్లూరు నగరంతో పాటు కావలి, ఆత్మకూరు, కందుకూరు తదితర పట్టణాల్లోని రోడ్ల పక్కన, బస్, రైల్వే స్టేషన్లలో యాచకులు, అనాథలు జీవిస్తు న్నారు. ఇలాంటి అభాగ్యులకు చలి కాలంలో నైట్ షెల్టర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.



ఉదయగిరిలో రోడ్డుపై నిద్రిస్తున్న యాచకులు



నెల్లూరులో పొగమంచును చీల్చుకుని వస్తున్న రైలు



కొండలు కనిపించకుండా..

● రహదారులను కప్పేస్తూ..

జిల్లాలో రహదారులను మంచు దుప్పటి కప్పేస్తోంది. పొగమంచు వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. కొందరు మంచు తగ్గే వరకు వాహనాలను రోడ్డు పక్కన ఆపేస్తుండగా మరి కొందరు అలాగే ముందుకు సాగి ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు.

● వ్యాధులు ప్రబలే అవకాశం

చలికాలం వల్ల వ్యాధులు ప్రబలుతున్నాయి. పసిపిల్లలు, వృద్ధులు ఎక్కువగా రోగాల బారిన పడుతున్నారు. చల్లదనం పెరగడంతో శ్వాసకోశ వ్యాధులు ఎక్కువగా నమోదవుతున్నాయి. చిన్నారులు జలుబు, దగ్గు, జ్వరాలతో బాధపడుతున్నారు. వృద్ధులలో అయితే రక్తప్రసరణ తగ్గి కాళ్లు, చేతులు చచ్చుబడే ప్రమాదం ఉంది. సహజంగా నవంబరు నుంచి జనవరి వరకు చలితీవ్రత వల్ల విషజ్వరాలు విజృంభిస్తాయి. ఈ నేపథ్యంలో పిల్లలు, వృద్ధులు ఇళ్లలోనే వెచ్చగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. కాగా మంచు ప్రజలతోపాటు పంటలకు కూడా హాని చేస్తుంది. తెగుళ్లు విస్తరిస్తుండటంతో రైతులు నష్టపోతున్నారు.

జాగ్రత్తగా ఉండాలి

చలికాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వృద్ధులు, పిల్లలు జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా శ్వాసకోశ సంబంధిత వ్యాధిగ్రస్థులు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. మధుమేహ బాధితుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గి ఉంటుంది. దానివల్ల పక్షవాతం, ఇతర వ్యాధులు వెంటనే సోకే ప్రమాదం ఉంది. ఉబ్బసం ఉన్న వారికి చలికాలం చేటు తెస్తుంది. వీలైనంత వరకు వృద్ధులు, పిల్లలు మంచుకు దూరంగా ఉండటం మంచిది.

- డాక్టర్ బాలాజి, శ్వాసకోశ వ్యాధి నిపుణుడు, జిల్లా ప్రభుత్వ వైద్యశాల, ఆత్మకూరు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్

జిల్లాను బాల్య వివాహ రహితంగా మార్చాలి: కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను బాల్య వివాహాల రహితంగా మార్చాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జిల్లా స్త్రీశిశుసంక్షేమశాఖ రూపొందించిన కిశోరి వికాసం కార్యక్రమ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. గ్రామ, మండల స్థాయిలో బాల్య వివా హాల నిరోధానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి కిశోరి వికాసం కార్యక్రమాన్ని విజ యవంతం చేయాలని యంత్రాంగానికి సూచించారు. ఈ కార్యక్రమంపై జిల్లా స్థాయిలో శిక్షణ ఇవ్వడానికి ఒక బృందం ఏర్పాటైందని, వారిచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకుని గ్రామ, మం డల స్థాయిలో కూడా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, బాలల సంరక్షణా ధికారి సురేష్, డీఎంహెచ్‌వో పెంచలయ్య, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లల దత్తతలో జాప్యం వద్దు : కలెక్టర్

జిల్లాలో అనాథ పిల్లల దత్తత ప్రక్రియలో జాప్యం లేకుండా త్వరగా పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గురు వారం కలెక్టర్ చాంబర్‌లో అధికారులతో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్నీ అనాథ బాలల వసతి గృహాలు జేజేయాక్టు-2015 ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకుని ఉండాలని స్పష్టం చేశారు. లేకపోతే చట్టపర మైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆధార్ కార్డు లేని అనాథ పిల్లలకు విద్యాశాఖ, ఐటీడీఏ సహకారంతో ఆధార్‌కార్డులు ఇప్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, బాలల సంరక్షణ అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు : కలెక్టర్ ఆనంద్ హెచ్చరిక

నెల్లూరు (వైద్యం), (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఆనంద్ హెచ్చరించారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో లింగనిర్ధారణ నిషేధిత కమిటీతో సమీక్ష నిర్వహించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం నిబంధనల మేరకే స్కా నింగ్ కేంద్రాలను నిర్వహించాలని, చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అల్ట్రాసౌండ్, సిటీస్కాన్, ఎమ్మారై, ఎకో స్కానింగ్ నిర్వాహకులు తప్పని సరిగా పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆదేశించారు. పరీక్షలు నిర్వహించిన ప్రతి గర్భిణి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలపై డెకాయ్ ఆపరేషన్స్ ముమ్మరంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. కాగా, స్కానింగ్ కేంద్రాల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి కమిటీ ఆమో దించింది. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచ లయ్య, మహిళా స్టేషన్ డీఎస్పీ రామారావు, ఎన్జీవో కవితారెడ్డి, డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, డెమో కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

రైతులు బీమా పథకాల్లో చేరాలి: కలెక్టర్

నెల్లూరు(వ్యవసాయం), (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌కు సంబంధించి పంటలు సాగుచేస్తున్న ప్రతి రైతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, పునర్వ్యవస్థీకరిం చిన వాతావరణ ఆధారిత బీమా పథకాల్లో చేరాలని కలెక్టర్ ఓ ఆనంద్ సూచించారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో గురువారం పంటల బీమా పథకంపై జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ మొదటి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ తుఫాన్లు, కరువు, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడి తగ్గి నష్టపోయిన రైతులకు బీమా పథకాలతో ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. తక్కువ ప్రీమియం చెల్లించి ఎక్కువ బీమా పొందే అవకాశం ఉందని, దీనిపై రైతులకు అవగాహన కల్పించి ప్రతి రైతు బీమా చేయించుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరి, మినుము, శనగ, పెసర, వేరుశనగ తదితర పంటలకు ప్రీమియం ఎకరాకు వరుసగా రూ.168, రూ.38, రూ.56, రూ.36, రూ.60 మాత్రమేనని చెప్పారు. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకో వాలని కోరారు. సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, పోస్టాఫీసులు, పీఏసీ ఎస్‌లలో ప్రీమియం చెల్లించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసా యాధికారి పీ సత్యవాణి, ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి, సీపీవో రాజు, ఇరిగేషన్ ఎస్ఈ దేశ్‌నాయక్, బీమా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నా అకౌంట్ అప్‌డేటేనా!?

(5వ పేజీ తరువాయి)

ఖాతాల నవీకరణకు ఇబ్బందులు కలుగుతున్నాయి.

● 9వ స్థానంలో జిల్లా

ఖాతాల నవీకరణలో రాష్ట్రస్థాయిలో జిల్లా 9వ స్థానంలో నిలిచింది. జిల్లాలో 3,42,295 మంది నవీకరణ చేసుకోవాల్సి ఉండగా 2,90,508 మంది ఖాతాల నవీకరణ (84.87 శాతం) చేసుకున్నారు. మండలాల వారీగా చూస్తే వలేటివారిపాలెం ఖాతాల నవీకరణలో ప్రథమ స్థానంలో (98.81 శాతం) ఉంది. చివరి స్థానంలో కలువాయి (63.82 శాతం) ఉంది. 98.53 శాతంతో ముత్తుకూరు 2వ స్థానం, 97.51 శాతంతో గుడ్లూరు 3వ స్థానంలో ఉంది.

వైభవంగా వెంగమాంబ పల్లకీ సేవ



దుత్తలూరు (ఉదయగిరి రూరల్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలం లోని నర్రవాడ గ్రామంలో ఉన్న వెంగమాంబ పేరం టాలమ్మ అమ్మవారికి పల్లకీ సేవను గురువారం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, కార్యనిర్వాహణాధికారి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక చందన అలంకారం, కుంకుమార్చన కార్యక్ర మాలు నిర్వహించి అనంతరం పల్లకీ సేవ చేపట్టారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజులు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



చేపల విక్రయానికి ఉపయోగించే త్రాసును తనిఖీ చేస్తున్న అధికారులు

తూకాల్లో అన్నీ తప్పులే !

- విజిలెన్స్, కార్పొరేషన్, తూనికలు కొలతల శాఖల దాడులు
- చేపలు, మాంసం విక్రయాల్లో తేడాల గుర్తింపు

నెల్లూరు(క్రైం), నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా మాంసాహార ప్రియులు ఎక్కువ. వారానికి మూడు రోజులు చేపలు, రొయ్యలు, చికెన్, మటన్.. వంటివి వండుకుని తింటుంటారు. ఈ క్రమంలో చేపల మార్కెట్లతోపాటు చికెన్, మటన్ స్టాల్స్, రోడ్లపై ఏర్పాటు చేసే చేపల దుకాణాల్లో వ్యాపారం జోరుగా సాగుతోంది. అయితే ఈ వ్యాపారంలో తూకాల్లో మోసం జరుగుతోందని అధికారులు గుర్తించారు. నెల్లూరులోని పలు ప్రాంతాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, కార్పొరేషన్, తూనికలు కొలతల శాఖల అధికారులు గురువారం సంయుక్తంగా ఏకకాలంలో తనిఖీలు చేశారు. తూకాల్లో 100 గ్రాములకుపైగా వ్యత్యాసం ఉందని గుర్తించారు. నగరంలోని డైకస్‌రోడ్డు, పొదలకూరు రోడ్డు, హరనాథపురం, ముత్తుకూరు గేటు ప్రాంతాల్లో మూడు శాఖల అధికారులు నిర్వహించిన తనిఖీల్లో తూకాలు సక్రమంగా లేవని, అనేక దుకాణాల్లో శుభ్రత పాటించడం లేదని నిర్ధారించారు. పది దుకాణాలపై కేసులు నమోదు చేసి వాటి నిర్వాహకులకు అపరాధ రుసుము విధించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి రావు మాట్లాడుతూ రామలింగాపురంలోని జాఫర్‌బాషా చికెన్ సెంటర్‌కు కార్పొరేషన్ శానిటేషన్, తూనికలు కొలతల శాఖల అధికారులు రూ.15 వేలు అపరాధ రుసుము, పొదలకూరు రోడ్డులోని ఎస్ఎస్ చికెన్ సెంటర్‌కు రూ.15 వేలు, మరో 8 దుకాణాలకు రూ. 500 చొప్పున ఫైన్ వేసినట్లు తెలిపారు.

పంచాయతీరాజ్ ఏఈకి షోకాజ్ నోటీసు

ఉదయగిరి రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరాజుకు జిల్లా పంచాయతీ అధికారులు గురువారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. మండలంలో అభివృద్ధి పనులకు సహకరించకుండా ప్రతి పనికి ముందస్తుగానే పర్సంటేజీలు డిమాండ్ చేస్తున్నట్లు ఉదయగిరి వైస్ ఎంపీపీ గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆ శాఖ ఉన్నతాధికారులను విచారణకు ఆదేశించారు. అధికారుల విచారణలో ఏఈ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గుర్తించి మండలంలోని ఐదు పంచాయతీలను తప్పించి, వింజమూరు ఏఈ తిరుమలయ్యకు అదనపు బాధ్యతలు అప్పగించారు. విధుల్లో నిర్లక్ష్యానికి గల కారణాలు తెలుపుతూ పది రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేదంటే శాఖాపరమైన చర్యలు చేపడతామని షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు.

నగర రోడ్లు.. నరకానికి నకళ్లు!

నవ్విపోదురుగాక మాకేటి.. అన్నట్టుగా మారాయి నగర రోడ్లు. రాష్ట్రస్థాయిలో ఎంతో గుర్తింపు ఉండి.. సింహపురి కేంద్రంగా విరాజిల్లుతున్న నెల్లూరు నగర రోడ్లు నరకానికి నకళ్లుగా మారిపోతున్నాయి. ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికార యంత్రాంగం పూర్తిగా విస్మరించడంతో నడిరోడ్లపైనే మోకాలిలోతు గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్లపై తిరుగుతున్న వాహనదారులు, ప్రజలు ప్రమాదాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. కొద్ది రోజులుగా వరుసగా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై ఉన్న గుంతల్లో నీళ్లు నిలిచాయి. ఇవి తెలియక వాహనదారులు గుంతల్లో దిగుతూ బోర్ల పడుతున్నారు. నగరంలోని మినీ బైపాస్, వేదాయపాలెం, డైకాస్ రోడ్డు, పొదలకూరు రోడ్డు, కేవీఆర్ అండర్ బ్రిడ్జి రోడ్డు, నవాబుపేట నుంచి మైపాడుకు వెళ్లే రోడ్డు, స్టోన్‌హౌస్‌పేటలోని ఇందిరాగాంధీ విగ్రహం రోడ్డు, ఆత్మకూరు బస్టాండు నుంచి ఇరుగాళలమ్మ సెంటర్‌కు వెళ్లే రోడ్డు ఇలా చెప్పుకుంటూపోతే నగర మొత్తం గతుకుల రోడ్లే అగుపిస్తాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి, రోడ్లకు మరమ్మతు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

- నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి)



పొదలకూరు రోడ్డు దుస్థితి



ఫోన్ సంభాషణ సరే.. కింద పడితే ఆసుపత్రికే..



వామ్మో ఎంత పెద్ద గుంతనే..



వేదాయపాలెం వద్ద..



అపోలో ఆసుపత్రికి వెళ్లే రోడ్డులో..

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఓటు షిఫ్టింగ్ ఎంతవరకు సాధ్యం

- విద్యార్థులు, పెద్ద వ్యాపారుల మార్పిడికి ఇబ్బంది లేదు
- మిగిలిన వారికి తలనొప్పే
- పూర్తి వివరాలు రాక అధికారుల అవస్థలు

కావలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎక్కడ నివాసం ఉన్నారో అక్కడే మీ ఓటును షిఫ్టింగ్ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్, ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిలు ప్రజలకు పిలుపునిచ్చారు. అందులో భాగంగా ప్రస్తుతం అధికారులు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేపడుతున్నారు. చాలామంది తాము నివాసం ఉంటున్న చోటుకు తమ ఓటును మార్చుకునేందుకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. అంతవరకు బాగానే ఉన్నా.. ఓటు షిఫ్టింగ్‌కు ఇపుడు వయస్సు ధ్రువీకరణ పత్రం నమోదు చేస్తేనే కంప్యూటర్ తీసుకుంటుందని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. వయసు ధ్రువీకరణకు ఆధార్ కాకుండా అదనంగా పదో తరగతి మార్కుల జాబితా, జనన సర్టిఫికెట్, పాన్‌కార్డు నకళ్లు ఇస్తేనే ఓటు షిఫ్టింగ్‌కు అవకాశం ఉంటుంది. వయసులో ఉన్న యువకులు, జనన సర్టిఫికెట్లు, పదో తరగతి మార్కుల జాబితాలు అందుబాటులో



కావలి మున్సిపల్ కార్యాలయం

ఉంటాయి. అలాగే వ్యాపారులు చేసుకునే వారికి పాన్‌కార్డులు ఉంటాయి. మిగిలిన వారు తమ ఓటు షిఫ్టింగ్ చేసుకోవాలంటే అవన్నీ ఎక్కడ తేవాలని.. అది ఎంతవరకు సాధ్యం అవుతోందని ప్రజలు వాపోతున్నారు. అలాగే సచివాలయ సిబ్బంది కూడా వాటిని సేకరించటం కష్టతరం అంటున్నారు. ఈ పరిస్థితుల్లో నివాసం ఉన్నచోటనే ఓటు ఉండాలనే అధికారుల సూచన ఎంతవరకు సాధ్యమవుతోంది. పట్టణంలో అద్దె గృహాలలో ఉన్న వారు తరచూ ఇళ్లు మారుతుంటారు. వీరు నివాసం ఒకచోట ఓటు మరొకచోట ఉంటుంది. వాటిని నివాసం ఉన్న చోటుకే మార్చుకోవటం ఆచరణ సాధ్యమేనా అనే సమస్య ఉత్పన్నమవుతోంది. ఇదిలాఉంటే ఓటు షిఫ్టింగ్‌కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నవారు తాము పెట్టుకున్న అడ్రస్‌లు కొత్తగా వచ్చిన మున్సిపల్ సిబ్బందికి అర్థంకావడం లేదు. దరఖాస్తులను వెరిఫికేషన్ కోసం బీఎల్వోలకు పంపడానికి మున్సిపల్ ఉద్యోగులు తంటాలు పడు తున్నారు. ఇన్ని సమస్యల మధ్య నివాసం ఉన్న చోటనే ఓటు ఉండాలనే అధికారుల ఆదేశాలు ఎంతవరకు సాధ్యపడతాయో వేచి చూడాల్సి ఉంది.

వెలగని వీధిలైటు



పట్టణంలోని ముసునూరు ట్రంక్‌రోడ్డులోని వీధిలైట్లు కొద్దిరోజులుగా వెలగడం లేదు. దీంతో రాత్రిళ్లు ఈ ప్రాంతంలో అంధకారం నెలకొంటుంది. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల నిర్వహణ సక్రమంగా లేకపోవటంతో ఈ లైటు రాత్రి, పగలు తేడా లేకుండా వెలుగి కాలిపోయిందని స్థానికులు వాపోతున్నారు.

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి)

కావలిని కనకపట్టణంగా అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే

కావలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశీస్సులతో కావలిని కనక పట్టణంగా అభివృద్ధి చేస్తానని ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన 15మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలకుల నిర్లక్ష్యంతో నిలిచిన అభివృద్ధి పనులు అన్నింటినీ పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో నేతలు గుత్తికొండ క్రిషోర్‌బాబు, మాలేపాటి నాగేశ్వరరావు, కండ్లగుంట మధుబాబు నాయుడు, బండి అమర్‌రెడ్డి, తిరువీధి ప్రసాద్, దేవరకొండ శ్రీను, జనిగర్ల మనోహర్, దేవకుమార్, బాలాజీ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

● మాటఇస్తే తప్పడు..

బిట్రగుంట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి బేతనీపేటలో సీసీరోడ్డు పనులు ప్రారంభించడం హర్షణీయం అని టీడీపీ బోగోలు ఇన్‌చార్జి, మాజీ ఎంపీటీసీ చిలకపాటి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఆయన రోడ్డు పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే సహకారంతో దళిత, గిరిజన కాలనీల్లో అవసరమైన చోట్ల ఈ రోడ్లు వేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గోచిపాతల సంజయ్, శ్యాంసుందర్, నాగరాజు, సుభాని, వినోద్, బంకా ఫిలిప్, అనిల్, విజయ్, ఫిలోమెన్ రాజు ఉన్నారు.

కమ్మేసిన చిల్లచెట్లు



జమీన్‌ఉప్పలపాడు నుండి కొండసముద్రం గ్రావెల్ రోడ్డు, శింగమనేనిపల్లె- కాకుపాలెం, అయ్యవారిపల్లె - రామలింగాపురం, లింగపాలెం- రోళ్లపాడు వెళ్లే రోడ్లు చిల్లచెట్లతో మూసుకపోయాయి. ఈ సమస్యతో మలుపుల్లో వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రహదారులు ప్రక్కన ప్రమాదకరంగా ఉన్న ముళ్ల చెట్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి)

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ఫూలే

- ఘనంగా 134వ వర్ధంతి
- నివాళులర్పించిన నాయకులు, అధికారులు

కావలి టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు ఫూలే వర్ధంతిని పురస్కరించుకుని గురువారం పట్టణంలో నాయకులు ఆయనకు ఘన నివాళులర్పించారు. టీడీపీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కూడలి ట్రంకురోడ్డులోని ఫూలే విగ్రహానికి, టీడీపీ కార్యాలయంలో ఫూలే చిత్రపటానికి టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష కార్యదర్శులు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబురావు, నేతలు మధుబాబునాయుడు, నాయుడు రాంప్రసాద్, తటవర్తి వాసు, అర్షియా, తిరువీధి ప్రసాద్, ఆత్మకూరి నాగరాజు, చవల రామకృష్ణ, గుండ్లపల్లి శివాజీ, యేటూరి శివ పాల్గొన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పబ్బా సాయి, మన్నేపల్లి రిషికేష్, పసుపులేటి బాబు, మస్తాన్ పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నేతలు బ్రహ్మానందం, అమరా సుబ్బారావు, పరుసు వెంక టేశ్వ ర్లు, మందా కిరణ్, సుందర్ శెట్టి సుజయ్ పాల్గొన్నారు. బీసీ ఐక్యతా భవన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షు లు అద్దంకి ప్రభాకర్, ప్రధా న కార్యదర్శి చిన్నివరప్రసాద్‌లు ప్రభుత్వ ఏరియా వైద్య శాలలో రోగులకు రొట్టెలు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోవిందు పాల్గొన్నారు. చివరిగా రక్తదానం-స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రభుత్వఏరియా వైద్యశాల బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిప ల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, ఆసుపత్రి సూప రింటెండెంట్ పద్మావతి పాల్గొన్నారు. కార్యక్ర మంలో ఆసుపత్రి కమిటీ సభ్యులు చవల రామ కృష్ణ, సంస్థల నిర్వాహకులు ఖాదర్‌బాష, అలీమ్, బ్రహ్మా య్య, ఖాదర్‌బి, మాలకొండారెడ్డి ఉన్నారు.



కావలి : ఫూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు

● అల్లూరు: స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం మహాత్మ జ్యోతిబా ఫూలే వర్ధంతిని పురస్కరించుకొని నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రామిశెట్టి కృష్ణచైతన్య, బండి శ్రీనివాసులు రెడ్డి, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, అంబటి రాజేంద్ర, తిరుమలశెట్టి శ్రీనివాసులు, పరంధామిరెడ్డి, కప్పిరి విష్ణు, బిట్రగుంట వెంకటేశ్వర్లురెడ్డి, వేలూరు శ్రీనివాసులు, పచ్చబట్ల సురేంద్ర, ఖదీర్, నజీర్‌బాషా, ఇమాంసా తదితరులు పాల్గొన్నారు.

నేటి సమాజానికి ఆదర్శమూర్తి ఫూలే

● బిట్రగుంట: టీడీపీ మాజీ మండల కన్వీనర్ పిన్నిబోయిన సుధాకర్ స్థానిక పార్టీ కార్యాలయంలో జ్యోతిరావు ఫూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పాయసం శ్రీనివాసులు, బీసీ నేత దేవరాల తిరుపతి, మునయ్య ఉన్నారు.

● కందుకూరు: స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, చదలవాడ కొండయ్య, చిలకపాటి మధు, గోచిపాతల మోషే, షేక్ రఫీ, మహర్షి శ్రీను, రూబీ, కూనం నరేంద్ర, చుండూరి శ్రీనివాసులు, ముచ్చు శ్రీను, సలాం, మోదడుగు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి పోకూరి మాలకొండయ్య ఆధ్వర్యంలో ఫూలే వర్ధంతిని నిర్వహించారు.



అల్లూరు: నివాళులర్పిస్తున్న బీద గిరిధర్, నాయకులు



బిట్రగుంట: పూల మాలవేస్తున్నసుధాకర్

బాలికలను సంరక్షిస్తూ.. చదివించాలి



కార్యక్రమంలో పాల్గొన్న స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత ప్రాజెక్టు డైరెక్టర్ హేన సుజన్

లింగసముద్రం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బాలికలను చదివించాలని స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత ప్రాజెక్టు డైరెక్టర్ హేనాసుజన్ తెలిపారు. గురువారం పెదపవని అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో మహిళా సాధికారత, బాలల అభివృద్ధి, సైబర్ క్రైమ్స్‌పై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలను అరికట్టాలని, బ్యాడ్ టచ్, గుడ్ టచ్, బాలల హక్కులు, సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కల్పించారు. అలాగే రక్తహీనత, సఖి వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది గురించి, 2006 బాల్య వివాహాల నిరోధక చట్టం, ఫోక్సో యాక్ట్ 2012పై వివరించారు. మహిళలు, బాలికలకు హెల్ప్‌లైన్ నంబర్లు 1098, 181, 112, 1930 గురించి వివరించారు. ప్రిన్సిపాల్ స్నేహలత, ఐసీడీఎస్ సిడిపిఓ అరుణ, సఖి వన్‌స్టాప్ సెంటర్ లీగల్, ఎన్ ప్రశాంతి, సోషల్ కౌన్సిలర్ టి కమల, సూపర్‌వైజర్ రాధాదేవి ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

1న పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం

కావలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఏర్పడి 50 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఆదివారం కందుకూరులో పూర్వవిద్యార్థుల మహాసమ్మేళనం నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సునీల్ తెలిపారు. గురువారం పట్టణంలో సమ్మేళనానికి సంబంధించిన గోడపత్రికలను సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ప్రసాద్, నరేష్, చందు, భాస్కర్, మల్లిఖార్జున, నారాయణ పాల్గొన్నారు.

ఆహారపు అలవాట్లతోనే సంపూర్ణ ఆరోగ్యం

కలిగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆహారపు అలవాట్లతో ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చని సిద్దనకొండూరు ఆయుర్వేద వైద్యాధికారి రోహిణి తెలిపారు. కేంద్రం కొత్తగా చేపట్టిన దేశ్‌కీ ప్రకృతి పరీక్ష అభినయ్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ఎంపీపీ స్కూల్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కేంద్రం ప్రతి ఒక్కరికి అందుబాటులో ప్రకృతి యాప్‌ను తీసుకొచ్చినట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ యాప్‌ను స్మార్ట్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకుంటే ఏ వయసు వారు ఏ ఆహారపు అలవాట్లను పాటించాలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్య సిబ్బంది ఎం.కృష్ణ, సుబ్బారెడ్డి, శ్రీకాంత్, లలిత కుమారి ఉన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ

సీతారామపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సీతారామపురంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను గురువారం ఏపీవో సుహాసిని తనిఖీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సీతారామపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి 132 కేవి సబ్‌స్టేషన్ లో మరమ్మతుల కారణంగా సీతారామపురం సబ్‌స్టేషన్ 33 కేవి ఫీడర్‌కి శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని మండల విద్యుత్ శాఖ ఏఈ శ్రీహరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

వ్యవసాయాధికారుల తనిఖీలు

కందుకూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎరువుల దుకాణాలను గురువారం ఏఓ వి.రాము ఆధ్వర్యంలో నెల్లూరు భూసారపరీక్ష సహాయ వ్యవసాయ సంచాలకులు కన్నయ్య ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్టాకు వివరాలు, స్టాకు రిజిష్టర్లు, ఈ పాస్ మిషన్లలోని నిల్వలను పరిశీలించారు. రైతులకు రసీదు ఇవ్వాలని బిల్లు పుస్తకంలో రైతు సంతకం తీసుకోవాలని సూచించారు. నోటీసు బోర్డులో ఎంఆర్‌పీలు, నిల్వలు చూయించాలని దుకాణదారులకు సూచించారు. రైతులు లిఖితపూర్వక ఫిర్యాదు చేయాలని కోరారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

దగదర్తి, (బిట్రగుంట) నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరివీధిపాడులో సీసీరోడ్డు పనులకు గురువారం సర్పంచు డబ్బు రమణయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి ఆదేశాలతో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి సూచనలతో పనులు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు అల్లం హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి చేజర్ల ఇద్రిస్, నేతలు సుబ్బారావు, మాలకొండయ్య భాస్కర్ ఉన్నారు.

ఎంఈవో తనిఖీ

కావలి టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ముసునూరు పాఠశాలను గురువారం ఎంఈవో గోవిందయ్య తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి లాంగ్ అప్రెంటీస్‌లపై హెచ్‌ఎంను వివరణ కోరారు. పిల్లల సామర్థ్యాలు ఉపాధ్యాయులు భోధనా విధానాలను పరిశీలించి సూచనలిచ్చారు. పిల్లలను కొన్ని ప్రశ్నలడిగా సమాధానాలు రాబట్టారు.

మినీ గోకులానికి శంకుస్థాపన

సీతారామపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సంజీవరెడ్డి నగర్‌లో పల్లెపండుగలో భాగంగా గురువారం మినీ గోకులానికి టీడీపీ జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి తురక వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఈసీ సువార్తయ్య, ఏపీవో సుహాసినీ, టెక్నికల్ అసిస్టెంట్ మురళీకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసాదు, టిడిపి నాయకుడు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దని ఆందోళన

ఉదయగిరి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గండిపాళెం గ్రామంలో మద్యం దుకాణం ఏర్పాటుచేయవద్దని గురువారం బస్టాండ్ సెంటర్‌లో గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఐటీడీపీ కన్వీనర్ రెడ్డిబత్తిన ఉమాసాయిరాం మాట్లాడుతూ ఇటు ఉదయగిరి, అటు వరికుంటపాడు మండలాల గ్రామాలకు అనువుగా గండిపాళెం గ్రామం ఉండడంతో మద్యం దుకాణం ఏర్పాటు చేసేందుకు వ్యాపారులు సన్నాహాలు చేస్తున్నారన్నారు. అందులో భాగంగా గ్రామంలో త్వరలో మద్యం దుకాణం ఏర్పాటు చేయనున్నట్లు ఫ్లెక్సీ సైతం ఏర్పాటు చేశారన్నారు. గ్రామంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని ఇటీవల ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రాలు సైతం సమర్పించామన్నారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో మద్యం దుకాణం ఏర్పాటును విరమించుకోవాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు షేక్ ఇమ్రాన్ యువకులు పాల్గొన్నారు.



గండిపాళెం గ్రామంలో ఆందోళన చేస్తున్న మహిళలు

'హుండాయ్'కు 'ప్రకాశం' విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

కందుకూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రెండు లక్షల రూపాయల వార్షిక వేతనంతో 40 మంది ఫైనలియర్ విద్యార్థులు హుండాయ్ కంపెనీకి ఎంపికైనట్లు ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల టెక్నికల్ డైరెక్టర్ విజయ్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం కాలేజీలో కంపెనీ హెచ్‌ఆర్ మౌలాలి, కుతుబ్‌లు నిర్వహించిన ఎంపికకు 77మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి హైదరాబాదు హోండా కంపెనీలో విధుల్లో చేరేందుకు నియామకపత్రాలు అందజేశారు. కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, మెకానికల్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్. కోటయ్య, ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి సాహిత్య, సుమలత పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ

కావలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభీరామిరెడ్డి గురువారం సాయంత్రం స్థానిక మద్దూరుపాడులోని ఎంఎల్ఎస్ పాయింట్ గోదాంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పాస్ చేయకుండా సరుకులు ఎత్తవద్దని అలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పరిశుభ్రతకు చర్యలు చేపట్టండి

ఉదయగిరి రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతో ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉండేలా అధికారులు, సిబ్బంది చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామకృష్ణరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

న్యూస్ బాక్స్

సూడోమోనాస్ వాడండి

అల్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతులు వరిసాగులో చేపట్టే సస్యరక్షణలో అనవసర రసాయన మందులు పిచికారి చేయకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సూడోమోనాస్ వినియోగించాలని మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం నార్తుమోపూరులో రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వరిపంటలో సంభవించే పలు రకాల తెగుళ్లు రానీయకుండా చేస్తుందన్నారు. కార్యక్రమంలో వీఏఏలు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

వలేటివారిపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు కాకుమాను ఆంజనేయులు ఆధ్వర్యంలో గురువారం నాయకులు, కార్యకర్తలు టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో కాకుమాను ఆంజనేయులు, వీరమోసు అంజయ్య, చుండూరి కోటేశ్వరరావు, నందాడి నాగేశ్వరరావు ఉన్నారు.

గృహనిర్మాణ శాఖ ఇన్‌చార్జిగా ఏఈగా నాగరాజు

లింగసముద్రం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల గృహనిర్మాణశాఖ ఇన్‌చార్జి ఏఈగా నాగరాజు నియమితులయ్యారు. గురువారం స్థానిక గృహనిర్మాణ శాఖ కార్యాలయంలో విధుల్లో చేరారు. లింగసముద్రం మండలంలో కొంతకాలం నుంచి పెంట్రాల ఇంజనీరింగ్ అసిస్టెంటు ఎం.వెంకటేష్ ఇన్‌చార్జిగా ఏఈగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆ శాఖ ఉన్నతాధికారులుమండల గృహనిర్మాణ శాఖ ఏఈగా పచేస్తున్న నాగరాజును ఇక్కడకి ఇన్‌చార్జిగా పంపారు.

లింగసముద్రం ఆర్ఐగా రమణయ్య

లింగసముద్రం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల ఆర్ఐగా కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రమణయ్యను నియమించారు. గురువారం ఆయన విధుల్లో చేరారు. కార్యాలయంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్, సచివాలయాల్లో ముగ్గురు వీఆర్ఓలు, ముగ్గురు సర్వేయర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని కూడా భర్తీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శబరిమలకు తరలిన అయప్ప భక్తులు

వలేటివారిపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పలు గ్రామాలకు చెందిన అయ్యప్ప మాలధారులు స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఇరుముడులు కట్టుకొని శబరిమలకు బయలుదేరి వెళ్లారు. అంతకుముందు అర్చకులు చంద్రకాంత్ ముందుగా స్వామికి అభిషేకం చేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులతో ఆలయం కిక్కిరిసిపోయింది.

మద్యం సీసాల స్వాధీనం

కావలి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చెన్నాయపాలెం బెల్టు దుకాణంపై గురువారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మకాలు చేపడుతున్న అరగల క్రిష్ణబాబును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 15మద్యం బాటిళ్లు, అరగల క్రిష్ణయ్య వద్ద 18 మద్యం బాటిళ్లు స్వాధీనం చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. గ్రామంలో మద్యం అమ్మకాలు చేపడుతున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. ఈ మేరకు కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. దాడుల్లో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ దేవిక పాల్గొన్నారు.

సమస్యలపై శ్రద్ధ చూపండి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్

అనంతసాగరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సంపూర్ణమ్మ ఆధ్య ర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో సమస్యలను ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తెచ్చారు. వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏవో మస్తాన్ పాల్గొన్నారు.

సాగునీటి సంఘాలకు ఎన్నికలు

ఉదయగిరి రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలోని సాగునీటి సంఘాలకు వచ్చేనెల 8వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు జలవనరుల శాఖ డీఈ కందుకూరు చంద్రమౌళి పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలోని సీతారామపురం మండలంలో 6, ఉదయగిరి మండలంలో 11 చెరువులకు, గండిపాళెం జలాశయం పరిధిలో 17 డిస్ట్రిబ్యూటరీలు మొత్తం 34 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను సిద్ధం చేశామని, 5న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. పేరు లేని రైతులు దరఖాస్తు చేసు కోవచ్చన్నారు.

అర్హులందరికీ అందేలా సంక్షేమ పథకాలు

● హేమంత్ భరత్‌కుమార్, ఏవో, వలేటివారిపాలెం



వలేటివారిపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్హులైన రైతులందరికీ ప్రభుత్వసం క్షేమ పథకాలు అందేలా తమ వంతు కృషి చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి హేమంత్ భరత్‌కుమార్ తెలిపారు

? ఎరువులు అందిస్తున్నారా?

! ఎరువులు కావల్సిన రైతులు రైతుసేవా కేంద్రాల్లో నగదు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకుంటే సరఫరా చేస్తాం. ప్రస్తుతం బడేవారిపాలెం సొసైటీలో ఎరువులు సరఫరా చేస్తున్నాం.

? పంటలు సాగులో ఉన్నవి.

! మండలంలో మినుము, మిర్చి, వరి, శనగ, పొగాకు పంటలు సాగులో ఉన్నాయి.

? ఇపుడే వర్షం కురిస్తే పంటలకు నష్టమా ?

! ఇప్పుడు అన్ని పంటలకు ఓ మోస్తారు వర్షం అవసరం. అత్యధికంగా వర్షం కురిస్తే శనగ, పొగాకు, మినుము పంటలకు స్వల్పంగా నష్టం వాటిల్లే అవకాశం ఉంది

? విత్తనాల సరఫరాలో ఎలా ఉంది.

! ప్రస్తుతం సబ్సిడీపై శనగ విత్తనాలు కోసం రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు సరఫరా చేస్తున్నాం.

? సిబ్బంది కొరత ఏమైనా ఉందా.

! మండలంలో 15 రైతు సేవాకేంద్రాలు ఉన్నాయి. 15 మంది విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లలో 8మంది మాత్రమే ఉన్నారు. ఒక్కొక్కరు రెండేసి రైతుసేవా కేంద్రాలకు పని చేస్తున్నారు.

నేడు పెయ్యదూడల ప్రదర్శన

వరికుంటపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కనియంపాడులో శుక్రవారం దూడల ప్రదర్శన, పోటీలు నిర్వహించనున్నట్లు పశు వైద్యాధికారి రాఘవేంద్రశర్మ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సహకారంతో మేలుజాతి లేగ, పెయ్యదూడల ప్రదర్శన నిర్వహించి విజేతలకు బహుమతులతో పాటు ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు తెలిపారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ఉదయగిరి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):కొండాయపాళెం రెవెన్యూ పరిధిలోని సర్వరాబాదు గ్రామం వద్ద గల సర్వే నెంబర్ 740లో గురువారం వీఆర్వో మాల కొండయ్య హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. 10.54 విస్తీర్ణంతో ప్రభుత్వ భూమిగా నమోదై ఉన్న ఆ భూమిని సాగు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని గ్రామస్థులు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దారు ఆదేశాల మేరకు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినట్లు వీఆర్వో తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లో ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని సాంఘీక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ బీ శ్రీనివాసులు సూచించారు. గురువారం రాత్రి నర్రవాడ ఎస్సీ బాలుర వసతిగృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.